సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 13 - ఆదివారం 19 మార్చి, 2017 సంపుటి : 2 సంచిక 25 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## మోడీ మోత: ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో బీజేపీ ప్రభంజనం

యూపీలో మొత్తం అసెంబ్లీ సీట్లు 403
గెలుపుకోసం 202 సీట్లు సాధించాలి
ప్రస్తుత ముఖ్యమంత్రి సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్

| పార్టీ | గెలిచినవి |
|---|---|
| బీజేపీ | 322 |
| ఎస్పీ+ కాంగ్రెస్ | 55 |
| బీఎస్పీ | 21 |
| స్వతంత్రులు | 5 |

ఉత్తరాఖండ్‌లో మొత్తం సీట్ల సంఖ్య 70
గెలుపుకోసం 36 సీట్లు కైవసం చేసుకోవాలి
అధికారపార్టీ : కాంగ్రెస్
ముఖ్యమంత్రి హరీష్‌రావత్

| పార్టీ | గెలిచినవి |
|---|---|
| బీజేపీ | 57 |
| కాంగ్రెస్ | 11 |
| ఇతరులు | 2 |

## మణిపూర్, గోవాలో హంగ్: అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్

గోవాలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 40
గెలుపు పార్టీలు 20 సాధించాలి
అధికార పార్టీ బీజేపీ
ముఖ్యమంత్రి : లక్ష్మీకాంత్ పర్సేకర్

| పార్టీ | గెలిచినవి |
|---|---|
| కాంగ్రెస్ | 16 |
| బీజేపీ | 13 |
| ఇతరులు | 10 |

మణిపూర్‌లో మొత్తం సీట్లు 60
గెలుపుకు 30 సీట్లు అవసరం
కాంగ్రెస్ అధికారంలో ఉంది.
ముఖ్యమంత్రి ఓక్రాం ఇబోబిసింగ్

| పార్టీ | గెలిచినవి |
|---|---|
| కాంగ్రెస్ | 25 |
| బీజేపీ | 22 |
| స్వతంత్రులు | 10 |

పంజాబ్‌లో మొత్తం అసెంబ్లీ స్థానాలు 117
గెలుపుకు 59 స్థానాలు అవసరం
అధికార పార్టీలు బీజేపీ, శిరోమణి అకాలీ దళ్
ముఖ్యమంత్రి : ప్రకాశ్‌సింగ్ బాదల్

| పార్టీ | గెలిచినవి |
|---|---|
| కాంగ్రెస్ | 77 |
| ఆప్ | 21 |
| బీజేపీ | 2 |
| ఇతరులు | 17 |

# మోడీ మ్యాజిక్

## అన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీలకు చావుదెబ్బ





సంబరాలు చేసుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

**రాజధాని డెస్క్ :** ఐదురాష్ట్రాల్లో అధికారపార్టీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో కంటె ముఖ్యమైంది, 403 అసెంబ్లీ సీట్లు కల పెద్దరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో మోడీ ప్రభంజనం మార్మోగింది. అధికార, ప్రతిపక్షాలను మట్టికరిపించింది. ఆరాష్ట్రంలో ముస్లిం, దళితులపై మతతత్వవాదుల దాడులు, ఏబీవీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు, జేఎన్‌యూ ఘటనలు, భావప్రకటనా స్వేచ్ఛపై విద్యార్థుల పోరాటం, నల్లధనాన్ని అరికట్టే పేరుతో పెద్దనోట్లను రద్దుచేసి ప్రజలను బ్యాంకుల ముందు నిలబెట్టడం లాంటి చర్యలు పార్టీ వ్యతిరేకతను పెంచలేదు సరికదా.. బీజేపీకి మరింత బలాన్ని సమకూర్చడం దేశప్రజలను నివ్వెర పోయేలా చేసింది. బీజేపీ హవా కొనసాగుతూ 322 సీట్లు గెలుచుకుంది. ఇంతవరకు బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించని విషయం తెలిసిందే.. ఈ ఎన్నికల విజయం బీజేపీకి మరింత బలానిస్తుందనడంతో సందేహంలేదు. ఎంతో అభివృద్ధి చేశాం, రాష్ట్రంలో బీఎస్పీతో అయినా జతకట్టి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అని చెప్పిన యూపీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ కేవలం 55 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముస్లింలకు, దళితులకు ఎక్కువ సీట్లు కేటాయించిన బీఎస్పీ (మాయావతి)పార్టీ కేవలం 21 సీట్లు గెలుచుకుంది. ఉత్తరప్రదేశ్ సీఎం రేసులో బీజేపీ నేతలు సిద్ధార్థ్ నాథ్, యోగి ఆదిత్యానంద, మౌర్య పేర్లు వినిపిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో మొత్తం 70 అసెంబ్లీ సీట్లకు బీజేపీకి 57 సీట్లు వచ్చాయి.

### గోవాలో బీజేపీకి ఎదురుగాలి!

**పనాజి :** ఫిబ్రవరి 4న జరిగిన గోవా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 83 శాతం పోలింగ్ నమోదైంది. మరి రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలు.. ఎటువైపు ఉన్నారో తెలిపే ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాల్లో బీజేపీ అధికారం చేపడుతుందని కొన్ని.. బీజేపీ అతిపెద్దపార్టీగా అవతరించినా మేజిక్ ఫిగర్‌ను అందుకోవడం కష్టమని మరికొన్ని సర్వేలు తెలిపాయి. అయితే ఫలితాల ఎర్లీ ట్రెండ్స్‌లో కాంగ్రెస్ దూసుకుపోతుండటంతో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పేలా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం గోవాలోని మొత్తం 40 స్థానాలకు గాను 3 స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్.. 8 స్థానాల్లో ముందంజలో ఉంది. బీజేపీ 6స్థానాల్లో విజయం సాధించి.. నాలుగు స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇతరులు ఆరు స్థానాల్లో ముందంజలో ఉన్నారు. గోవా సీఎం లక్ష్మీకాంత్ పర్సేకర్.. కాంగ్రెస్ అభ్యర్థి దయానంద్ సోప్టే చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక ఆధిక్యం రాకపోతే ఏ పార్టీతో కలిసేది లేదంటూ విజయంపై దీమా వ్యక్తంచేసిన ఆప్.. ఎర్లీ ట్రెండ్స్‌లో ఒక్కస్థానంలో కూడా ముందంజలో లేకపోవడం గమనార్హం. కుంకొలిమ్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎల్విస్ గోమ్స్ సైతం వెనుకంజలో ఉన్నారు.

### మణిపూర్: పుంజుకున్న కాంగ్రెస్

మణిపూర్ 2017 ఎన్నికల లెక్కింపు ప్రారంభమైంది. మొత్తం 60 నియోజవర్గాల్లో అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మణిపూర్ లో ఓట్ల లెక్కింపు సాగుతున్న అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ రాష్ట్రంలో 31 స్థానాల్లో చేజిక్కించుకున్న పార్టీయే అధికారం చేజిక్కించుకుంటుంది. ప్రాథమికంగా అందిన సమాచారం బీజేపీ కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్టు తెలుస్తోంది.

**ఉక్కు మహిళకు తప్పని ఓటమి**

మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఇబోబీ సింగ్ అఖండ విజయం సాధించారు. ప్రత్యర్థి ఇరోం షర్మిలపై

- మిగతా 2 లో





ఉభయసభలను అనుసరిస్తూ మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

5లో

## ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

**శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ కరస్పాండెంట్ మల్లెల**

**రాజధాని ప్రతినిధి- అమరావతి :** వారం రోజులలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఒత్తిడికి లోనుకాకుండా విద్యార్థులు సిద్ధం కావాలని స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ కరస్పాండెంట్ మల్లెల శ్రీనాథ్ చౌదరి అన్నారు. హైస్కూల్‌లో జరిగిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు శ్రీనాథ్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రదానోపాధ్యాయులు కె లక్ష్మినారాయణ అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఉద్దేశించి శ్రీనాథ్ చౌదరి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికీ కన్నతల్లిదండ్రులను, పాఠశాలను, గురువులను మరిచిపోరాదని

- మిగతా 2 లో



మల్లెల శ్రీనాథ్ చౌదరిని సన్మానిస్తున్న విద్యార్థులు



# రాజధాని వార్తలు

కలం

## కట్..కట్‌లకు కట్ చెబుదాం

అందరూ ఎదురుచూసిన అసెంబ్లీ సమావేశాలు మార్చి 6న ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగాన్ని ఆద్యంతం సభ్యులంతా ఆసక్తిగా విన్నారు. గవర్నర్‌కు అడ్డు తగిలి అధికారపక్ష పార్టీని అడ్డుకునే ప్రయత్నం విపక్షాల సభ్యులు చేయకపోవడం ముదావహం. రెండోరోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలర్పించిన టీడీపీ ప్రతినిధులు ముందడుగులో దూసుకుపోతుందన్నారు. ప్రతిగా ముఖ్యమంత్రి రికార్డు సమయంలో సచివాలయ, అసెంబ్లీ భవనాలు కట్టించారని మంత్రులు పొగిడారు. ఇంతవరకుబాగున్నా విపక్షనేత జగన్ మాట్లాడుతున్నప్పుడు అధికార పక్షనేతలు అడ్డుతగలడం, రెచ్చగొట్టే కామెంట్లు చేయడం సరికాదు. ఈసారి అసెంబ్లీలో జగన్ కాస్త సంయమనం, విజ్ఞత చూపించారని అనుకోవచ్చు. అయితే ఎప్పటిలా స్పీకర్ మైక్ కట్‌చేయడం టీవీ వీక్షకులకు విసుగు తెప్పించింది. ఇలాంటి చర్యలతో అధికారపార్టీ బదనాం అవ్వడంతప్ప ఏమాత్రం ప్రయోజనం చేకూరదని, ఎందుకు గుర్తించలేకపోతోందో తెలియడం లేదు. సభను సక్రమంగా నడిపి, విపక్ష, అధికార పక్ష సభ్యులకు సమయం కేటాయిస్తే వారి ప్రసంగాలను తిలకించిన ప్రజలకు ప్రభుత్వం ఏం చేస్తోందో తెలుస్తుంది. ప్రభుత్వాలపై , ప్రజాస్వామ్యంపై నమ్మకం ఏర్పరుచుకునే అవకాశంతోపాటు అసెంబ్లీ కార్యక్రమాల పట్ల, మంత్రులు, స్పీకర్ వ్యవహారంపై గౌరవం కలుగుతుందని గుర్తించాలి. అంతేకాని పదేపదే మైక్ కట్ చేయడం భావ్యంగా ఉండదు. అదే విధంగా ఒకరి ప్రసంగం అవ్వకుండానే స్పీకర్ మరొకరికి అవకాశం ఇవ్వడం సరికాదు. విషయ పరిజ్ఞానానికి , సంపూర్ణ అవగాహనకు సభను సజావుగా సాగే విధంగా జరపడం స్పీకర్ బాధ్యతగా గుర్తుంచుకోవాలి. ఎప్పుడు మైక్ కట్ అవుతోందో ఎప్పుడు ఉంటుందో తెలియన పరిస్థితి ఉంటుందని విపక్షపక్షాలు ఆందోళన చెందటాన్ని తీవ్రంగా పరిగణించాలి. నిజానికి ఇలాంటి పరిస్థితుల్లో అధికారపక్షం ప్రజల నమ్మకాన్ని కోల్పోతుంది. ఒక్కసారి స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తి తాను సభకు అధ్యక్షుడినని, సభను సజావుగా ప్రజాస్వామ్యవిలువలను పరిరక్షించుకోవాలని అనుకుంటే ఈ పరిస్థితి తలెత్తదు.

మరో ముఖ్యవిషయం రోజా ను మరోసారి అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ విషయం.. ఇప్పటికే ఏడాది పాటు అసెంబ్లీ సమావేశాలను నుంచి సస్పెండ్ చేసిన రోజాను మరో ఏడాదిపాటు సస్పెన్షన్‌ను పొడిగిస్తామని అధికార పార్టీ లీకులు ఇవ్వడం దురదృష్టకరం.. ఎందుకంటే చిన్నచిన్న విషయాలకు, లేదంటే రెచ్చగొట్టేలా మాట్లాడే అధికార పక్ష మహిళా సభ్యులపై రోజా అంతగానే ప్రతిస్పందిచడంతో ఈ పరిస్థితి దాపురించింది. అయితే దానిని ఇంకా కొనసాగించడం కక్షసాధింపుగా భావించాల్సి ఉంటుంది. ఇప్పటికే దీనిపై రోజా సుప్రీంకోర్టు గడపతొక్కిన విషయం తెల్సిందే... రోజా క్షమాపణ చెప్పాలని ఆర్థిక, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి యనమల ఇంకా కోరడం సరికాదు. ప్రతిసారి ఎమ్మెల్యే అనిత ఆమెపై ఫిర్యాదు చేయడం, దానిని సభాసంఘం స్వీకరించడం ఒక తంతుగా మారిందని ప్రజలు ఏహ్యాభావాన్ని పెంచుకుంటున్నారు. తెలుగుదేశం మిత్రపార్టీకి చెందిన బీజేపీ శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ కూడా ఈ విషయంపై అధికార పక్షానికి హిత బోధ చేస్తున్నారు. ఆమె విషయాన్ని పెద్దదిగా చేసి సభా సమయాన్ని వృధా చేయవద్దని కోరుతున్నారు. ఇప్పటికే సభను 13 రోజులకు కుదించడం సరికాదని, ఇంకా పెంచాలన్న ప్రతిపాదనకు తెలుగుదేశం ముందుకు రావడం లేదని ఆయన విమర్శిస్తుండటం తెలిసిందే.. నిరసనలు, వాకౌట్లు, వాయిదాలతో కాకుండా ఉన్న కొద్ది సమయాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. సోమవారం నుంచి జరిగే శాసనసభా సమావేశాలు ప్రజల ఆకాంక్షలు మేర ప్రజాస్వామ్య పరిరక్షణను పునరుద్దరించే విధంగా జరుపుతారని ఆశిద్దాం...

## ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఉన్నత ఫలితాలు సాధించి కింద తరగతి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ పాలకమండలిఅధ్యక్షుడు శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడు వి సత్యనారాయణ కార్యదర్శి జి వెంకటేశ్వర రావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్ హిందీ ఉపాధ్యయురాలు మంజుల రూపొందించిన త్రిభాషా నిఘంటువును ఆవిష్కరించారు. హిందీలో 9వేల పదాలను నిఘంటువులో కూర్చిన మంజులకు కరస్పాండెంట్ శ్రీనాథ్‌చౌదరి, పాలక మండలి సభ్యులు, సహచర బోధనా సిబ్బంది సన్మానించి అభినందించారు.

## మోడీ మ్యాజిక్

(మొదటిపేజీ తరువాయి)

భారీ మెజార్టీ తో ఆయన విజయం సాధించారు. అయితే సుదీరె పోరాటం తర్వాత ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికల్లో పోటీచేసిన ఆమెకు ఓటమి తప్పలేదు. ఈ శాసనసభ ఎన్నికల్లో పీపుల్స్ రిసర్జెన్స్ అండ్ జస్టిస్ అలయన్స్ పేరుతో బరిలోకి దిగారు. ముఖ్యమంత్రి వ్యతిరేకంగా తోబల్ నియోజక వర్గం నుంచి పోటీచేశారు. మరో వైపు 2012 ఎన్నికల్లో విఫలమైనప్పటికీ ఈ సారి బీజేపీ మణిపూర్‌లో చారిత్రక విజయం సాధిస్తుందని బీజేపే ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సంగతి తెలిసిందే. కాగా ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం మణిపూర్ లో కాంగ్రెస్ పుంజుకుంది. బీజేపీ కన్నా స్వల్ప ఆధిక్యలో కొనసాగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ 12 స్థానాల్లో, బీజేపీ 11 స్థానాల్లో ఇతరులు 5 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.

### పంజాబ్ 'హస్త'గతం!

పంజాబ్ శాసన సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. అధికార అకాలీదళ్‌ను ప్రజలు గట్టిగానే తిరస్కరించినట్లు కన్పిస్తోంది. కెప్టెన్ అమరీందర్‌సింగ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టే దిశగా దూసుకెళ్తొంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న అకాలీదళ్–భాజపా కూటమి, ఆమ్ ఆద్మీ పార్టీ రెండో స్థానం కోసం పోటీపడుతున్నాయి. ఎగ్జిట్‌పోల్స్‌ను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ భారీ ఆధిక్యం వ్కెపు వెళ్తొంది. 117 స్థానాలు కలిగిన పంజాబ్‌లో ఇప్పటివరకు వెల్లడించిన ఫలితాల్లో కాంగ్రెస్ 6, ఆప్, అకాలీదళ్–భాజపా చెరో స్థానంలో గెలుపొందాయి. కాంగ్రెస్ 71 స్థానాలు, అధికార అకాలీదళ్ 18, ఆప్ 18 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నాయి.


**ఆధిక్యంలో సిద్ధూ**

**అమృత్‌సర్:** మాజీ క్రికెటర్, కాంగ్రెస్ తూర్పు అమృతసర్ అభ్యర్థి నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. పంజాబ్‌లో ఇప్పటికే కాంగ్రెస్ భారీ అధిక్యంలో కొనసాగుతోంది. మొత్తం 63స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు దిశగా కాంగ్రెస్ పయనిస్తోంది. ఇక ఎన్‌డీఏ కూటమి 30చోట్ల, ఆప్ 25స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. 59స్థానాల్లో గెలిచిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది.



తాళ్లాయపాలెంలో శరవేగంగా సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు

## భారతరాజ్యాంగ హక్కులు



రాజ్యాంగం (constitution) ఏ దేశానికైనా ప్రాథమిక మార్గదర్శి. ఇది ఒక ప్రామాణిక గ్రంథం. దేశ, రాష్ట్ర ఉన్నతన్యాయస్థానాలు వీటికి సంబంధించిన కేసుల్ని పరిష్కరిస్తాయి. ఏదైనా రాజ్యాంగం సంబంధించిన సమస్య ఉత్పన్నమైనప్పుడు దానిని రాజ్యాంగ ధర్మాసనానికి పంపిస్తారు. భారత రాష్ట్రపతి రాజ్యాంగ ధర్మాసనాన్ని సలహా కోరవచ్చు.

1950 జనవరి 26వ తేదీన మనరాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఆరోజు మన 'రిపబ్లిక్‌డే' కావటం విశేషం. రాజ్యాంగానికి రాష్ట్రపతి అధిపతి, అయితే, కేంద్రక్యాబినెట్, ప్రధాని నేతృత్వంలో రాష్ట్రపతికి సహాయకులుగా ఉంటారు.

వాస్తవానికి ప్రధాని దేశపరిపాలన చేస్తారు. మంత్రులు ఆయనకు సహాయకులుగా ఉంటారు. (ఆర్టికల్ 74 (1) ) ప్రధాని, ఆయన క్యాబినెట్ సభ్యులు పార్లమెంటుకి (లోక్‌సభకు) జవాబు దారీగా ఉంటారు. ఇదేవిధంగా రాష్ట్రాలలో గవర్నర్లు – ముఖ్యమంత్రి, క్యాబినెట్ సభ్యులు సంబంధాలు ఉంటాయి.

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అధికాంపరిధులు స్పష్టంగా నిర్వహించబడ్డాయి. చట్టాలను చేయగల అధికారం పార్లమెంటుకే ఉంది.

మైనారిటీ (18 సం॥లు) తీరినప్రతిపౌరుడు, ఎలాంటి అనర్హతలు (దేశ నివాసి కాక పోవటం, మతిస్థిమితం లేకపోవటం, అనైతిక, చట్ట విరుద్ధచర్యలు చెయ్యనివారు)లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

## పౌరులు–చట్టాలు

### Law-Citizen

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

హైకోర్టు న్యాయవాది

98495 68901 / 83309 68901

katuruRavindraTrivikram@gmail.com



రాజ్యాంగం ప్రకారం న్యాయవ్యవస్థకు ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. అలాగే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (సి.ఎ.జి), దీన్నే 'కాగ్' అంటారు., పబ్లిక్ సర్వీస్ కమిషన్లు . దేశ వ్యాప్తంగా న్యాయవ్యవస్థ పరిపాలనాధిపతుల (ఎగ్జిక్యూటివ్ ) నుండే వేరు చేయబడింది. ఇది అన్ని స్థాయిల్లో ఉంది. అంటే – సాధారణ కోర్టు నుండే సుప్రీంకోర్టు వరకు, స్వతంత్రంగా వ్యవహరించగల స్వేచ్ఛ కోర్టులకు ఉంది.

**రాజ్యాంగ నేపథ్యం**

ఒకదేశ చరిత్రకి, రాజ్యాంగరచనకి సంబంధం ఉంటుంది. మనదేశ చరిత్ర అనేక మలుపులు తిరిగింది. రాజుల కాలంలో, బలవంతుదేరాజు' సిద్ధాంతంగా రాజ్యవ్యాప్తి జరిగేది. ఎవరు అత్యధిక భూభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోగలరో వాళ్లే చక్రవర్తులయ్యారు. భారతదేశం చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయి ఉండటం, శత్రుదాడులకు, ఆక్రమణకు సులభమార్గమైంది.


దురాక్రమణ జరిగినప్పుడల్లా దాని దుష్ప్రభావాలు ప్రజల సుఖశాంతుల మీద పడుతుండేవి. ఆచార సంప్రదాయాలు,మతవిశ్వాసాలకు భంగం కలిగేది.

సంకరమంగోలు జాతికి చెందిన మొగలాయిల దాడిబాబరుతో మొదలయింది. అది క్రమంగా భారతదేశంలో అత్యధిక భూభాగాన్ని తమ కైవసం చేసుకోనే వరకు కొనసాగింది. ఔరంగజేబు వరకు పటిష్టంగా ఉన్న మొగల్ సామ్రాజ్యం బహదుర్‌షా కాలానికి బలహీన పడింది. ఆంగ్లేయుల ఆధిపత్యం మొదలైంది. వారు కూడా అత్యంత విస్తారమైన భారత దేశాన్ని తమ వశం చేసుకున్నారు. అపారమైన ధన సంపదన్ని తమ దేశానికి తరలించుకువెళ్ళారు. కరువుకాటకాలు (బెంగాల్ కరువు), సంస్కృతి సంప్రదాయాలకు హానివంటివి భారతదేశాన్ని అతలాకుతలం చేశాయి.

గాంధీ నాయకత్వంలో శాంతి సమరం సాగించిన భారత్‌దాస్యశృంఖాలాలను ఛేదించుకోగలిగింది. ఇక రాజ్యాంగ విషయానికి వస్తే 1919 ,1935 సం॥ల్లో చేయబడిన భారతప్రభుత్వచట్టాలు– "రాజ్యాంగాలన్నీ గతానికి వారసత్వాలు, భవిష్యత్తుకిప్రామాణికాలు" అనే నిర్వచనానికి పైరెండు చట్టాలు ఆలంబనంగా ఉన్నాయి. భారతప్రభుత్వం 1919 చట్టంలో రాజ్యాంగానికి మూలాలు ఉన్నాయి. 1935 చట్టం భవిష్యత్తుకి బాటవేసింది. మొదటిది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను వేరు చేసింది. వీటి నిర్ణయాధికారం గవర్నరు జనరల్ చేతిలో ఉండేది. కేంద్ర చట్టాలను సవాలు చేసే అధికారం ఎవరికీ ఉండేది కాదు.

(సశేషం)

## మొదటిసారి అసెంబ్లీ కార్యక్రమాలు చూశా..



ఎప్పుడెప్పుడా అని అందరూ ఎదురు చూసిన అసెంబ్లీ సమావేశాలు మార్చి 6న ప్రారంభం అయ్యాయి. మా మండలంలోని ప్రజలకు నాకు, ఇదొక కొత్త అనుభూతి. రాజధానిప్రాంతం రాయపూడికి చెందిన పఠాన్ హుస్సేన్ ఖాన్ అనే నేను, అమెరికాలో 15 ఏళ్ల పాటు నా చదువుకు సంబంధంలేని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా... అయిన వారందరికీ దూరంగా ఎక్కువ కాలం ఉండలేకపోయా...అందుకే స్వదేశం వచ్చేయ్యాలని నిర్ణయం తీసుకున్నా... అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని ప్రాంతంగా తుళ్లూరు,పెనుమాక,మంగళగిరి మండలాల్ని ప్రకటించారు. ఒక జర్నలిస్టు మిత్రుడు పేపరు పెడదాం అని సలహా ఇచ్చాడు. ఆన్‌లైన్ బ్లాగింగ్ లో అనుభవం ఉన్న నేను ప్రింట్ మిడియా మొదలు చేయటానికి సంశయించా. ఢిల్లీ జేఎన్‌యూ రీసెర్చ్ స్కాలర్ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికా వెళ్లినట్లే.. మళ్లీ ప్రింట్ మిడియా జర్నలిజంలోకి అడుగుపెట్టా. కళ్లెదుటే సీదాసాదా పల్లెటూరు రాజధానిగా మారడాన్ని రికార్డు చేసే అవకాశం కూడా ఉంటుందన్న అభిప్రాయంతో 2015 అక్టోబరు 4న "రాజధాని వార్తలు పత్రిక"ను ప్రారంభించాం. పాడిపంటలకు నెలవైన ఈ ప్రదేశంలో రోడ్డు రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి, అయితే రాజధాని పుణ్యమా అని రోడ్లు, భవనాలు పెరిగాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నా... రాష్ట్రరాజధాని ప్రారంభోత్సవం, ప్రధానిరాక, కేంద్రమంత్రులను రాజధాని గ్రామాల ప్రజలు తిలకించారు. అమెరికాలో అతి ముఖ్యమైన అన్ని నగరాలు చూసిన నాకు అసెంబ్లీ కార్యకలాపాలు ఎలా జరుగుతాయో తెలీదు. నాకే కాదు మా ఊరి పరిసరప్రాంతాల్లో చాలా మందికి తెలీదు. చంద్రబాబు ఇక్కడే సచివాలయం కట్టడంతో అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అవకాశం కలిగింది. అందరూ ఎదురు చూస్తున్న అసెంబ్లీ సమావేశాలు మార్చి 6న ప్రారంభం అయ్యాయి. ఆ సమావేశాలకు ముందు వచ్చిన విలేకరులకు మాత్రమే కుర్చీలు దక్కాయి. మిగతావారు కిందకూర్చోవడం, లేదా నిలబడటం చేయాల్సి వచ్చింది. గవర్నర్ ప్రసంగం తాలూకు ప్రతులు కూడా అందరికీ అందలేదు. అయితే ఐఎన్‌పీఆర్‌లో ప్రతులు ఉన్నాయని చెప్పడంతో జర్నలిస్టు మిత్రులందరం తీసుకున్నాం.. ఆరోజు ఉదయం 11 గంటలకు జాతీయ గీతం జనగణమణతో శాసనసభా సమావేశాలు ప్రారంభం అయ్యాయి. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ 58 నిముషాలు ప్రసంగించారు. కొన్ని ముఖ్యమైన అంశాలు చదివివినిపించినపుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు బల్లలు చరుస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దాదాపు 12 గంటలకు గవర్నర్ ప్రసంగం జాతీయ గీతంతో ముగిసింది.. ముగించిన అసెంబ్లీ కార్యక్రమాలను మరుసటి దినానికి వాయిదా వేశారు. అలా ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక ఘట్టానికి సాక్షీభూతంగా నిలవడం నాకు ఆనందానిచ్చింది.

**– హుస్సేన్ ఖాన్**

**ఎడిటర్, రాజధాని వార్తలు**

## గుంటూరులో ట్రాఫిక్ ఇక్కట్లు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** నవ్యాంధ్ర రాజధానిగా గుంటూరు– విజయవాడ ప్రాంతాలతో కూడిన అమరావతిని ఎన్నిక చేయడంతో ఈ ప్రాంతంలో జనసాంద్రత విపరీతంగా పెరుగుతోంది. వెలగపూడిలో తాత్కాలికి సచివాలయం నిర్మించడం , హైదరాబాద్‌నుంచి సచివాలయ ఉద్యోగులను తరలించడంతో విజయవాడ–గుంటూరులకు ట్రాఫిక్ సమస్య పరాకాష్టకు చేరుకుంటోంది. మరీ ముఖ్యంగా గుంటూరులోని అరండల్‌పేట,ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 1965లో అరండల్ పేటలోని 800 మీటర్ల రోడ్డును రాష్ట్రంలో మొదటిరోడ్డుగా పేర్కొంటూ అప్పటి ముఖ్యమంత్రి నీలంసంజీవరెడ్డి ప్రారంభించారు. చేబ్రోలు హనుమయ్య, కొత్తరఘురామయ్యలాంటి కాంగ్రెస్ అగ్రాగేసురులు అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు పదవీకాలంలో విశేష కృషి చేయగా,దాని నిర్మాణం నీలం



సంజీవరెడ్డి హయాంలో పూర్తయింది. వంతెన నిర్మాణంతో రోడ్లు, భవనాల శాఖ గుంటూరు 1 గుంటూరు 2లను ఏకం చేసింది. దీంతో ఈ ప్రాంతంలో వ్యాపార, నివాస స్థలాలకు గిరాకీ పెరిగింది. గుంటూరు రెండో టౌన్‌లో పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం ధనికవర్గాలకు, ప్రముఖ రాజకీయనాయకులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. బ్రాడీపేట, అరండల్ పేట, లక్ష్మీపురంలకు ఇదే బ్రిడ్జి రూటు కావడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. దీనిపై కాలేజీ బస్సులకు పోలీసులు అనుమతి ఇవ్వడంలేదు. హిందూ కాలేజీలోని మాజీ రీడర్, ఎల్ఎస్ఎన్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే టీ వెంకటరావులు మార్కెట్ జంక్షన్‌నుంచి అరండల్ పేట

### అరండల్‌పేట ఫ్లైఓవర్ వెడల్పు విస్తరించడమే మార్గం

మీదుగా, మదర్ థెరిసా విగ్రహ సెంటరు వరకు వచ్చేవిధంగా ఢిల్లీకి చెందిన సంస్థతో ఫ్లై ఓవర్‌నిర్మించాలన్న ప్రయత్నాలు ఫలించలేదు. బ్రిడ్జి వెడల్పును పెంచాలన్న 2004 నుంచి 2014 వరకు సాగించిన ప్రయత్నాలు కూడా వృధా అయ్యాయి. మణిపురం నుంచి కంగరగుంట వరకు రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ప్రాజెక్టులపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే వేణుగోపాలరావు రైల్వేమంత్రితో చర్చిస్తున్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం జరిగితే గుంటూరుకేకాకుండా, అమరావతికి కూడా జంక్షన్‌కు కూడా ఉపయోగపడుతుందని పార్లమెంటు సభ్యుడు గల్లా జయదేవ్ గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) విజయశర్మకు తెలియచేశారు. దీనిపై ఢిల్లీ అధికారులతో మాట్లాడనున్నామని త్వరలో ఈ విషయంపై నిర్ణయం వెలువడుతుందన్న ఆశాభావాన్ని శర్మ వ్యక్తం చేశారు.

## అకాల వర్షంతో మిర్చికి భారీ నష్టం

- తడిసిపోయిన మిర్చి కల్లాలు
- పంట చేతికొచ్చే సమయంలో వరుణుడి కన్నెర్ర
- ఆందోళనలో అన్నదాత

**రాజధాని ప్రతినిధి– గుంటూరు ( రెంటచింత, వెల్దుర్తి, క్రోసూరు,మాచర్ల ) :** జిల్లాలో అకాల వర్షంతో మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లింది.. కోతకోసి ఎండబెట్టిన మిరపకాయలు తడిసిపోయాయి. ఆరుగాలం శ్రమించి పంట పండించిన అన్న దాతలపై వరుణుడు కన్నెర్ర చేస్తున్నాడు.. అసలే సరైన ధర లేక అల్లాడుతుంటే.. ఈ అకాల వర్షం మమ్మల్ని నట్టేట ముంచిందని రైతన్న వాపోతున్నాడు. ఆకాల వర్షానికి మిర్చిపంటకు నష్టం వాటెల్లింది. కోతకోసి ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. పల్నాడు ప్రాంతంలో ఉన్న రెంటచింతల, గురజాల, మాచర్ల, వెల్దుర్తిలలో భారీ వర్షాలు కురిసాయి. దీంతో పాటు క్రోసూరు మండలంలో కూడా వర్షం కురిసింది దీంతో మిర్చి రైతన్న నిండా మునిగిపోయాడు. పంట చేతికొచ్చే తరుణంలో వర్షం కురవడంతో రైతన్న లబోదిబోమంటున్నాడు. లక్షలాదిరూపాయిలు పెట్టుబడులు పెట్టిన తర్వాత అకాల వర్షం వలన నష్టపోయామని రైతన్న ఆవేదన చెందుతున్నాడు. ఎకరం మిర్చి పంటకు సుమారు రూ.1 లక్ష పెట్టుబడి అవుతుంది. గత సంవత్సరం దిగుబడులు ఆశాజనంగా ఉండి మద్దతు ధర అనుకూలంగా రావటంతో మండలంలో ఈ ఏడాది ఎక్కువ శాతం రైతులు మిర్చి పంట వైపు మొగ్గుచూపారు. గత సంవత్సరం కంటే కూలీల రేట్లు రెట్టింపు అయి తడిసి మోపెడవుతుంది. ఈ ప్రాంతంలో మిర్చియార్డు అనుకున్న సమయానికి నిర్మాణం జరిగి ఉంటే ఆంధ్రా, తెలంగాణ, రాయల సీమ రైతులకు చాలా ఉపయుక్తంగా ఉండేది. రైతుకు మేలు చేయాల్సిన ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ వారి కంట్లో మట్టి కొట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ రైతులకు బాసటగా ఉంటామనే నక్క వినయాలు చాటుతూ కాలం



వెళ్లబుచ్చటం అనుసుషం ఇటువంటి పోకడలు మాని రైతులకు మేలు చేసే విధంగా సత్వర నిర్ణయాలు తీసుకొని మిర్చి పంటకు రూ.12వేల కనీస మద్ధతు ధరను ప్రకటిస్తే రైతుకు ఐదు వేళు నోట్లోకి పోయే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

**క్రోసూరులో..**

ఆకాల వర్షంతో మరో మారు మిర్చి రైతు భంగపాటుకు గురయ్యాడు సాయంత్రం పడ్డ వర్షంతో మిర్చి రైతులు పట్టలు తీసుకొని పరుగులెత్తారు. అసలే ధరలు అడుగంటి ధరా ఘాతంలో తల్లడిల్లిపోతునన్న రైతన్నకు వర్షంతో కుదేలయ్యారు. రైతులు కల్లంలో ఆరబోసిన కాయలు కొన్నయితే, చేసు మీద కోయాల్సిన కాయలు కొన్ని. ఈ వర్షం వల్ల కాయలు మచ్చులు రావడమే కాక తెల్లకాయలుగా మారి పోతాయని రైతులు వాపోతున్నారు. క్వింటా కాయలు కోయాలంటే కూలీలకు 3,000 రూ. అవుతుందని దానికి తోడు ఎగుమతి ఖర్చులు పంట ఖర్చు చూసుకుంటే అసలుకే మోసం వస్తుందని కౌలు రైతు అయితే అప్పులు ఊబిలో కూరుకొని పోవడమే తప్పితే లాభం ఏమీ ఉండదని మిర్చి రైతులు వాపోతున్నారు.

**రెంటచింతలలో..**

ఆకాల వర్షంతో మిర్చి రైతు విలవిలలాడిపోయారు. మండలంలోని వివిధ గ్రామాలలో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు వీధులు జలమయం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పంట పండించిన అన్నదాతలు దిగుబడి చేతికి వచ్చే సమయానికి వరుణుడు వెంటాడుతున్నాడు. ఈ ఏడాది ఆరంభం నుంచి వానలతో అష్టకష్టాలు పడిపంటలు సాగు చేస్తే చివర వరకు వర్షం వీడకుండా పల్నాడులోని అన్నదాతలను నట్టేట ముంచుతూనే ఉంది. మిర్చి కోతలు కోసి ఆరబోశారు. గ్రౌండింగ్ చేస్తున్న సమయంలో వర్షం ముంచెత్తింది. అసలే మిర్చికి గిట్టుబాటు ధర లేక క్వింటా ధర రూ. 5,500 నుంచి రూ.6 వేలు మాత్రమే పలుకుతూ పెట్టుబడి కూడా రాని నేపథ్యంలో వర్షం పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షానికి మిర్చి తడిసిపోవడంతో ధర పూర్తిగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన మిరపకాయలను కంటకన్నీరు కారుస్తున్నారు.

**మాచర్ల మండలంలో...**

రాయవరం, కొత్తపల్లి, గన్నవరం, కంభంపాడు తదితర గ్రామాలలో కురిసిన అకాల వర్షానికి పంటలు తడిసి ముద్దయ్యాయి. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయానికి వర్షం కురవటంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాలలో ఉన్న రైతాంగానికి ఈ వర్షం మరింత నష్టాన్ని చేకూర్చింది. నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు రావటంతో పంటలను కాపాడుకునేందుకు రైతాంగం పట్టలను సైతం సమకూర్చుకున్నా గాలితో కూడిన వర్షానికి ఫలితం దక్కలేదు. మిర్చి అధికంగా పండించే కొత్తపల్లి, కంభంపాడు, భైరవునిపాడు గ్రామాలలో మిర్చి కల్లాల్లో నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాయవరం గ్రామంలోని చలమల శ్రీనివాస్‌గౌడ్ అనే రైతుకు చెందిన 2 ఎకరాల అరటితోట ఈదురు గాలుల దాటికి పూర్తిగా నేలమట్టమై రూ.2 లక్షల నష్టాన్ని చేకూర్చింది. అదే గ్రామానికి చెందిన రైతు చలమల రామయ్య తన పంట పొలంలోని 50 క్వింటాళ్ల ఆరబెట్టిన మిర్చి కల్లంలోకి నీరు చేరింది. నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు.

# తర్వాలో కొత్తగవర్నర్ ?

## విజయవాడ లేదా హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయం

**రాజధాని ప్రతినిధి ;(అమరావతి) :** ఆంధ్ర రాష్ట్రానికి త్వరలో కొత్త గవర్నర్ నియమితులైతారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులైన ఈఎస్ఎల్. నరసింహన్ రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల ఏరడిన ప్రత్యేక రాజకీయ కారణాల వల్ల ఏపీకు కొత్త గవర్నర్‌ను తెలుస్తోంది. ఏపీలో త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ చేపట్టే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు, అందుకు తగ్గట్టుగానే తనయుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్ననారా లోకేష్‌ను మంత్రి వర్గంలోకి తీసుకొనేందుకు ముందస్తుగా ఎమ్మెల్సీ పదవివి కట్టబెట్టారు. దీనికి తోడు వైసీపీ నుండి టీడీపీలో చేరిన 21 మంది శాసనసభ్యుల్లో కొందరికి మంత్రి పదవులు ఇచ్చే ఆలోచనలో కూడా సీఎం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత గవర్నర్ నరసింహన్ పార్టీ ఫిరాయింపునని చెప్పినట్లు ఇప్పటికే మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనికి ప్రధాన కారణం కూడా నరసింహన్ తెలంగాణలో టీడీపీ ఎమ్మెల్యే శ్రీనివాసయాదవ్ టీఆర్ఎస్‌లో చేరి మంత్రి అయిన సమయంలో అక్కడి టీడీపీ నేతలు గవర్నర్‌ను టార్గెట్ చేసి ఇది రాజ్యాంగ ఉల్లంఘన అంటూ విమర్శలు చేశారు. తిరిగి మరోసారి తాను ఆ తప్పు చేసి విమర్శలకు గురి కాలేనని గవర్నర్ నరసింహన్ ఇప్పటికే చంద్రబాబు క్యాబినెట్‌లో ఓ సీనియర్ మంత్రి ద్వారా సీఎంకు సందేశం పంపినట్లు టీడీపీ వర్గాల్లో ప్రచారం జరిగింది. దీంతో ఈ విషయం టీడీపీ నేతలు కేంద్రానికి సమాచారం చేరవేయడంతో కేంద్రం ఏపీకు కొత్త గవర్నర్‌కు నియమించే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌తో సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఉండటంతో కేంద్రం ఈ విషయంపై దృష్టి సారించలేని, ఎన్నికలు ముగియటం, ఫలితాలు కూడా వెలువడుతుండటంతో ఇక కేంద్రం కొత్త గవర్నర్ల నియామకంపై దృష్టి సారిస్తుందని అధికార పార్టీ సీనియర్లు చెప్పుకొస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ కూడా ఉగాది రోజున కానీ, ఏప్రిల్ రెండవ వారంలోపు గాని జరుగుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే దేశంలో కొన్ని రాష్ట్రాల గవర్నర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీలు భర్తీ చేసే సమయంలో ఏపీకు కొత్త గవర్నర్‌ను నియమిస్తారని, ఒక వేళ కొత్త గవర్నర్ నియామకం జరిగితే ఇటీవల వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో క్యాంపు కార్యాలయంగా ఉపయోగించిన ఇరిగేషన్ శాఖ భవనాన్ని కాని, హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయంగా వినియోగించిన లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌లో తాత్కాలిక రాజ్‌భవన్‌గా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.

# ఎల్‌పీజీ ధరల పెంపుపై భగ్గుమన్న ప్రతిపక్షం

## కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వాకౌట్

**న్యూఢిల్లీ :** ఎల్‌పీజీ ఉత్పత్తులు ముఖ్యంగా సబ్సిడీరహిత వంట గ్యాస్ సిలిండర్ల ధరల పెంపుపై లోక్‌సభలో రభస జరిగింది. తరచూ గ్యాస్ ధరలతో పాటు నిత్యావసరాల ధరలను పెంచుతూ బీజేపీ ప్రభుత్వం పేదలపై భారం మోపుతోందని ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. దీంతో ప్రతిపక్ష, అధికార వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలో గందరగోళం నెలకొంది. ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. జీరో అవర్ ఎల్‌జీపీ సిలెండర్ ధర పెంచిన విషయంపై రభస జరిగింది. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే లేవనెత్తిన అంశంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సబ్సిడీ లేని ఎల్‌పీజీ సిలెండడర్‌పై రూ.86లు పెంచడం చాలా తక్కువన్నారు. దేశంలోని 91.7 కోట్ల జనాభాలో 1.1 కోట్ల మందికి ఎల్‌పీజీ కనెక్షన్ ఉందని, పెరిగిన మొత్తాన్ని వారు చెల్లించిస్తారనే గానీ పేదలపై ఎలాంటి భారం పడదని కుమార్ అన్నారు. ఈనెల 1న నాన్ సబ్సిడీ సిలెండర్లపై ప్రభుత్వం ఏకంగా రూ.86 పెంచడం ఇదే తొలిసారిగా ఖర్గే తెలిపారు. ధరల పెంపుతోనే మోడీ ప్రభుత్వ పాలనా కాలం గడిచిపోనుందని విమర్శించారు. '2016లో దాని ధర రూ.467గా ఉంది. అప్పటి నుంచి ఆరు సార్లు పెరిగి రూ.737 అయ్యింది. దీనిని బట్టి ఈ ప్రభుత్వం పేదలపై ఎంతటి భారాన్ని మోపుతుందో స్పష్టమౌతోంది. పేదలకు ప్రయోజనాలు కల్పించినట్టు మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోంది.. కానీ గణాంకాలు చూస్తే పరిస్థితి భిన్నంగా ఉంది' అని ఆయన అన్నారు. 2012లో ముడిచమురు అంతర్జాతీయ ధర బ్యారల్‌కు 122 యూఎస్‌డీలు ఉండగా ఎల్పీజీ సిలెండర్ ధర రూ.345,అలాగే పెట్రోలు, డీజిటల్ ధరలు రూ.58, రూ.37గా ఉన్నాయన్నారు. 2016లో ముడిచమురు ధర 33 యూఎస్‌డీకి పడిపోయింది. కానీ ఎల్పీజీ ధర రూ.513 పెరిగింది. అలాగే పెట్రోలు, డీజిల్ ధరలు రూ.56, రూ.45గా ఉన్నాయని ఖర్గే గుర్తుచేశారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ దాని ప్రతిఫలాన్ని ప్రభుత్వం వినియోగదారులకు అందించలేదని ఎన్‌కే ప్రేంచంద్రన్ (ఆర్ఎస్‌పీ) అన్నారు. ఆయనతో పలువురు ప్రతిపక్ష సభ్యులు ఏకీభవిచాంరు. ఎల్‌పీసీ సబ్సిడీ వదులుకున్న కోటి మందిని కేంద్రం మోసం చేసిందని కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్) అన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను కుమార్ తోసిపుచ్చారు. ప్రధాని విజ్ఞప్తి మేరకు 1.1 కోట్ల మంది సబ్సిడీని స్వచ్ఛందంగానే వదులుకున్నారని, మిగతా 91.7కోట్ల మందిపై పెంపు లేదన్నారు. ప్రభుత్వం రూ.13,127 కోట్ల సబ్సిడీని అందిస్తోందన్నారు. ఖర్గేనుద్దేశించి మాట్లాడుతూ 'సీనియర్ సభ్యులైన మీరు వాస్తవాలను యథాతథంగా ఉంచాలేగానీ సభను తప్పుదోవ పట్టించరాదు' అని కుమార్ అన్నారు. యూపీఏ హయాంలో ప్రతి రెండు నెలలకు ఎల్‌పీజీ ధరలు పెరిగేవన్న నిజాన్ని ఖర్గే మరిచారన్నారు. రెండు కోట్లకుపైగా ఉన్న పేదల కోసం రెండేళ్ల నుండి ఉజ్వల యోజన అమల్లో ఉందని చెప్పారు. ఓటింగ్‌ను అనుమతించని నిబంధన 193 క్రింద దీనిపై చర్చనకు అంగీకరించాలని బి.మహతబ్ (బీజేపీ) ప్రభుత్వాన్ని కోరారు. ఖర్గే 'మోడీ ప్రభుత్వం' అని సంబోధించడాన్ని బీజేపీ సభ్యులు, హోంశాఖ మాజీ కార్యదర్శి ఆర్‌కే సింగ్ తప్పుబట్టారు. మోడీ ప్రభుత్వం కాదు భారతదేశ ప్రభుత్వమన్నారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ స్వయాన మోడీయే ఆ పదాన్ని వాడతారని, ఆయన బీజేపీ ప్రభుత్వమనడం కూడా చాలా అరుదని చెప్పారు.

# దేశంలోనే అరుదైన శస్త్ర చికిత్స

## బ్రెయిన్ ఫ్లూయిడ్స్ లీక్‌ను నిరోధించిన రెయిన్‌బో డాక్టర్లు




**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** దేశంలోనే అరుదైన మెదడు శస్త్ర చికిత్స విజయవంతంగా జరిపిన నగర రెయిన్‌బో ఆసుపత్రి తన కీర్తిని చాటుకుంది. ఎండోస్కోపిక్ ప్రక్రియ ద్వారా పెద్దల్లోనే విజయానికి అవకాశాలు అంతంత మాత్రంగా ఉండే ఆపరేషన్‌ను పిల్లల ఈఎన్‌టీ సర్జన్ ఆర్ విద్యాసాగర్ సమర్థవంతంగా నిర్వహించారు. పెదకాకానికి చెందిన 18 నెలల నిహాంత్‌కు మెదడులోని ద్రవాలు ఎడమ ముక్కు రంధ్రం నుంచి లీక్ అవడంతో ఆసుపత్రికి తీసుకు వచ్చారన్నారు. నిహాంత్‌కు తలలోని ఎముక ఏర్పడకపోవడంతో అతని తొడలోని మాంసం, కొవ్వు, జిగట పదార్థాలతో పొరలుపొరలుగా ఖాళీస్థానాన్ని పూడ్చామని డాక్టర్లు మీడియాకు తెలిపారు. మెదడుకు దెబ్బ తగలడం, గాయం అవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని, అయితే నిహాంత్‌కు మాత్రం ఎముక పూడకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఎండోస్కోపీతో ఈ ఉపద్రవాన్ని అరికట్టవచ్చని భావించిన డాక్టర్లు ముక్కు ద్వారా అతిసన్నని గొట్టాలు వాడి చిన్నవాడి తలకు ఆపరేషన్ చేసి మెదడు నుంచి ద్రవాలు లీక్‌కాకుండా మాంసాన్ని ఉంచి ఖాళీని పూర్తిచేశామన్నారు. దేశంలో ఇటు వంటి ఆపరేషన్ జరగటం ఇదే మొదటిసారని, బహుశ ప్రపంచంలోనే ఇది మొదటిది అయ్యే అవకాశాలున్నాయని రెయిన్‌బో డాక్టర్ల బృందం తెలిపింది.

# మనకు మరో 50

## పెరగనున్న అసెంబ్లీ సీట్లు

- త్వరలో నియోజకవర్గాల పునర్విభజన
- అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్ పంపాలని కేంద్రం లేఖ
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న కలెక్టర్లు
- ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలలో బిల్లు



**రాజధాని ప్రతినిధి- అమరావతి :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర న్యాయశాఖ రెండు వారాల క్రితమే రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. ఆ లేఖలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు, రెండు రాష్ట్రాల జీఏడీ (ఎలక్షన్స్)కు పంపాయి. ఆ మేరకు రెండు రాష్ట్రాల్లోని కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర విభజన జరిపిన సమయంలోనే తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 225, తెలంగాణలో 153 అసెంబ్లీ స్థానాలు పెంచుకొనే వీలును కల్పిస్తూ ఏపీ పునర్విభజన బిల్లులో పేర్కొన్నారు. అయితే 2014 ఎన్నికల సమయానికి పునర్విభజన బిల్లు ప్రవేశపెట్టడం, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేసేందుకు సమయం లేకపోవడంతో 2009లో ఏర్పాటైన ప్రకారమే ఎన్నికలు జరిగాయి. రెండు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, కె.,చంద్రశేఖర్‌రావు వెంటనే శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమం చేపట్టాలని పలుమార్లు ప్రధానమంత్రి మోడీని, కేంద్ర మంత్రులకు విజ్ఞాపనలు చేశారు. ఎట్టకేలకు కేంద్రం నియోజకవర్గాల పునర్విభజన చేయించాలనే ఉద్దేశంతో ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టేందుకు కేంద్రం రెండు రాష్ట్రాల నుంచి అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్‌ను కోరింది. దీంతో రెండు రాష్ట్రాల అధికార పార్టీ నేతలు తమకు అనుకూలంగా నియోజకవర్గాలు ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతిపాదనలను అధికారుల వద్ద పెడుతున్నారు. వారి ప్రతిపాదనలు ఎలా ఉంటామో చెప్పలేనప్పటికీ కొత్త నియోజకవర్గల ఏర్పాటు జరగటం ఖాయంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికలు జరిగేందుకు మరో రెండేళ్ల సమయం ఉన్నందున నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరిపేందుకు సమయం సరిపోతుంది. ఇదే జరిగితే రెండు రాష్ట్రాలలో రాజకీయ స్వరూపం పూర్తిగా మారనుంది. ప్రస్తుతం జనరల్ స్థానాలుగా ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లు రిజర్వుడు స్థానాలుగాను, రిజర్వుడు స్థానాలు జనరల్‌గాను మారతాయి. దీంతో ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో సీనియర్ల స్థానాలు కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉంది. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో తమ సామాజిక వర్గాలకు పట్టు దొరకకపోతే ఆ అభ్యర్థులకు ఏ పార్టీ కూడా టికెట్లు ఇచ్చే పరిస్థితి లేదు. సీనియర్లను బలం లేనిచోట పెట్టి పోటీ చేయించేందుకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సాహసించే స్థితి లేదు. అందువల్ల అధికార పార్టీల్లోని సీనియర్లు తమ నియోజకవర్గాల్లో ఇబ్బంది రాకుండా కొత్త నియోజకవర్గాల్లో తమ ప్రాబల్యం కొనసాగేలా ప్రతిపాదనలు ఇచ్చి అవి అమలయ్యేలా ప్రయాత్నాలు చేసుకుంటున్నారు.

కొత్త నియోజకవర్గాలు ఏర్పాటైతే ఆంధ్రాలో 225 ఎమ్మెల్యే స్థానాలు రానున్నాయి. అయితే 25 పార్లమెంటు స్థానాలకు 50 నియోజకవర్గాలు పెరుగుతాయి. దీని బట్టి ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి రెండు ఎమ్మెల్యే స్థానాలు పెరగనున్నాయి. ఆంధ్ర రాష్ట్ర జనాభాను బట్టి ఒక్కో నియోజకవర్గం 2.20లక్షల నుంచి 2.40 లక్షల వరకు జనాభాతో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో రిజర్వేషన్ నియోజకవర్గాల సంఖ్య కూడా తేడాగా ఉంది.

ఆంధ్రరాష్ట్రంలో ప్రస్తుతం 175 అసెంబ్లీ స్థానాలకు గాను 25 ఏస్సీ, 5 ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాజ్యాంగం ఎస్సీ,ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్ సౌకర్యం వల్ల ప్రస్తుతం 175 అసెంబ్లీ స్థానాలకు గాను 27 లేక 28 ఎస్సీ స్థానాలు, ఎస్టీలకు 10 స్థానాలు ఉండాలి. తెలంగాణలో ఎస్సీలు 14, ఎస్టీలకు 9 నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ ఉన్న 119 ఎమ్మెల్యే స్థానాలకు గాను ఎస్సీలకు 18, ఎస్టీలకు 7 మాత్రమే ఉండాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన రిజర్వేషన్లే ఈ రెండు రాష్ట్రాల్లో ఇప్పుడు కూడా అమలు అవుతున్నాయి. పై రిజర్వేషన్లు ఉమ్మడి రాష్ట్రంలో 294 నియోజకవర్గాల పునర్విభజన 2001 జనాభా లెక్కల ప్రకారం జస్టిస్ కుల్‌దీప్‌సింగ్ కమిషన్ నిర్ణయించింది. ఆ రిజర్వేషన్ల ప్రకారమే 2009 ఎన్నికలు, ఉమ్మడి రాష్ట్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయిన తరువాత 2014 ఎన్నికలు కూడా జరిగాయి. 2011 జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రస్తుతం ఎస్సీ నియోజకవర్గాలుగా ఉన్న గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, తాడికొండ, వేమూరు జనరల్ సీట్లుగాను, జనరల్ సీట్లుగా ఉన్న నెల్లూరు జిల్లాలోని కోవూరు, గుంటూరు జిల్లాలోని మాచర్ల, ప్రకారం జిల్లాలో ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న యర్రగొండపాలెం ఎస్టీ నియోజకవర్గాలుగాను, ఎస్సీ నియోజకవర్గాంగా ఉన్న కొండపి జనరల్ స్థానంగాను మారే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇలా రాష్ట్రంలో రిజర్వేషన్ల వల్ల చాలా స్థానాల రాజకీయ స్వరూపం మారనుంది. నియోజకవర్గాల పునర్విభజన గురించి ఏపీ జీఏడీ(పొలిటికల్) అడిషనల్ సీఈవో బి.వెంకటేశ్వరరావును వివరణ కోరగా కలెక్టర్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే కేంద్రానికి పంపుతామని తెలిపారు. అయితే 2009 పునర్విభజనలో మండలాన్ని యూనిట్‌గా లెక్కించారు. ప్రస్తుతం పునర్విభజనలో పార్లమెంటు నియోజకవర్గాల హద్దులను కదల్చకూడదు కాబట్టి మండల యూనిట్ విధానాన్ని రద్దు చేసి అవసరం మేరకు నియోజకవర్గానికి సరిపడేట్టు పక్క గ్రామాలను కూడా కొత్త నియోజకవర్గాల్లో చేర్చుకొనేలా ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిసింది. మొత్తం మీద పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేసిన వెంటనే రెండు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ ప్రారంభించనుంది. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఎస్టీ నియోజకవర్గాలుగా ఉన్న భద్రాచలంలోని పినపాక, బూర్గంపహాడ్‌లలో 1.70 లక్షల మంది. మండలాల బదలాయింపుతో ఏపీలో కలిశారు. ఈ కారణంగా తెలంగాణలో ఆ నియోజకవర్గాలు జనరల్ అవుతాయి.

# ఇక సంక్షేమ హాస్టళ్లు కనుమరుగు

## సిక్కోలులో 16 వసతి గృహాలు, 877 మంది విద్యార్థులు ప్రత్యేక హాస్టల్‌కు తరలింపు

**శ్రీకాకుళం :** విద్యను వ్యాపారం చేసే క్రమంలో కార్పోరేట్ విద్యాసంస్థలకు ధారాదత్తం చేయడంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం విలీనం పేరుతో ప్రభుత్వ వసతి గృహాల మూసివేతకు రంగం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే శ్రీకాకుళం జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 16 వసతి గృహాల్లోని విద్యార్థులను ప్రత్యేక వసతి గృహాలకు,గురుకులాలకు తరలించడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది వేసవి సెలవులు ముగియగానే 877 మంది విద్యార్థులను వివిధ వసతి గృహాలకు తరలించనుంది. ఇవన్నీ త్వరలోనే అమలులోకి రానున్నాయి. ఈ ఏడాది జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 41 వసతి గృహాల్లో 4030 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 16 వసతి గృహాలను మూసివేసి 877 మందిని ఇతర వసతి గృహాలను తరలించడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీంతో జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 25 వసతి గృహాలు మాత్రమే. ఈ ఏడాది మిగలనున్నాయి. వచ్చే ఏడాదిలో మిగతా వాటికి కూడా మంగళం పాడడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్తమ బోధన కోసమే ఈ వసతి గృహాలను విలీనం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ నిర్ణయం వెనుక పెద్దకుట్ర ఉందని, గత రెండేళ్లలోనే దాదాపు 20 వసతి గృహాలకు మంగళం పాడారని, వచ్చే ఏడాదితో మిగతా వాటికి కూడా మంగళం పాడి కార్పొరేట్, ప్రైవేటు విద్యను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు, మేధావులు వాపోతున్నారు. ప్రస్తుతం 5,6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులను సమీపంలోని గురుకుల పాఠశాలకు తలించాలని నిర్ణయించారు. 9,10 తరగతి విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహాల్లో చేర్పించేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలను ఎత్తివేసి ఇందులోని విద్యార్థులను సమీపంలోని గురుకులాలు, ప్రత్యేక వసతి గృహాల్లో చేర్పించనున్నారు. ఈ నిర్ణయంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఇంక భవిష్యత్‌లో ఎస్సీ విద్యార్థులు చదువు మానుకోవడం తప్ప, చదువుకునే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు మెరుగ్గా ఉన్న విద్యార్థులు గురుకులాల్లో చేరేవారు. మిగిలినవారు ప్రభుత్వ వసతి గృహాల్లో చేరి విద్యనభ్యసించేవారు. అయితే అధికారులు మాత్రం ఇంత కన్నా మంచి విద్యను విద్యార్థులకు అందజేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతూ విమర్శలను కొట్టిపారేస్తున్నారు. ఇప్పటికైనా అత్యంత మెరుగైన వసతి, విద్యాసౌకర్యాలు అందుతాయని, పేద విద్యార్థులు జీవితాల్లో బాగా స్థిరపడేందుకు అవకాశం కల్పించబడుతుందని చెబుతున్నారు. అయితే ఇది వాస్తవానికి విరుద్ధంగా ఉందని, ఈ విధానాల వల్ల పేద విద్యార్థులు విద్యకు మరింత దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ఎత్తి వేయడంతో దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లలేక, ప్రైవేటు పాఠశాలల్లో చదవలేక వీధి బాలలుగా మారుతున్నారు. ప్రభుత్వం రంగంలో విద్యను పూర్తిగా కనుమరుగు చేయడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్న విమర్శలు బలపడుతున్నాయి. జిల్లాలో 61 వసతి గృహాలకు గాను, గత రెండేళ్లలో 20 వసతి గృహాలు మూసివేయగా ఈ ఏడాది మరో 16 మూసివేతకు రంగం సిద్ధమవుతున్నది. ఇంకా 25 వసతి గృహాలు మాత్రమే సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం ఎత్తివేయడానికి సిద్ధమవుతున్న వసతి గృహాలు బ్రాహ్మణతర్ల- 15 మంది విద్యార్థులు, కాశీబుగ్గ- 42 మంది, ఎస్ఎంపురం -52 మంది, మాకివలస- 51 మంది, తొగరాం -55 మంది, పొందూరు (1) -47 మంది, మంది, పొందూరు (2) -48 మంది, శ్రీకాకుళం- 42 మంది, మురపాక -45 మంది, రాజాం (1) 57 మంది, రాజాం (2) 61 మంది, రుణస్థలం -56 మంది, బూర్జ - 52 మంది, కొరసవాడ -57 మంది, బత్తిలి- 102 మంది విద్యార్థులను వివిధ వసతి గృహాలకు పంపించనున్నారని తెలిసింది. ఎచ్చెర్ల నియోజవర్గంలోని మురపాక వసతి గృహంలో 9,10 తరగతు విద్యార్థులు, సంతకవిటి మండలం జీఎస్‌పురం ప్రత్యేక వసతిగృహంలోకి వెళ్లాల్సి ఉంటుంది. రాజాంలోని బాలికల సంక్షేమ వసతి గృహాన్ని త్వరలోనే ఎత్తివేయనున్నారు. ఇక్కడ 9,10 తరగతుల విద్యార్థులు పాలకొండలోని ప్రత్యేక వసతి గృహానికి వెళ్లిల్సి ఉంటుంది. మిగిలిన విద్యార్థులు వంగరలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. పొందూరు వసతిగృహం విద్యార్థులు రణస్థలంలోని ప్రత్యేక వసతి గృహానికి, ఎచ్చెర్ల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో చదవాల్సి ఉంటుంది. దీంతో ఆ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గి మూసివేతకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

### ఎవరి కోసం వసతి గృహాలు మూసేస్తున్నారు

కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించడానికి, పేదలను విద్యకు దూరం చేయడానికి, ప్రభుత్వం పేదల సంక్షేమం నుంచి తప్పుకోవడానికి చేస్తున్న కుట్రలో భాగమే ఈ వసతి గృహాల మూసివేత, ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తాం, పేదలకు విద్యను అందించేందుకు ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలకు సిద్ధమవుతుంది. నారాయణ, గంటా కుటుంబాలు రాష్ట్రంలోని విద్యాసంస్థలను తమ సొంతం చేసుకోవడానికి చేస్తున్న యత్నానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడుతున్నారు.

# పాక్ పార్లమెంటులో హిందూ వివాహ చట్టానికి ఆమోదం

**ఇస్లామాబాద్ :** దేశంలోని హిందూ మైనారిటీల వివాహాల క్రమబద్ధీకరణ చట్టానికి ఎట్టకేలకు పాకిస్థాన్ పార్లమెంటు ఆమోదం లభించింది. ఈ చారిత్రక బిల్లును నేషనల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా స్వీకరించడంతో హిందూ మ్యారేజ్‌బిల్ - 2017 పాకిస్థాన్ హిందువులకు అందుబాటులోకి రానుంది. సుదీర్ఘ కార్యాచరణ తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. అయితే ఈ బిల్లును ఆమోదించడం ఇది రెండోసారి. గతేడాది సెప్టెంబరులో దీనిని ఆమోదించగా కొన్ని సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టారు. నిబంధనల ప్రకారం దేశాధ్యక్షుడి సంతకం కోసం పంపే ముందు ఒకే చట్టం ఉభయ సభల ఆమోదం పొందాల్సి ఉంటుంది. ముస్లింలో 'నిఖానామా' తరహాలో 'షాదీ పరథ్'కు పార్లమెంటు ఆమోదం లభించినట్టు డాన్ పత్రిక వెల్లడించింది. షాధీపరథ్‌పై వివాహాన్ని నిర్వహించే పంతులు సంతకం చేశాక సంబంధిత ప్రభుత్వ విభాగంలో అది రిజిస్టర్ చేయించాలి. ఈ చట్టం ద్వారా హిందూ మహిళలకు డాక్యుమెంటరీ ప్రూఫ్ లభిస్తుంది.

# జిల్లాపరిషత్ పాఠశాలలో ఘనంగా ఫేర్‌వేల్ వేడుకులు!





**రాజధాని ప్రతినిధి..తుళ్ళూరు :** మండలం రాయపూడిలోని శ్రీకృష్ణ దేవరాయ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈనెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతుండగా, పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు వారికి ఘనంగా వేడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా.ప్రధానోపాధ్యాయుడు జి.రాంబాబు. పాల్గొని మాట్లాడుతు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి జీవితం చాలా విలువైనదని దానిని సరైన మార్గంలో పెట్టినప్పుడే ప్రయోజనం ఉంటుందని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు పయనించాలని ఉద్బోదించారు. అనంతరం తోమ్మిదో తరగతి విద్యార్థులు పదోతరగతి విద్యార్దులకు శుభాకాంక్షలు తెలిపారు. తుళ్ళూరు ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు పాఠశాల సిబ్బంది,విద్యకమిటి చైర్మన్, వైస్‌చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# నోట్లకు కటకట

- బ్యాంకులకు వరుసగా మూడ్రోజుల సెలవులు
- ఏటీఎంలలో 'నో క్యాష్'
- 'పెద్ద' ఇబ్బందులు పునరావృతం
- ఖాతాదారుల్లో పెరిగిన ఆందోళన

**రాజధాని ప్రతినిధి ; (విజయవాడ) :** గత కొద్ది రోజులుగా కొనసాతున్న నోట్ల కష్టాలు పరాకాష్టకు చేరుకున్నాయి. వరుసగా మూడ్రోజులు సెలవులు రావడంతో బ్యాంకులు, ఏటీఎంలు పనిచేయని పరిస్థితి. దీంతో గత ఏడాది పెద్ద నోట్ల రద్దుతో తలెత్తిన ఇబ్బందులే మరోసారి పునరావృతం కావడం తథ్యమనే సంకేతాలు వెలువడుతున్నాయి. వివిధ అవసరాల కోసం నగదును డ్రా చేయాలనుకునే వారు ఈనెల 14వ తేదీ వరకూ వేచి ఉండాల్సిందే. ఈ నెల 11వ తేదీ రెండో, 12న ఆదివారం, 13న హోలీ పూర్ణిమను పురస్కరించుకుని ప్రభుత్వ రంగ బ్యాంకులకు సెలవులు ప్రకటించారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి ఆయా రాష్ట్రాలకు నోట్ల పంపిణీలో అవాంతరాల కారణంగా వారం రోజులుగా చాలా బ్యాంకుల్లో నగదు కొరత ఏర్పడింది. దీంతో అనేక బ్యాంకులు, ఏటీఎంలలో 'నోక్యాష్' బోర్డులు దర్శనమిస్తుండడంతో ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. రాష్ట్రంలోని అనేక జాతీయ, అంతర్జాతీయ, సహకార రంగాలకు చెందిన బ్యాంకుల్లో నగదు సరిపడా లేకపోవడంతో గత సోమవారం నుంచి లావాదేవీలన్నీ మందకొడిగా జరుగుతున్నాయి. ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో నగదు కొరత మరింత తీవ్రంగా ఉండడంతో ఖాతాదారులు ఇక్కట్లపాలవుతున్నారు. ఏజెన్సీలు నగదు ఉంచకపోవడంతో అనేక ఏటీఎంలు పనిచేయలేదని చెబుతున్నారు. బ్యాంకులకు వెళ్లినా కూడా నగదు లేదనే సమాదానం వస్తోందంటున్నారు. కొన్ని ఏటీఎంలలో నగదు ఉన్నప్పటికీ సంబంధిత బ్యాంకు కార్డులు మినహా ఇతర బ్యాంకు కార్డులను మిషన్లు అంగీకరించడం లేదని పేర్కొంటున్నారు. ఇదేమని అక్కడి సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నిస్తే 'సర్వర్లు నెమ్మదిగా' ఉన్నాయనే సమాధానం వస్తోందంటున్నారు. ఇదిలా ఉండగా వరుసగా మూడ్రోజు సెలవులు రావడంతో ముందుగానే జాగ్రత్త చర్యగా వివిధ అవసరాల నిమిత్తం నగదును డ్రా చేసేందుకు బ్యాంకులు, ఏటీఎంలకు సంబంధించి అత్యవసర లావాదేవీలను పూర్తి చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ ఖాతాదారులను అప్రమత్తం చేయడంతో చాలా మంది బ్యాంకులకు పరుగులు తీసారు. అయితే సరపడినంత నగదు నిల్వలు లేకపోవడంతో లావాదేవీలన్నీ నామమాత్రంగానే జరిగినట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. సెలవుల వల్ల ఆర్బీఐ నుంచి నగదు సరఫా మూడ్రోజులపాటు నిలిచిపోనున్నాయని తెలిపారు. దీంతో వివిధ ఏజెన్సీల ద్వారా ఏటీఎంలలో ఉంచేందుకు నగదు లేకపోవడం వల్ల ఏటీఎంలన్నీ ఖాళీగా దర్శనం ఇవ్వనున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్రంలో నగదు కొరతను తీర్చేందుకు వారం క్రితమే ఆర్బీఐకు లేఖరాసానని, మరో లేఖను రాస్తున్నట్లు సమావేశమైతే నిర్వహించారే కానీ మూడ్రోజుల సెలవుల కారణంగా తలెత్తే పరిస్థితులను విస్మరించారనే విమర్శలు వస్తున్నాయి. ఏదైనా సంక్షోభం నగదు కొరత సమస్య తీవ్రమవుతుంటే కేంద్రానికి లేఖలు రాసి ఊరుకుంటే సరిపోదని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఆర్బీఐ గవర్నర్‌తో మాట్లాడి కొంత నగదును రాష్ట్రానికి రప్పించి ఉంటే నగదు కష్టాలు కొంతవరకూ తీరేవని చెబుతున్నారు. ఆ దిశలో చర్యలు చేపట్టకుండా సమీక్షలు, లేఖలతో కాలక్షేమం చేయడం వల్ల ప్రజలకు కష్టాలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## దిల్‌రాజు నిర్మాతగా త్వరలో శ్రీనివాస కళ్యాణం : డైరక్టర్ వేగేశ్న సతీష్



**కోనసీమ ప్రతినిధి- జీఎన్.రావ్ :** శతమానం భవతి సినిమా డైరక్టర్ వేగేశ్న సతీష్ ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మల్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో డైరక్టర్ సతీష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడూ పశ్చిమ గోదావరి జిల్లా మారుమూల ప్రాంతంమైన వద్దూరులో జన్మించినట్లు తెలిపారు. సినిమాలపై మక్కువతో సినీ రంగంలోకి వచ్చానన్నారు. త్వరలో దిల్‌రాజు నిర్మాతగా తన దర్శకత్వంలో శ్రీనివాస కళ్యాణం చిత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తాను 45 చిత్రాలకు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే అందించినట్లు చెప్పారు. నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమోరిస్, గబ్బర్‌సింగ్, అత్తిలి సత్తిబాబు, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి హిట్ సినిమాలకు మాటలు అందించానన్నారు. ఆత్రేయపురం అంటే తనకు ఎంతో ఇష్టమని ఆ మక్కువతోనే ఆత్రేయపురం పేరు, ఇక్కడి పుణ్యక్షేత్రాలను శతమానం భవతి సినిమాలో పెట్టానన్నారు. రాజబాబు సినిమా చిత్రీకరణలో భాగంగా ఆత్రేయపురం వచ్చినట్లు తెలిపారు.

## వాడపల్లి వేంకటేశుని ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**కోనసీమ ప్రతినిధి-జీఎన్.రావ్ :** ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ పాలకమండలి నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ఆచంట శ్రీనివాస్ నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణం చేయించారు. ధర్మకర్తలుగా కరుటూరి నరసింహారావు, పడాల పద్మావతి, పోలిమాటి శ్రీను, పిపి.రాజగోపాల్, పాముల సత్యనారాయణ, తూము వెంకటరావు, ఏపుగంటి వెంకన్న, వేగేశ్న లక్ష్మీపతిరాజు, కెవిఎం.కృష్ణారావు, అర్చకుడు వాడపల్లి సుందర శేషావతారం తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కరుటూరి నరసింహరావును ఎంపికచేశారు. ఈ సందర్భంగా కరుటూరి మట్లాడుతూ ఈ నెల 19న మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నూతన పాలకమండలి అభినందన సత్కార సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన ధర్మకర్తల సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు. నూతన ధర్మకర్తల మండలిని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, డిసి చైర్మన్ కుడప కృష్ణమూర్తిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బిహెచ్‌వి.రమణమూర్తి, సూపరింటెండెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసత్తెమ్మతల్లి పొదుపు సంఘం ఏర్పాటు

**కోనసీమ ప్రతినిధి-జీఎన్.రావ్ :** ముమ్మిడివరంలో శ్రీసత్తెమ్మతల్లి పొదుపు సంఘం ఏర్పాటైంది. ఐదుగురు మహిళలు గ్రూపుగా ఏర్పడి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలుగా బొక్కా రామలక్ష్మి, కార్యదర్శి గేదెల నాగరత్న అంబికా, కోశాధికారిగా బొల్లోజు పూర్ణజ్యోతి, సభ్యులుగా గారపాటి భాగ్యలక్ష్మి, వస్త్రాల తులసిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ సమావేశం ప్రతినెలా 1, 15 తేదిల్లో సభ్యులంతా సమావేశం అవ్వాలని నిర్ణయించారు. సంఘ అభివృద్ధితో పాటు సంఘ సభ్యులు సామాజిక అవగాహన, ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అలాగే సంఘ అభివృద్ధికి కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. ది.జయలక్ష్మి ఎంఏఎం.కోఆపరేటివ్ సొసైటి ముమ్మిడివరం బ్రాంచ్ నందు సేవింగ్స్ ఖాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ గంటా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పొదపు సంఘం ఏర్పాటు చేసుకుని తమ సొసైటీలో సేవింగ్స్ ఖాతాను ప్రారంభించడం అభినందించదగిన విషయమన్నారు. అలాగే మహిళా దినోత్సవం పురస్కరించుకుని సంఘం ఏర్పాటుచేయడం, ఈ సంఘ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ గంటా సత్యనారాయణతో పాటు సంస్థ సిబ్బంది వస్త్రాల శివశంకర్, టి.భవాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ మహిళలకు ప్రత్యేక చట్టం అమలుచేయాలి

**అమలాపురం ప్రతినిధి-ఎ.తేజ :** జాతీయ దివ్యాంగుల మహాసంఘటన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ఎర్రవంతెన వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దివ్యాంగుల మహాసంఘటన్ సభ్యులు కె.భాస్కరరావు స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని పోలీసు వాఖ అధికారులను కోరుతున్నామన్నారు. అత్యాచారం చేసిన వ్యక్తికి కనీసం 2సంవత్సరముల జైలు శిక్ష, రూ.3లక్షలు లేదా రూ.5లక్షల జరిమానా విధించాలన్నారు. దివ్యాంగ మహిళకు ప్రత్యేక చట్టం అమలుచేయాన్నారు. మహిళలకు ఇస్తున్న 33శాతం రిజర్వేషన్లను దివ్యాంగ మహిళలకు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో కూడా వారికి ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, దివ్యాంగుల సంక్షేమ శాఖామంత్రి పీతల సుజాతలను ఈ సందర్భంగా కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల మహాసంఘటన్ అధికారి ప్రతినిధి నిమ్మకాయల సురేష్, పశ్చిమగోదావరి జిల్లా దివ్యాంగుల మహాంసఘటన్ మహిళా కోశాధికారి తాళ్ళ రాజేశ్వరి, తూర్పుగోదావరి దివ్యాంగుల మహాసంఘటన్ అధ్యక్షురాలు పి.సుజాత, దివ్యాంగుల మహాసంఘటన్ అధికారి ప్రతినిధి దొడ్డిపట్ల శ్రీనివాస్, జిల్లా దివ్యాంగుల మహాసంఘటన్ మాజీ కార్యవర్గ సభ్యులు చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లో 950 టన్నుల బంగారం వినియోగం : డబ్ల్యుజీసీ



**ముంబై :** గత సంవత్సరం బంగారానికి దేశంలో గిరాకీ తగ్గింది. కానీ భవిష్యత్తులో బంగారానికి మరింత గండిపడకపోవచ్చునని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. దేశీయ ఆర్థిక ప్రగతికి, బంగారానికి దేశంలో ఉన్న పారదర్శకత నేపథ్యంలో పసుపుపచ్చ లోహానికి 2020 నాటికి మరింత గిరాకీ ఏర్పడి 950 టన్నులకు పెరగవచ్చునని వెల్లడించింది. గతంలో మనదేశంలో తాత్కాలిక డిమాండ్ ఏర్పడినప్పటికీ, మరలా పుంజుకోవచ్చునని తెలుస్తోంది. బంగారానికి డిమాండ్ మరింత పెరిగి 2017 లో 650 టన్నుల నుంచి 750 టన్నుల వరకు వినియోగదారులు బంగారాన్ని కొనవచ్చునని తెలుస్తోంది. ఏది ఏమైనా, భారతీయ బంగారు వినియోగదారులు 2020 నాటికి 850 టన్నుల నుండి 950 టన్నుల బంగారం కొనుగోలు చేయవచ్చునని డబ్యుజిసి నివేదిక పేర్కొంది. గత సంవత్సరం బంగారం కొనుగోలు తగ్గేందుకు ప్రధాన కారణ డీమానిటైజేషన్,2016 మధ్యలో బంగారం వినియోగదారుపై జరిపిన అధ్యయనంలో,కరెన్సీ కంటే బంగారమే ఎక్కువగా ఉందని 63 శాతం అంగీకరించారు. బంగారం తమకు దీర్ఘకాలంలో భద్రతను కల్పిస్తుందని 73 శాతం మంది అంగీకరించారు. మరోవైపు డీమానిటైజేషన్ ప్రభావంతో ఆభరణాలను మరింత ఎక్కువగా కొనేందుకు కూడా వినియోగదారులను ఉసిగొల్పింది. మరోవైపు గత సంవత్సరం డిజిటల్ చెల్లింపులతో కూడా బంగారం కొనుగోళ్లు తగ్గాయి. ఈ విధానంతో కొనుగోలుదార్లలో మరింత పారదర్శకతకు మార్గం సుగమం అవుతున్నట్లు డబ్యుజిసి తెలిపింది.

# వరకట్నం వాపస్



### జార్ఖండ్‌లో ఆరంభమైన సామాజిక విప్లవం

**జర్ఖండ్ :** వెనుకబాటుకు గురైన జార్ఖండ్‌లోని సామాజిక విప్లవంలో ముందడుగు వేస్తున్నారు. లతెహర్ జిల్లా పొఖరి గ్రామానికి చెందిన హాజీ ముంతాజ్ అలీ తమ ప్రాంతంలో వరకట్న దురాచారానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అలీ చేపట్టిన ఈ ఉద్యమం ఫలితంగా అతని మతస్థుల్లో వరకట్న దురాచారంపై చైతన్యం వచ్చింది.ఈ ప్రాంతంలో 800 వరకు కుటుంబాలకు చెందిన వారు తాము వరకట్నం తీసుకున్నామని అంగీకరించడంతోపాటు ఆ మొత్తాన్ని తమ వియ్యాలవారికి తిరిగి ఇచ్చివేశారు కూడా.


అలీ 2016 లో వరకట్న పిశాచానికి వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. తన మతంలోని పెద్దలను కలిసి ఈ దూరాచారాన్ని నిర్మూలించానని వారికి నచ్చజెప్పారు. అతడి ప్రచారం వారిలో ఆలోచనను రేకెత్తించింది. ఇకపై తమలో జరిగే వివాహాలలో వరకట్నం లేకుండా చర్యలు తీసుకుంటామని మౌల్వి తెగకు చెందినవారు వాగ్దానం చేయడంతోపాటు ఆచరణలో పెట్టి చూపారు.

గత ఏడాది ఏప్రిల్ నుంచి అలీ చేపట్టిన ఉద్యమం ప్రభావంతో ఆ రాష్ట్రంలోని లతెహర్,పలము జిల్లాలు,చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తాము వరకట్నం కింద తీసుకున్న మొత్తాలను తిరిగి ఇచ్చివేశారు.అలా తిరిగి ఇచ్చిన మొత్తం భారీగా రూ.6 కోట్ల వరకు ఉండటం విశేషం.

ఈ ఉద్యమానికి సంబంధించిన ప్రచారంలో భాగంగా కేవలం సమావేశాలు,చర్చలతోనే సరి పెట్టకుండా ఆ రెండు జిల్లాలలోని వివిధ ప్రాంతాల వారు వరకట్నం తీసుకోవద్దంటూ తమకు తెలిసినవారికి చెబుతున్నారు. తద్వారా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తున్నారు. వరకట్నానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం పేద కుటంఉబాల్లోకి బాగా చొచ్చుకుని పోయిందని అలీ వివరించారు. ఈ దురాచారానికి చరముగీతం పాడాల్సిన కుటుంబాలు మరికొన్ని ఉన్నాయని తెలిపారు.“ మొదట్లో ముస్లిం మతస్థుల్లో వరకట్న ఆచారం ఉండేది కాదు. తరువాత ఇది వివాహాల్లో భాగమైపోయిందని పవిత్రమైన వివాహ బంధ్యాన్ని ఇది తీవ్రంగా దెబ్బ తీసేదిగా ఈ దేరాచారం తయారైంది.” అని అలీ వివరించారు. వరకట్న దూరాచారం దేశవ్యాప్తంగా నెలకొన్న సమస్య దీనిని సమాజంలోని వివిధ వర్గాలతోపాటు పాలకులు కూడా పరిష్కరించవలసి ఉంది.2012-15 సంవత్సరాల మధ్య వరకట్నాలకు సంబంధించి 24,771 మరణాలు సంభవించాయని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ 2015లో లోక్‌సభకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో లతెహర్ జిల్లాలోని వందాది కుటుంబాలు ఈ వరకట్న దురాచారాన్ని వ్యతిరేకిస్తుండటంతో దీనిపై తమ పోరాటిన్ని కొనసాగిస్తామని పేర్కొంటుండటం విశేషం. ఆ ప్రాంతంలో మొదలైన ఉద్యమం కేవలం ఆరంభం మాత్రమే అని చెప్పవచ్చు. ఇది దేశవ్యాప్తంగా విస్తరించవలసి ఉంది.

# అద్వానీని వదలని ‘బాబ్రీ’ పాపం

### 22న తేలనున్న అద్వానీ భవితవ్యం



**న్యూఢిల్లీ :** బాబ్రీ మసీదు కూల్చివేత కేసు బీజేపీ కురువృద్ధుడు లాల్ కిషన్ అద్వానీ (89)ని వదిలి పెట్టేట్టు లేదు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేత కేసు విచారణలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కేసు నుంచి బీజేపీ అగ్రనేతలు ఎల్.కే. అద్వానీ మురళీ మనోహర్ జోషి, ఉమాభారతి, కల్యాణ్‌సింగ్ తదితరులపై దాఖలైన చార్జిషీటును సాంకేతిక కారణాలతో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో వారి భవితవ్యాన్ని ఈ నెల 22న నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై 2011 ఫిబ్రవరి 18న సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సాంకేతిక కారణాలతో బీజేపీ సీనియర్ నేతలు అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ప్రస్తుతం కేంద్రమంత్రి ఉమాభారతి, ప్రస్తుతం రాజస్థాన్ గవర్నర్ కల్యాణ్‌సింగ్ (సంఘటన సమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు) మరో తొమ్మిదిమందిపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదించే ప్రసక్తే లేదని సుప్రీంకోర్టు విస్పష్టంగా ప్రకటించింది. అలహాబాద్ హైకోర్టు నుంచి క్లీన్‌చిట్ పొందిన 13 మందిపై మళ్లీ అదనపు చార్జిషీటు దాఖలు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసును జిస్టిస్ పీసీ ఘోష్, జస్టిస్ ఆర్ఎస్ నారిమన్‌లతో కూడిన ద్విసభ్య బెంచ్ విచారణ చేస్తోంది. అదనపు చార్జిషీటు దాఖలు చేయలని మౌఖిక ఉత్తర్వులు జారీచేసింది. అద్వానీ ప్రభృతులపై ఐపీసీ 153ఏ (మతాల మధ్య శత్రుత్వం కల్పించడం), 153బీ (ఆరోపణలు చేయడం, విమర్శలు, అమోమయం, దేశ సమగ్ర తను దెబ్బతీయడం)505 (తప్పుడు ప్రకటనలు, శాంతిని భగ్నం చేసేలా తిరుగుబాబుకు అవకాశం ఇస్తూ వదంతులు వ్యాప్తిచేయడం) సెక్షన్లతో కేసు సీబీఐ నమోదుచేసింది. తరువాత ఈ చార్జిషీటును ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేయగా అలహాబాద్ హైకోర్టు ఆ నిర్ణయాన్ని సమర్థించింది. దానిపై సుప్రీంకోర్టు సీబీఐ అప్పీలు చేయగా అద్వానీ ప్రభృతులపై ఆక్షేపణలతో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. బాబ్రీమసీదు కూల్చివేతను స్వతంత్ర భారత దేశంలో చారిత్రకంగా ప్రత్యేకతను సాధించింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామమం దిరాన్ని నిర్మించాలని ఆర్ఎస్ఎస్ ప్రభావిత సంస్థలు, బీజేపీ నేతలు ఎంతోకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. చార్జిషీటు కొట్టేయగా కేసు నుంచి విముక్తు లైన అద్వానీ సహా 13 మందిపై మళ్లీ అదనపు చార్జిషీటు దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించడమే కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసును దీనితో కలిసి సంయుక్తంగా విచారణ జరపాలని ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది.

**బాబ్రీ కూల్చివేతపై రెండు కేసులు**

అయోధ్యలో 16వ శతాబ్ధంలో నిర్మించిన బాబ్రీ మసీదును 1992 డిసెంబర్ ఆరో తేదీన రామ జన్మభూమి కరసేవకులు కూల్చివేశారు. బాబ్రీమసీదు కేసు కూల్చి వేతపై రెండు కేసులు దాఖలయ్యాయి. ఒకటి అద్వానీపై ఉన్న కేసు కాగా, మరోకటి రామ్ కథాకుంజ్ వద్ద వేదికపై ఉన్న బీజేపీ నాయకులు, వివాదాస్పద కట్టడం చుట్టుపక్కల గుమికూడి, దాన్ని కూల్చివేతలో పాల్గొన్న లక్షలాది మంది కరసేవకులపై ఉన్న కేసు. మరణానంతరం శివసేన అధినేత బాల్ థాకరే పేరును ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి జాబితా నుంచి తొలగించారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు తుదిదశలో ఉన్న సమయంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పుతో బీజేపీ శ్రేణులు కలవరపడుతున్నాయి. దీని పరిణామం తుది పోలింగ్‌పై ఉంటుందేమోనని ఆందోళనలో ఉన్నాయి.

## ఇండియన్ బ్యాంకుకు అవార్డు

इंडियन बैंक Indian Bank

**హైదరాబాద్ :** ఇటీవల ముంబాయిలో జరిగిన అసోచామ్ 12 వ వార్షిక బ్యాంకింగ్ సదస్సు,సోషియల్ బ్యాంకింగ్ ఎక్సలెన్స్ అవార్డులు-2016 కార్యక్రమంలో లార్జ్ బ్యాంక్ కేటగిరీ కింద ఉత్తమ సోషియల్ బ్యాంక్ విభాగంలో ఇండియన్ బ్యాంక్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.ఎస్.రాజీవ్, కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అర్జున్ రామ్ మేగ్వాల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే ఇండియన్ బ్యాంక్ లార్జ్ బ్యాంక్ కేటగిరీలో గవర్నమెంట్ స్కీమ్ విభాగంలో మరొక అవార్డును కైవసం చేసుకుంది.

## జుకర్‌బర్గ్ త్వరలో పట్టభద్రుడు..!




**న్యూయార్క్ :** ప్రముఖ సోషల్ మీడియా సంస్థ ఫేస్‌బుక్ సహా వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ డిగ్రీ అందుకోనున్నారు. జుకర్‌బర్గ్‌కు ఇంకా డిగ్రీ పూర్తి చేయలేదు. ప్రఖ్యాత హార్వర్డ్‌లో సీటు సాధించిన జుకర్...ఫేస్‌బుక్ కోసం తన విద్యాభ్యాసాన్ని మధ్యలోనే వదిలేశారు. అయితే ఇన్నేళ్ల తర్వాత జుకర్ మళ్లీ హార్వర్డ్‌కు వెళ్తున్నారు. ఈ సారి డిగ్రీ కూడా తీసుకోనున్నారు. జుకర్‌కు హార్వర్డ్ యూనివర్శిటీ గౌరవ డిగ్రీ ఇవ్వనుందట.జుకర్‌బర్గ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసిన వీడియో ద్వారా ఈ విషయం తెలిసింది. మే నెలలో హార్వర్డ్ యూనివర్శిటీ గ్రాడ్యుయేషన్ డే జరగనుంది. ఇందులో జుకర్‌బర్గ్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నారు. అయితే గ్రాడ్యుయేషన్‌డేలో ఏం మాట్లాడాలో సలహా ఇవ్వాలంటూ జుకర్.మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను కోరారు. వీరిద్దరూ మాట్లాడుకున్న వీడియోను జుకర్ తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. జుకర్‌కు ఉపన్యాసంలో సాయం చేస్తానని గేట్స్ చెప్పడంతో ఈ వీడియో ముగుస్తుంది.‘ ఈ గౌరవ డిగ్రీతో నీ కల నెరవేరుతుందని ఆశిస్తున్నా’ అని జుకర్‌కు గేట్స్ అభినందనలు తెలిపారు. హార్వర్డ్ యూనివర్శిటీలో డిగ్రీ సీటు సాధించిన జుకర్‌బర్గ్... 2004లో తన రెండో సంవత్సరం విద్యాభ్యాసాన్ని మధ్యలోనే వదిలేసి... ఫేస్‌బుక్‌ను విస్తరించేందుకు పూర్తిస్థాయిలో పనిచేశారు. కాగా...సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌ను స్థాపించిన బిల్‌గేట్స్ కూడా హార్వర్డ్ నుంచి మధ్యలోనే వచ్చేశారు. అంతేగాక 2007 లో జరిగిన హార్వర్డ్ గ్రాడ్యుయేషన్ డేలో బిల్‌గేట్స్ ప్రసంగించారు.

## నందిటీవీ ఫిల్మ్ అవార్డుల ఎంట్రీలకు ఆహ్వానం

**రాజధాని ప్రతినిధి, (అమరావతి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014,15, 16 వరుసగా మూడు సంవత్సరాలకు సంబంధించి ఉత్తమ టీవీ చిత్ర నిర్మాణాల, ఉత్తమ కళాకారుల, సాంకేతిక నిపుణులకు సంబంధించి నంది టీవీ ఫిల్మ్ అవార్డుల ఎంపిక కొరకు నిర్మాతల నుంచి ఎంట్రీ ఫారాలను కోరుతున్నట్లు ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఆయా సంవత్సరాల్లో జనవరి 1నుండి డిసెంబరు 31 మధ్య కాలంలో తెలుగు భాషలో, భారతదేశంలో నిర్మించిన టీవీ చిత్రాలు, తెలుగు భాషలో ఉపగ్రహ ప్రసారం ద్వారా ఏపీ తెలుగు ఛానళ్ళలో ప్రసారం చేసిన వాటికోసం ఆసక్తిగల నిర్మాతల నుంచి ఎంట్రీలకు ఆహ్వానం కోరుతున్నామని తెలిపారు. ఒక కేటగిరీలో నమోదైన టీవీ ఫిల్మ్‌లు, మరో కేటగిరీలో నమోదు కోసం అర్హత కల్గివుండవని, డబ్ చేసినా, పున:నిర్మించినా టీవీ చిత్రాలు అవార్డులకు అర్హత కావన్నారు. అన్ని వివరాలతో పూర్తి చేసిన ఎంట్రీ ఫారాలను ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దాఖలు చేయాలని, ఇతర వివరాలకు apsftvdc.in సంప్రదించాలని వెంకటేశ్వర్ తెలిపారు.

# ఆ కేసేమీ కాదులెండి : చంద్రబాబు

- నాపై కేసులేయడం వాళ్లకు కొత్తకాదు..
- నామీద 26 కేసులు వేశారు.. ఏమయ్యాయి?
- ప్రతిభ వల్లే లోకేశ్‌కు ఎమెల్సే



**రాజధాని ప్రతినిధి-అమరావతి :** “ఆ కేసేమి కాదులెండి... వదిలేయండి. అలా కేసులు వేస్తుండడం వాటికి అలవాటే. ఇది ఇప్పుడు కొత్తకాదు. ఒకటి అయ్యాక ఇంకొకటి వేస్తూనే ఉంటారు. 26 కేసులు వేశారు. ఏమయ్యాయి?” అని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఓటుకు కోట్లు కేసులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి చంద్రబాబుకు నోటీసులు జారీచేయడంపై ఆయన పైవిధంగా స్పందించారు. వెలగపూడి తాత్కాలిక అసెంబ్లీ భవనాల్లోని కమిటీ హాల్లో చంద్రబాబు మీడియాతో మాటాడుతూ ఈ వాఖ్యాలు చేశారు. సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసిన అంశాన్ని గుర్తుచేయగా అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా మీడియాకు ఇతర సమాచారాన్ని వివరిస్తున్న ఆయన ముఖకవళికలు మారిపోయాయి. లిప్తకాలంపాటు తత్తరపడి తేరుకుని “వాళ్లు కేసులు వేయడం ఇప్పుడు కొత్త కాదు. ఇప్పటికే నాపై 26 కేసులు వేశారు. కొన్నిటిని కోర్టులే కొట్టేశాయి. అయినా వేస్తూనే ఉన్నారు. వారికిదో అలవాటు. గతంలో నాపై ఎక్సైయిజ్ కేసు వేస్తే 12 ఏళ్లపాటు కొనసాగింది. కేసులు ఏమీ కాదు. ఇందకు ముందు కూడా సుప్రీంకోర్టులో వాళ్లు కేసులు వేయగా న్యాయస్థానం కూడా వారికి మొట్టికాయలు వేసింది. అయినా తీరు మారలేదు. వాళ్లంతే. అవన్నీ వదిలేయండి.” అని చెప్పారు. ఓటుకు కోట్లు కేసుగురించి మరింత స్పష్టమైన వివరణ కోసం ప్రయత్నించగా... “ఎవరేం చేస్తున్నారో తెలుసు. మీరే చేయిస్తున్నారు. నువ్వు అక్కడ చేరి ఏంచేస్తున్నావో తెలుసు” అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు.

**ప్రతిభ ఉందనే లోకేశ్‌కు పదవి**

ప్రతిభను గుర్తించే నారా లోకేశ్‌కు ఎమ్మెల్సే పదవి ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. లోకేశ్‌కు ఎమ్మెల్సే పదవి గురించి మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు “లోకేశ్‌తోసమా ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవులకు ఎంపికైన వారంతా ఆ పదవులకు అర్హులే. వారి ప్రతిభ మీదనే పదవులు ఇచ్చాను. ఎవరు పనిచేస్తున్నారో వారికి పదవులు వస్తాయి. పార్టీ కోసం పనిచేస్తున్నందునే లోకేశ్, అర్జునుడులకు పదవులు ఇచ్చారు. గతంలో అనివార్య కారణాల వల్ల పదవులు ఇవ్వలేకపోయాను. వారంతా పార్టీకి సహకరించారు. పార్టీ పట్ల విధేయత, సమర్థతలను గుర్తించి ఇప్పుడు కొందరికి ఇచ్చాం. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించాలనుకున్నాం. ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుంది” అని వివరించారు. మంత్రివర్గంలోకి తీసుకుంటారా? అని ప్రశ్నించగా “ఎప్పుడైనా చెప్పింది. చేశానా... చేసేది చెపుతానా...” అంటూ నవ్వుతూ దాటవేశారు.

# నష్టాల నుండి ఆర్టీసీని కాపాడుకోవాలి

### ఆర్టీసీ ఈయూ ఉప ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్

**రాజధానిప్రతినిధి, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు వేల కోట్ల నష్టాలతో నడుస్తున్న ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీని ఆర్థికంగా కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆర్టీసీ ఈయూ ఉప ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో 60 రోజులు సమ్మె చేసినప్పుడు ఆర్టీసీ మనుగడ కష్టమౌతుందని కార్మిక సంఘాలన్ని మొరపెట్టుకున్నప్పుడు విభజన వలన నష్టపోతున్న ఆర్టీసీని కాపాడుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుని వైద్య, విద్యా రంగాల మాదిరిగానే ఆదుకోవాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కోసం సంస్థలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు గుర్తింపు సంఘం ఎస్ఎంయూ కలిసి రావాలని లేఖ ఇచ్చారన్నారు. ఆర్టీసీ నష్టాలకు కార్మికులు కారణం కాదని చెప్పారు. కానీ కార్మికులను తగ్గించాలనే ధ్యేయంతో యాజమాన్యం నష్టాలు తెస్తున్న బస్సులను రోజురోజుకు తగ్గిస్తుందన్నారు.దీని వలన రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని తెలిపారు. అక్రమంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ వలన ఏడాదికి రూ.2 వేల కోట్ల ఆదాయం ఆర్టీసీ కోల్పోతుందన్నారు. ఎన్ఎంయూ ఎన్నికలలో ఇచ్చిన ఏ హామీని కూడా నెరవేర్చలేదన్నారు. నష్టాలతో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం. హనుమంతరావు, ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ బి.కోటేశ్వరరావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణారావు, ఎస్.కె.ఎం.సుభాని, ఎన్.వి.రెడ్డి, దత్తు పాల్గొన్నారు.

# టీడీపీలో కలవరం

**రాజధాని ప్రతినిధి- అమరావతి :** ఓటుకు నోటు కేసులో ఇక ఇబ్బందులు లేవని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన పార్టీలో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు భావిస్తున్న తరుణంలో ఆ కేసును సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నోటీసులు జారీచేయడంతో సీఎం చంద్రబాబుతో సహా ఆ పార్టీ నేతలంతా షాక్‌కు గురయ్యారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని వెలగపూడిలో నిర్మించిన శాసనసభ సమావేశాలు ప్రారంభం తొలిరోజున సుప్రీంకోర్టు నోటీసులు జారీచేయటం ఆ పార్టీ నేతల్లో కలకలం సృష్టించింది. ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ శాసనసభ ఆవరణలో ఉండి ఎమ్మెల్సీ నామినేషన్ దాఖలు చేసిన కొద్దిసేపటికే బాబుకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. 2015 జులైలో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేలా డబ్బులిచ్చి ఆయనను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన కేసులో తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అరెస్టు అయ్యారు. ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను కొనేందుకు రూ. 50లక్షలు తీసుకొని ఆ ఎమ్మెల్యే ఇంటికి రేవంత్‌రెడ్డి వెళ్లి అక్కడి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్టీఫెన్‌సన్‌తో ఫోన్‌లో మాట్లాడించారని తెలంగాణ ఏసీబీ కేసులు నమోదు చేసింది.

ఈ కేసులో చంద్రబాబు అరెస్ట్ చేసి శిక్షించాలని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, రామకృష్ణారెడ్డికి లోకల్ స్టాండ్ లేదని, ఈ కేసులో చంద్రబాబును విచారించాల్సిన అవసరం లేదని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఆళ్ళ రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. రామకృష్ణారెడ్డి అప్పీల్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శరత్ అరవింద్ బాబ్డే, జస్టిస్ లావు నాగేశ్వరరావులు విచారణకు స్వీకరిస్తూ చంద్రబాబుకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేయటం ఇటు ఆంధ్ర రాజకీయ వర్గాలలోనే కాకుండా, తెలంగాణ రాజకీయ పార్టీల నేతలలో కూడా సంచలనం రేకెత్తించింది.

**భారతదేశంలో న్యాయం, ధర్మం బతికే ఉన్నాయి - ఎమ్మెల్యే ఆళ్ళ**

భారతదేశంలో న్యాయ , ధర్మం బతికే ఉన్నాయని, ఓటుకు నోటు కేసులో చంద్రబాబుకు శిక్షపడుతుందని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి చెప్పారు. శాసనసభలోని మీడియా పాయింట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఓటుకు నోటు కేసు వ్యవసహారాన్ని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గవర్నర్‌తో చదివించిన ప్రసంగంలో ఒకటిన్నర పేజి నీతి, న్యాయాల గురించి మాట్లాడించారని,ఆ రెండు ఆయనకు లేవన్నారు. సర్వ వ్యవస్థలను చంద్రబాబు మేనేజ్ చేయగలడని పేరుపడ్డారని, కాని సుప్రీంకోర్టు కేసులో ఆయనకు తప్పకుండా శిక్షపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెక్షన్ 39, సెక్షన్ 190 సీఆర్‌పీసీ ప్రకారం ప్రజానాయకుల అవినీతి అక్రమాలపై ఎవరైనా కేసు వేయవచ్చన్నారు. ఫోన్‌లో మాట్లాడింది. తాను కాదని ఇప్పటివరకు చంద్రబాబు చెప్పలేకపోయారని, భారత దేశంలో న్యాయ,ధర్మం బ్రతికే ఉన్నాయి కాబట్టి ఆయనకు శిక్ష తప్పదన్నారు.

## రెండెంకెల అభివృద్ధిలో పురోగమిస్తున్న ఆంధ్రప్రదేశ్

# అద్భుత నగరంగా అమరావతి

### గవర్నర్ నరసింహన్

మాన్యశ్రీ అధ్యక్షా,
సభాపతి మహాశయా,
గౌరవనీయులైన శాసనమండలి సభ్యులారా !

2016-17 బడ్జెట్ సమావేశాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఉభయసభల మూడవ సంయుక్త సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించడం నాకు సంతోషంగా ఉంది.

మొదటగా, రాష్ట్ర విభజన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురైనటికీ అభివృద్ధి సంక్షేమ రంగాలలో గణనీయమైన పనితీరు. అంచనాల మేరకు ప్రజల జీవనతీరుతో నా ప్రభుత్వం తన సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో ప్రశంసించదగిన పురోగతిని నమోదు చేసిందని తెలిపేందుకు సంతోషంగా ఉంది.

అశాస్త్రీయ రాష్ట్ర విభజన వల్ల నూతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాబడులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందనే విషయాన్ని సభకు తెలియజేస్తున్నాను. సమైక్య రాష్ట్రంలో జనాభా పరంగా 58 శాతం ఉండగా, రాబడుల పరంగా 46 శాతం మాత్రమే రాష్ట్రానికి అందిందన్న విషయాన్ని 14వ ఆర్థిక సంఘమే ధృవీకరించింది.

2014-15 ఆర్థిక సంవత్సరంలో వనరుల వ్యత్యాసాన్ని రూ.16,079 కోట్లుగా ఎ.జి.అంచనా వేయగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు మంజూరైన అడ్‌హాక్ గ్రాంటు రూ2,303 కోట్లు. చాలా పెద్ద మొత్తంలో అంటే రూ.13,776 కోట్ల మేరకు మంజూరు అందవలసి ఉంది. అదేవిధంగా, రాష్ట్రంలోని 7 వెనుకరబడిన జిల్లాల అభివృద్ధి కోసం గత రెండు సంవత్సరాలలో ప్రతి జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్ల గ్రాంటు అందింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చేర్చిన విధంగా పార్లమెంటులో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం పన్ను ప్రోత్సాహకాలు, నూతన రాజధాని అభివృద్ధి కోసం ఆర్థిక గ్రాంట్లు, నూతన రైల్వే జోను హామీ, జాతీయ ప్రాజెక్టుగా పోలవరానికి ఆర్థిక సహాయం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామనే మొదలైనటువంటి హామీలు ఇంకా నెరవేర్చవలసి ఉంది. హుద్‌హుద్ తుఫానుతో ఆరంభమయి వరుసగా ఏర్పడిన ప్రకృతి విపత్తులు కూడా రాష్ట్రానికి తీవ్రంగా దెబ్బతీశాయి. వీటి వల్ల విశాఖపట్టణం బీభత్సంగా మారింది. దాదాపు రూ.70,000 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వెనువెంటనే చాలా జిల్లాలలో తీవ్ర అనావృష్టి నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వరదలు సంభవించాయి. అయినప్పటికీ, అనావృష్టి పరిస్థితులలో మా సమర్ధవంతమైన నీటి నిర్వహణకు రైతు సమాజం ప్రశంసించటంతోపాటు, హుద్‌హుద్ తుఫానును, వరదలను ఎదుర్కొవడంలో నా ప్రభుత్వం చేసిన కృషికి దేశ నలుమూలల నుండి ప్రశంసలు రావడం హర్షించదగిన విషయం.

2015-16 ఆర్థిక సంవత్సరంలో నిరంతర కఠోర శ్రమ, అంకితభావంతో రాష్ట్రం రెండకెల వృద్ధిని విజయవంతంగా సాధించగలదు. 2015-16 ముందస్తు అంచనాల ప్రకారం, తత్సమాన కాలంలో జాతీయ వృద్ధి 7.6 శాతంగా ఉండగా, స్థిర (2011-12) మార్కెట్ ధరలలో జిఎస్‌డిపి 10.99 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే సమయంలో జాతీయ వృద్ధి 7.3 శాతం ఉండగా, సమగ్ర స్థూల విలువ ఆధారిత (జివిఎ) వృద్ధి స్థిర (2011-12) ప్రాధమిక ధరలలో 10.50 శాతంతో రాష్ట్ర ప్రతిష్టను సడలించలేదు. అనావృష్టి ఉన్నప్పటికీ అనుబంధ రంగాల మద్ధతుతో వ్యవసాయ రంగం 8.40 శాతం వృద్ధిని నమోదు చేశాయి. కాగా, తయారీ, సేవా రంగాలు వరుసగా 11.13 శాతం 11.39 శాతం నమోదు చేశాయి. మొదటిసారిగా తలసరి ఆదాయం రూ.1.07 లక్షలకు చేరడం హర్షించదగిన విషయం. మన రాష్ట్రాన్ని దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రజలు నాయకత్వంపై ఉంచిన అచంచల విశ్వాసం, నమ్మకాన్ని నిలబెట్టుకొనేందుకు వీలుగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధి రేటును సాధించాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది.

నా ప్రభుత్వం ఉపరితల భూగర్భ జల వనరులను ఒక ప్రభావ వంతమైన విధానం ద్వారా అభివృద్ధి పరచడం, సంరక్షించడం, వినియోగించడం ద్వారా కరవురహిత రాష్ట్రంగా వుంచడానికి కృషి చేస్తున్నది. వర్షాకాలం ముందు దాదాపు 8 మీటర్లకు వర్షాకాలం తరువాత దాదాపు 3 మీటర్లకు భూగర్భ జల స్థాయిని పెంచాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో నా ప్రభుత్వం పనిచేస్తున్నది. పంట సంజీవిని క్రింద కరవు కాలాలలో జీవనాధార సాగు కోసం సాగునీటిని సమకూర్చడానికిగాను 8.75 లక్షల సాగు కుంటల భారీ నిర్మాణ కార్యక్రమాన్ని, రెయిన్ గన్‌ల వినియోగాన్ని చేపట్టడమయింది. జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందినట్టి సూక్ష్మ సేద్యంపై శ్రద్ధ వహించడానికి గాను నీటి రక్షిత టెక్నాలజీపై దృష్టిసారిస్తుంది.

రాష్ట్రంలోని ఏడు ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం నా ప్రభుత్వ ప్రధాన అంశం. నా ప్రభుత్వం 2016, జూన్ నాటికి తోటపల్లి. పోలవరం కుడి ప్రధాన కాలువ, గాలేరు-నగరి హంద్రీనీవా, 2017 జూన్ నాటికి వంశధార 2వ దశ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ వెలిగొండ ప్రాజెక్టులు 2018, జూన్ నాటికి పోలవరం 1వ దశ పనులను పూర్తి చేయాలన్న నిబద్ధతతో ఉంది. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న మొదటి నిర్ణయాలలో ఒకటిగా ఉన్న పోలవరం ముంపు క్రిందకు వచ్చే ఏడు మండలాలను బదిలీ చేయాలన్న నిర్ణయం వల్ల పోలవరం ప్రాజెక్టు ఆచరణ సాధ్యమయింది. పట్టిసీమ ఎత్తిపోతల సాగునీటి పథకం, ముందెన్నడూ లేని విధంగా విశిష్ట కృషితో 5 1/2 నెలల రికార్డు సమయంలో గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తూ ఆయా ప్రాంతాలలో ప్రస్తుత పంటలను సంరక్షించేందుకు కృష్ణా డెల్టాకు 8 టిఎంసిల నీటిని తీసుకొనిరావడానికి వీలు కల్పించింది. వృధాగా సముద్రంలో కలిసిపోయో గోదావరి నీటిని 80 టిఎంసిలకు తక్కువ కాకుండా కృష్ణా డెల్టాకు మళ్లించడం ఈ పథకం ఉద్దేశం. తద్వారా శ్రీశైలం జలాలను రాయలసీమ జిల్లాలకు కేటాయించడానికి వీలవుతుంది. నా ప్రభుత్వం రూ.134 కోట్లను ఖర్చు చేయడం ద్వారా అమలులో లేని 175 ఎత్తిపోతల సాగునీటి వ్యవస్థలన్నింటినీ పునరుద్ధరించింది. తద్వారా 1.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడమవుతున్నది. రాబోయే రోజులలో కృష్ణా, పెన్నా నదులను ఆ ప్రాంతంలోని రైతులను ప్రయోజనాలను కల్పించడానికి వీలుగా అనుసంధానించడంపై దృష్టి పెడుతుంది.

నీరు-చెట్టు కార్యక్రమం క్రింద మరీ ముఖ్యంగా రాయలసీమలోని చిత్తూరు, కడప, అనంతపురము జిల్లాలలో చేపట్టిన పనులు, భూగర్భ జల మట్టాలలో గణనీయమయిన మెరుగుదల ఫలితాలనిచ్చాయి. జలవనరుల శాస్త్రీయ నిర్వహణకు భూగర్భ జలలభ్యతను అత్యంత ఉపయోగకరంగా ఉండే 1254 పీజోమీటర్ల ద్వారా రియల్‌టైం బేసిస్‌పై నా ప్రభుత్వం పర్యవేక్షిస్తున్నది.

రైతాంగం తన భూమిని సాగుచేసుకోవడంలో దోహదపడే మరో ముఖ్యమైన కార్యక్రమం

"ఎన్‌టిఆర్ జల సిరి". 1వ దశ క్రింద, 50,000 మంది షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, చిన్న, సన్నకారు రైతులకు చెందిన 2.19 లక్షల ఎకరాల భూమికి సాగునీటికి అందించడమయింది. 2వ దశ క్రింద, సాగునీటి సదుపాయాలను పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆయకట్టు, ఆయకట్టే తర ప్రాంతాలలో 1.24 లక్షల బోరు బావులను మంజూరు చేయడమయింది.

జనాభాలోని దాదాపు 63 శాతం మందికి జీవనోపాధిని సమకూర్చే వ్యవసాయం దశాబ్దాలపాటు లాభదాయకతలేనిదిగానే కొనసాగుతున్నది. అన్ని పంటల ఉత్పదకత స్థాయిలను పెంచే మా చర్యలు మంచి ఫలితాలను చూపిస్తున్నాయి. లోటు వర్షపాతం, రాష్ట్రంలోని కొన్ని భాగాలలో మునుపెన్నడూలేని భారీ వర్షాలు నమోదు అయినప్పటికీ పప్పుధాన్యాల ఉత్పత్తులో గణనీయమైన పెరుగుదలను చూపించింది. రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు రూ.24,500 కోట్ల చెల్లింపు బాధ్యతతో, అంతేగాక, ఉద్యానవన రైతులను రూ.600 కోట్ల చెల్లింపు బాధ్యతతో నా ప్రభుత్వం రుణవిమోచన పథకాన్ని అమలుచేస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.7433.00 కోట్ల మొత్తాన్ని రైతులకు చెల్లించింది. రెండంకెల వృద్ధిని సాధించడం కోసం ప్రాథమిక రంగం క్రింద వృద్ధి చోదకాలలో ఒకటిగా మత్స్యపరిశ్రమ రంగాన్ని గుర్తించడమయింది. 974 కి.మీ.ల తీరప్రాంత, 6.00 లక్షల హెక్టార్లలో మంచి, ఉప్పునీటి వనరులతో రాష్ట్రం మత్స్యపరిశ్రమల అభివృద్ధి కోసం అపరిమిత సామర్థ్యాన్ని కలిగివుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం చేపలు, రొయ్యల ఉత్పత్తి విలువలో మొదటి స్థానంలోనూ, సముద్ర సంబంధ చేపల ఉత్పత్తిలో నాల్గవ స్థానంలోనూ ఉంది. నా ప్రభుత్వం ప్రకటించిన "2015 - ఆంధ్రప్రదేశ్ మత్స్యపరిశ్రమల విధానం" ఆంధ్రప్రదేశ్‌ను "ఆక్వాహబ్ ఆఫ్ వరల్డ్" గా తీర్చిదిద్దడానికి ఉద్దేశించడమయింది.

పశుగణ సంపద రంగం మరొక కలిసికట్టుగా వృద్ధి చెందుతున్న రంగంగా ఉంది. 62.54 లక్షల పేద కుటుంబాలకు మద్దతును అందిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ప్రతి ఐదు గుడ్లలో ఒకదానిని ఉత్పత్తి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉంది. అంతేగాక, రాష్ట్ర దేశంలోనే మాంసం, పాలు అగ్రగామి ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉండి, దేశంలోని మొదటి మూడు రాష్ట్రాలలో ఒకటిగా మారాలని లక్ష్యంగా పెట్టుకొంది.

వృద్ధి ఫలాలు సమాజంలోని పేద అర్హమైన వర్గాలకు చేరే విధంగా చేయడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివుండి భావనల లక్ష్యాన్ని సాధించడానికి, కలగలిపిన సమగ్ర సేవలను ప్రారంభించడమయింది. ఇ-పోస్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని దాదాపు 4 కోట్ల మంది లబ్దిదారులకు లబ్దిని చేకూర్చుతూ 136 లక్షల మంది రేషన్ కార్డుదారులకు తలసరి ఒక్కొంటికి 5 కిలోల బియ్యాన్ని సరఫరా చేయడమనేది దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో అగ్రగామి మార్పుగా ఉన్నది. "ఎన్‌టిఆర్ భరోసా" క్రింద దాదాపు 43 లక్షల మంది పింఛనుదారులకు నెలకు రూ.1000/-ల పింఛనును క్రమంతప్పకుండా మొదటివారంలో తప్పనిసరిగా అందించడమవుతున్నది. వికలాంగులు నెలకు రూ.1500/-లు అందుకుంటున్నారు. దీపం పథకం క్రింద గణనీయంగా 11 లక్షల గ్యాస్ కనెక్షన్లను ఇవ్వడమయింది. మిగిలిన ప్రతి పేద కుటుంబానికి 2017, మార్చి నాటికి కనెక్షన్లను సమకూర్చడమవుతుంది.

ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, అల్ప సంఖ్యాక వర్గాలు, మహిళల సంక్షేమం మా కార్యక్రమాలలో అగ్రభాగాన ఉన్నది. ఎస్‌సి ఉప-ప్రణాళిక, ఎస్‌టి ఉప-ప్రణాళిక బిసి ఉప-ప్రణాళికలో మొత్తం వ్యయం వరుసగా రూ.5878 కోట్లు, రూ. 1904 కోట్లు రూ.6640 కోట్లుగా ఉంది. ఉప-ప్రణాళికలు పూర్తిగా అమలు అయ్యే విధంగా చేయడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. విద్యార్థులకు కలిగిన కష్టాలను తగ్గించడానికి ఉపకార వేతనాన్ని వార్షిక చెల్లింపులకు బదులుగా ప్రభుత్వం త్వరలో నెలవారీ చెల్లింపు పద్ధతికి మార్చనున్నది. హాజరును పర్యవేక్షించి తద్వారా జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి సంక్షేమ వసతి గృహాలలో బయో మెట్రిక్స్‌ను ప్రవేశపెడుతున్నాం. సంక్షేమ శాఖలలో బ్యాంకు అనుమతించదగిన సబ్సిడీ పథకాలు,

సంపద సృష్టిలో ముఖ్యమైన ఉన్నాయి. పట్టిష్టంగా అమలు చేసే క్రమంలో సృష్టించిన ఆస్తులకు నా ప్రభుత్వం త్వరలోనే జియో-టాగింగ్‌ను ప్రారంభిస్తుంది. ఎస్/సి ఎస్‌టి/ బిసి/ అల్ప సంఖ్యాక వర్గాల విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించే విధంగా చేయడానికి. అన్ని వసతి గృహాలను నైవాసిక పాఠశాలలుగా స్థాయిని పెంచే ఒక విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. నైపుణ్య శిక్షణ, సివిల్ సర్వీస్ పరీక్షలను హాజరయ్యే వారికి శిక్షణకు భాధ్యత వహించడం, విదేశాలలో విద్యనభ్యసించడానికి ప్రతిభావంతులైన విద్యార్థులకు బాధ్యతవహించడం అనేవి ఉప-ప్రణాళిక క్రింద చేపట్టిన కొన్ని ముఖ్యమైన పథకాలు. బి.సి కులాలలోని గ్రామీణ చేతివృత్తుల వారికి ఆదాయం కలిగించే కార్యకలాపాలకు చేయూతనివ్వడానికి పలు నూతన పథకాలను మరింత పటిష్టపరచి పేదరికాన్ని నిర్మూలించడానికి ధనాన్ని వినియోగిస్తూ నిరుపేద వర్గాలకు మంచి జీవన ప్రయాణాలు విధంగా కట్టుదిట్టం చేస్తుంది.

బిసిల ప్రయోజనాలు దెబ్బతినకుండా కావు/ బలిజ/ఒంటరి/ తెలగ కులాలకు రిజర్వేషన్‌ను కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం జస్టిస్ మంజునాథ్ కమీషన్‌ను నియమించడమయింది. ఎనిమిది నెలలలోపు నివేదిక సమర్పిస్తుందని ఆశించడమయింది.

కాపు/బలిజ/ఒంటరి/ తెలగ కులాలలోని పేద కుటుంబాలకు ఆదాయకల్పన కార్యకలాపాలకు చేయూత నివ్వడానికి చరిత్రలో మొదటిసారిగా కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడయింది. రానున్న బడ్జెట్‌లో ఇందుకోసం రూ.1000 కోట్లను కేటాయించడమవుతుంది. అదేరీతిగా, బ్రాహ్మణ కులాలలోని పేదలకు సహాయం చేయడానికి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమయింది. రజక కులాన్ని షెడ్యుల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే అభ్యర్ధను వాల్మీకి కులాన్ని షెడ్యూల్,తరగతుల కేటగిరి జాబితాలో చేర్చాలని అభ్యర్ధనను కొన్ని ఇతర రాష్ట్రాలలో వారు ఇప్పటికే ఇదే విధమైన హోదాను అనుభవిస్తున్నందు వలన నా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. చేనేత కులాల ప్రయోజనం నా ప్రభుత్వానికి సర్వోన్నత ప్రాముఖ్యతగా ఉన్నది. వారి రుణమాఫీ నిమిత్తం రూ. 110.96 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

అల్పసంఖ్యగా వర్గా సంక్షేమం కోసం దుకాన్-మకాన్, రోష్ని, దుల్హన్, షాదీఖానా వంటి పలు పథకాలను నా ప్రభుత్వం అమలుచేస్తున్నది. కడప, విజయవాడలో హజ్‌హౌస్‌లను నిర్మించడమవుతుంది. కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయం కోసం ఇదివరకే శంకుస్థాపన చేయడమయింది. రానున్న విద్యాసంవత్సరంలో తరగతులను ప్రారంభించడానికి చర్యలు కొనసాగుతున్నవి. ముస్లిం రిజర్వేషన్ కోసం నా ప్రభుత్వం నిబద్ధత కలిగి ఉంది. ఉన్నత న్యాయ స్థానంలో కేసులను రక్షించడానికి మంచి న్యాయ కోర్టు విధులను నియమించుకోవడమవుతున్నది.

ఉపాధి పొందగలిగే నైపుణ్యాలను బోధించడం ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉండే విధంగా చేయడానికి ముందస్తు ఆవశ్యకత నైపుణ్య అభివృద్ధి అని నా ప్రభుత్వం భావిస్తున్నది. నైపుణ్య అభివృద్ధిపై ఆర్థిక కార్యకలాపంపై దృష్టిసారిస్తూ, ఒక సమగ్ర యువత సాధికారత విధానం ఆలోచనలో ఉన్నది. వచ్చే సంవత్సరం దీనికోసం రూ.500 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమవుతుంది. యువతకు నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడానికి నైపుణ్య అభివృద్ధి సంస్థ

సీమెన్స్, ఇండియన్ బిజినెస్ స్కూల్ వంటి ప్రఖ్యాత సంస్థలు ఇతర ప్రముఖ సంస్థల మధ్య భాగస్వామ్యం కుదుర్చుకొని ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఇంకనూ ఆరోగ్యదాయకంగా జీవించడానికి రాష్ట్ర యువతలో క్రీడా సంస్కృతికి సాయపడుతూ, 2019లో మన రాష్ట్రంలో జరగడానికి నిర్ణయించబడిన జాతీయ క్రీడలలో వారు పాల్గొనాలని అభిలషించి ప్రోత్సహిస్తున్నది.

ఆరోగ్య రంగానికి నా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది. ఎన్‌ఆర్ వైద్య సేవ క్రింద ఆరోగ్య బీమా వర్తింపును ఒక్కో కుటుంబానికి ఇదివరకే రూ.2.5 లక్షలకు పెంచడమయింది. ఇంకనూ, ఎన్‌ఆర్ వైద్య పరీక్ష క్రింద ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత రోగ నిర్ధారణ సేవలు అందించే నూతన చర్య తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ క్రింద ప్రసూతి సహాయక సేవలు, 102 కాల్‌సెంటర్ ప్రజల నుండి విస్తృతమైన ప్రశంసలు అందుకున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య పరికరాల నిర్వహణను, వాటి వినియోగాన్ని గరిష్టతరం చేయడానికి పిపిపి నమూనాపై ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వడమయింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎయిమ్స్‌కు కేటాయించింది. ఇటీవల మంగళగిరి వద్ద శంకుస్థాపన చేయడమయింది. పై అన్ని చర్యలు, రాష్ట్రంలోని పౌరులకు మెరుగైన ఆరోగ్య రక్షణ సౌకర్యాలను అందిస్తాయి.

సుస్థిరమైన అభివృద్ధికి విద్య ఒక కీలకమైన అంశంగా నా ప్రభుత్వం గుర్తించి, అందరికీ విద్యను వాస్తవం చేయడానికి చర్యలను చేపడుతున్నది. సర్వశిక్షా అభియాన్ రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఎ) క్రింద ప్రాధాన్యతపై పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను పటిష్టపరచడాన్ని చేపట్టడమయింది. విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం నిర్వహించే అన్ని పాఠశాలల్లో డిజిటల్ విషయాంశంతో నా ప్రభుత్వం దశలవారీగా డిజిటల్ తరగతి గదులను ప్రవేశపెడుతున్నది.

2019-20 నాటికి రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలని నా ప్రభుత్వ భావిస్తున్నది. 2014, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్నత విద్యారంగంలో 7 ప్రధాన జాతీయ సంస్థలను మంజూరు చేయడమయింది. 7 ఇన్‌స్టిట్యూట్లలోని 5 ఇన్‌స్టిట్యూట్లలో ఐఐటి తిరుపతి, ఐఐఎస్‌ఇఆర్ తిరుపతి, ఐఐఎం వైజాగ్, ఎన్‌ఐటి తాడేపల్లి గూడెం, ఐఐఐటి కర్నూలులో ఇప్పటికే విద్యాసంబంధ కోర్సులను ప్రారంభించడమయింది. ఉన్నత విద్యలో అగ్రగామి ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్లు రాష్ట్రంలో ప్రవేశం కోసం మార్గాన్ని సుగమం చేస్తూ రాష్ట్ర శాసనసభ ఒక విశేషమైన చట్టాన్ని ఆమోదించింది. రాష్ట్రాన్ని ఒక విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడానికి పై అన్ని చర్యలను ఉద్దేశించడమయింది.

ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎని అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండి, రాష్ట్రంలోని ఈ పథకం క్రింద చేపట్టిన కార్యక్రమాలు దేశమంతటికీ నమూనాగా మారాయని, ఆ విషయాలను తాజా ఆర్థిక సర్వేలో పేర్కొనడమయింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కలయిక ఇతర నిధులతో "వాడవాడలో చంద్రన్నబాట" అనే పేరుతో గ్రామాలలో అంతర్గత సిమెంటు రోడ్లు వేయాలనే మహోన్నత కార్యక్రమాన్ని నా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఒక్క సంవత్సరంలోనే మొత్తం 2704 కి.మీ.ల పొడవున సిమెంటు రోడ్లను వేయడమయింది. "పంట సంజీవిని" క్రింద 8.75 లక్షల వ్యవసాయ సాగు కుంటలను నిర్మించాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం క్రింద సుమారు 90 కోట్ల చెట్లను నాటడమయింది. ఈ పనితీరుకు గుర్తింపుగా 2014-15 సంవత్సరానికి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ క్రింద పారదర్శక, జవాబుదారీ విధానంలో చేపట్టిన సమర్థవంతమైన చొరవల కోసం ఆంధ్రప్రదేశ్ జాతీయ అవార్డును సాధించింది.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని గృహాలన్నింటికి వ్యక్తిగత గృహ కనెక్షన్ ద్వారా నీటిని సరఫరా చేయడమేనా ప్రభుత్వ దార్శనికతగా ఉంది. మొత్తం 48,206 జనావాసాలకుగాను, 18,057 జనావాసాలకు పాక్షికంగా వర్తింపు చేయడమయింది.(55 ఎల్‌పిసిడి),29,555 జనావాసాలకు పాక్షికంగా వర్తింపు చేయడమయిందని మిగిలిన 594 జనావాసాలు నీటి కొరతను (నాణ్యతా లోపం స్థితి) ఎదుర్కొంటున్నాయి. కొత్త పథకాలను మంజూరు చేయడం, పని చేయని పథకాలన్నింటిని పునరుద్ధరించడం ద్వారా ప్రతి పంచాయతీకి, ప్రతి మునిసిపాలిటీకి, ప్రతి కుటుంబానికి సురక్షితమైన, తాగదగిన మంచినీటిని సమకూర్చాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. తాగునీటి నాణ్యత సమస్యను పరిష్కరించడానికి, రూ.2/-లకు 20 లీటర్ల తాగునీటి సమకూర్చేందుకు "ఎన్‌టిఆర్ సుజల పథకం" విధానం క్రింద 728 జనావాసాలను వర్తింపులోకి తీసుకొనిరావడమయింది. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద 2019 నాటికి అన్ని గ్రామాలనూ బహిరంగ విసర్జన రహిత గ్రామాలుగా రూపొందించాలని కూడా ఉద్దేశించడమయింది. 2015-16లో,2.82 లక్షల "ఐహెచ్‌ఎల్" లను పూర్తి చేయడమయింది. 4.49 లక్షల "ఐహెచ్‌హెచ్‌ఎల్ " మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన నిర్మాణంలో ఉన్నాయి.

ప్రభుత్వం, 2022 నాటికి అందరికీ గృహాలను సమకూర్చేందుకు కట్టుబడి ఉంది. "ఎన్‌ఆర్ గృహనిర్మాణ పథకం" క్రింద గ్రామీణ ప్రాంతాలలో రెండు లక్షల గృహాలను, అందరకీ గృహాలు (హెచ్‌ఎఫ్‌ఎ) పథకం క్రింద పట్టణ ప్రాంతాలలో మరో రెండు లక్షల గృహాలను మంజూరు చేయడమయింది. గృహనిర్మాణం అనేది ఒక ఆర్థిక సంబంధ కార్యకలాపం అయినందున, ఈ పథకాన్ని ఒక ప్రధాన వృద్ధి చోదకంగానూ, ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావం కలిగి వుండేదిగానూ గుర్తించడమయింది. గృహాలను పూర్తి చేయడానికి లబ్దిదారులకు తగినంత మొత్తాన్ని అందుబాటులో ఉంచేందుకు నా ప్రభుత్వం గ్రామీణ గృహనిర్మాణ యూనిట్ వ్యయాన్ని సాధారణ వర్గాలకు రూ.70,000/-లు, ఎస్.సి.లకు రూ.1,00,000/-ల నుండి అందరికీ సమానంగా ఉండే విధంగా రూ.2.75 లక్షలకు పెంచింది. అంతేకాకుండా, సబ్సిడీని కూడా సాధారణ వర్గానికి చెందిన లబ్దిదారులకు రూ.1.25 లక్షలకు, ఎస్‌సి/ ఎస్‌టి లబ్దిదారులకు రూ.1.75 లక్షలకు పెంచింది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం లబ్దిదారునికి రుణంగా ఏర్పాటు చేయయడమవుతున్నది. అన్ని గృహాలకు టైల్స్‌తో ఫ్లోరింగ్ చేయడం, కిచెన్ ఫ్లాట్ ఫామ్, మెట్లు, పిట్టగోడ మొదలైనటువంటి అదనపు సౌకర్యాలను ప్రతిపాదించడమయింది. వ్యక్తిగత గృహాలకు ప్రభుత్వం సమకూర్చిన మొత్తంలో మునుపెన్నడూ పెంచనంత అత్యధిక మొత్తాన్ని పెంచడమయింది.

నా ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే నిమిత్తం ప్రజలు, ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యంతో 20 బదలాయించదగని బాధ్యతలతో "ఆకర్షణీయ గ్రామం - ఆకరషణీయ వార్డు" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో పాలుపంచుకొనేందుకు 14,000 మందికి పైగా భాగస్వాములు ఇప్పటికే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వారు బదలాయించగదని బాధ్యతలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నారు. నా ప్రభుత్వం "జన్మభూమి-మా ఊరు" అనే ప్రజా కేంద్రీకృత అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వివిధ ప్రాధాన్యతా రంగాలపై శ్రద్ధవహిస్తూ కార్యక్రమాలను మూడు దఫాలుగా నిర్వహించడమయింది. "ఆకర్షణీయ గ్రామం-ఆకర్షణీయ వార్డు" అనే అంశం ప్రధాన అంశంగా 2016, జనవరిలో 3వ దఫాకార్యక్రమాన్ని నిర్వహించడమయింది. గ్రామాలను / వార్డులను దత్తత తీసుకొంటూ అంగీకరించిన భాగస్వాములతో కలిసి పనిచేయడం ద్వారా కార్యక్రమంలో ప్రాధాన్యతనిచ్చిన బదలాయించదగని బాధ్యతలను నెరవేర్చేందుకు "స్మార్ట్ ఎపి ఫౌండేషన్"ను స్థాపించడమయింది.

విద్యుత్ రంగంలో చేపట్టిన చర్యల విషయంలో రాష్ట్రం మొత్తం దేశానికే ఆదర్శంగా మారింది. నా ప్రభుత్వం గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులందరికీ ఇరవై నాలుగు గంటలూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ 7 గంటల పాటు నాణ్యమైన, ఉచిత విద్యుత్‌ను అందించేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రం, 22.5 మిలియన్ యూనిట్లలోను విద్యుత్ నుండి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారింది. నా ప్రభుత్వం ఈ సంవత్సరంలో "ఎటి ్&సి " నష్టాలను 10.29 శాతానికి తగ్గించింది. వచ్చే సంవత్సరం నాటికి ఈ నష్టాన్ని సింగిల్ డిజిట్‌కు తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించింది. విద్యుత్‌ను సంరక్షించేందుకు వీలుగా, నా ప్రభుత్వం గృహ వినియోగదారులందరికీ "ఎల్‌ఇడి" బల్బులు పంపిణీని చేపట్టి ఇప్పటివరకు 93.5 లక్షల కుటుంబాలకు దాదాపు 1.87 కోట్ల "ఎల్‌ఇడి" బల్బులను పంపిణీ చేసింది.

సామర్థ్యంలేని అన్ని వ్యవసాయ పంపుసెట్ల స్థానంలో ఇంధన సమర్ధతతో కూడిన, ఐఎస్‌ఐ పంపు సెట్లను దశలవారీగా సమకూర్చేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అంతేగాక, ప్రభుత్వం, రైతులకు 3,000 సోలార్ పంపు సెట్లను పంపిణీ చేసింది. 2016-17లో 20,000 సోలార్ పంపు సెట్లను పంపిణీ చేయాలనే కార్యక్రమాన్ని రూపొందించడమయింది. భారత ప్రభుత్వం ప్రారంభించిన 5 ఇంధన సామర్థ్యం అవార్డులన్నింటిని గెలుచుకుందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. పునరుత్పాదక ఇంధనాన్ని రాష్ట్రం ప్రోత్సహిస్తున్నది 2016, ఏప్రిల్ నాటికి గ్రిడ్‌కు 619 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని జతచేయడమవుతుంది. నిరుపేదలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు 2016, జూన్ నాటికి రాష్ట్రంలో మిగిలిన 4.6 లక్షల కుటుంబాలకు విద్యుద్దీకరణను పూర్తి చేయాలనే కార్యక్రమాన్ని రూపొందించడమయింది.

భారతదేశపు "యాక్ట్ ఈస్ట్ పాలసీ" కి అనుగుణంగా 974 కి.మీ.ల పొడవైన తీరప్రాంతాన్ని వినియోగించుకోవడానికి వీలుగా "పోర్టు ఆధారిత" అభివృద్ధి నమూనాను నా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోని తూర్పు కోస్తాపై లాజిస్టిక్స్ హాబ్‌గానూ, భారతదేశానికి "గేట్-వే" గానూ అభివృద్ధి చేసేందుకు బాగా అనువుగా ఉంది.

మన విమానాశ్రయాలు వార్షిక రాకపోకలలో గత సంవత్సరం కంటే 59 శాతం వృద్ధిని కనబరిచాయి. విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరంలో ఉన్న ప్రస్తుత విమానాశ్రయాల విస్తరణ పనులు బాగా చురుకుగా జరుగుతున్నాయి. భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లు, నాగార్జున సాగర్, దొనకొండలలో 5 కొత్త విమానాశ్రయాను చేపట్టాని ప్రతిపాదించడమయింది.

ఫ్లోటింగ్ స్టోరేజీ రీగ్యాసిఫికేషన్ యూనిట్ '(ఎఫ్‌ఎస్‌ఆర్‌యు) పనులను, కాకినాడ నుండి విశాఖపట్టణానికి గ్యాస్ పైప్ లైను పనులను 2016-17లో ప్రారంభించడమవుతుంది. తూర్పు గోదావ, పశ్చమ గోదావరి, కృష్ణా జిల్లాలలో నగర గ్యాస్ పంపిణీ పనిని 2016-17లో చేపట్టడమవుతుంది.

నాలుగు లైన్లు లేదా ఆరు లైన్ల రోడ్డు ద్వారా అన్ని జిల్లాల ప్రధాన కార్యస్థానాల నుండి రాష్ట్ర రాజధానికి రోడ్డు అనుసంధానతను అభివృద్ధి చేయడంపై నా ప్రభుత్వం దృష్టిసారిస్తున్నది. అంతేగాక, అన్ని ప్రధాన ఓడరేవులు, పర్యాటక ప్రదేశాలు, పారిశ్రామిక హబ్‌లకు, సమీప జాతీయ రహదారులకు రోడ్డు అనుసంధానతను సమకూర్చడానికి, అన్ని వాతావరణాలకు తట్టుకొనే రెండు లైన్ల రోడ్డుతో అన్ని మండల ప్రధాన కార్యస్థానాలనూ జిల్లా ప్రధాన కార్యస్థానాలతో అనుసంధానించడానికి కూడా మేము కట్టుబడి ఉన్నాం.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ సహాయంతో దాదాపు రూ.70,000 కోట్ల అంచనా వ్యయంతో జాతీయ రహదారుల భారీ విస్తరణ కార్యక్రమాన్ని ఆరంభించింది. 1250 కి.మీ.ల రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా ప్రకటించడమయింది.

పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన పరిశ్రమలు ప్రపంచవ్యాప్తంగా పోటీపడేటట్లు చేయడానికి ఉత్తమ విధాన పత్రాలను, ఆర్థిక ప్రభుత్వం భూమి, నీరు, విద్యుత్తు, పరిపాలన, కార్మిక రంగాలలో ఆకర్షణీయ విధానాలను ఆచరణలో పెట్టింది. వ్యాపారాన్ని సులభంగా నిర్వహించే రాష్ట్రాలలో నా ప్రభుత్వం రెండవ స్థానాన్ని పొందింది. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి చైనా, జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ వంటి దేశాల నుండి వివిధ ప్రభుత్వ, వ్యాపార ప్రతినిధి వర్గాలు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించాయి. నా ప్రభుత్వం కూడా విశాఖపట్టణంలో 2016, జనవరిలో మొదటి సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్‌ను నిర్వహించింది. 41 దేశాల నుండి 300 మంది విదేశీ ప్రతినిధులతో సహాఈ సదస్సులో 1400 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు సంబంధించి రూ.4.67 లక్షల కోట్ల విలువ గల మొత్తం 328 ఎంఓయులు ఈ సదస్సులో అనుసంధానమయ్యాయి.

నా ప్రభుత్వం ముఖమైన వృద్ధి చోదకాలలో ఒకటిగా ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని గుర్తించి, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం రాష్ట్రాన్ని అత్యంత అనుకూల గమ్యస్థానంగా రూపొందించాలనే లక్ష్యంతో ఆకర్షణీయ ప్రోత్సాహకాలతో 2015-16 నూతన ఆహార ప్రాసెసింగ్ విధానాన్ని ప్రకటించింది. వ్యవసాయం కోసం నూతన దార్శనికత క్రింద పంట కోత పూర్వ, అనంతర సాంకేతిక విజ్ఞానాల ద్వారా ఫార్వార్డ్ & బ్యాక్వార్డ్ ఏకీకరణను సాధించడానికి ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల నుండి మద్ధతు, భాగస్వామ్యంతో గుర్తించిన 25 సరకులకు బ్రాండు కల్పిస్తూ నా ప్రభుత్వం ప్రపంచ ఆర్థిక ఫోరంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

పట్టణీకరణను ఒక చోదక శక్తిగా గుర్తిస్తూ, నా ప్రభుత్వం ఉత్తమ నివాస యోగ్యం కోసం రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలను అందమైన, పరిశుభ్రమైన, చెత్తరహిత పట్టణ జనావాసాలుగా రూపాంతరీకరించాలనే దార్శనికతను రూపొందించింది. రాష్ట్రంలోని ముప్పై ఒక పట్టణ స్థానిక సంస్థలు అటల్ రిజువనేషన్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (అమృత్) అనే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకంలో స్థానం సంపాదించాయి. "ఆకర్షణీయ నగరాలు" ప్రాజెక్టు క్రింద ఆకర్షణీయ నగరాలుగా విశాఖపట్టణం, కాకినాడ నగరాలు ఎంపిక అయ్యాయి. తరువాతి సంవత్సరం తిరుపతి నగరాన్ని ఆకరషణీయ నగరంగా ఎంపిక చేయడమవుతుంది. కర్నూలును ఆకర్షణీయ నగరంగా అభివృద్ధి చేయడానికి నా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందునిమిత్తం తొలుత రూ.100 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమవుతుంది.

నూతన రాజధాని అమరావతి ప్రపంచ శ్రేణి ప్రజా రాజధానిగా ఉండబోతున్నది. నాయకత్వంపై విశ్వాసం ఉంచి, రాజధాని నగర నిర్మాణం కోసం వారి స్వంత భూమిని స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకు వచ్చిన అమరావతి ప్రాంత రైతులకు నా ప్రభుత్వం ధన్యవాదాలను తెలుపుతున్నది. నిర్ణీత కాలపరిమితిలో ఉచితంగా బృహత్ ప్రణాళికను రూపొందించడంలో సింగపూరు ప్రభుత్వం అందించిన మద్ధతు ప్రత్యేక ప్రశంసలు పొందడానికి అర్హమైనది. ఉత్తమ వాస్తు శిల్ప సంస్థల ఎంపిక, వాస్తు శిల్ప ప్రణాళిక తయారీ ప్రాసెసులో ఉంది. దేశం లోపల, వెలుపల నుండి అనేక ప్రసిద్ధ కంపెనీలు నూతన రాజధానిలో తమ వెంచర్లను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నాయి. నా ప్రభుత్వం మొత్తం రాష్ట్రాన్ని సుసంపన్నత వైపు నడిపించే ఆర్థిక అధికార కేంద్రం పాత్రను పోషించగలిగే ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించగలదన్న నమ్మకంతో ఉంది.

నా ప్రభుత్వం పౌర కేంద్రీకృత ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టులను అమలుచేస్తున్నది. తద్వారా పౌరులు ఎక్కడినుండైనా సమర్ధవంతంగా, పారదర్శక విధానంలో ఇ-సేవలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఇ-తాల్ పోర్టల్ ప్రకారం ఇ-సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా సమాచారం అందించడం ద్వారా పౌరులు ఏకీకృతం సర్వీసలను సమకూర్చే ఒక భారీ కార్యక్రమమైనట్టి ఇ-గవర్నెన్స్ అథారిటీ క్రింద ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్, ఇ-ప్రగతిని ప్రవేశపెట్టడానికి, నైపుణ్యం, సమర్ధత, పారదర్శక లక్షణాలు గల సుపరిపాలన శకాన్ని ప్రారంభించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

భూముల విక్రయం, కొనుగోలులో అవకతవకలు,అవినీతిని నిర్మూలించాలనే దృష్టింలో నా ప్రభుత్వం ఉద్యమ విధానంలో భూమి రికార్డుల డేటాను సరిచేయాలనే లక్ష్యంతో ఐటి ఆధారిత "మీ ఇంటికి - మీ భూమి" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం క్రింద దాదాపు 72.15 లక్షల మంది పట్టాదారుల భూమి రికార్డులను తాజాపరచడమయింది. గ్రామీణ భూ సంబంధిత పట్టణాలన్నిటిని డిజిటలైజేషన్ పూర్తి ఆయింది. భౌగోళిక సంభందిత, పుస్తక ఆధారిత, అంతరిక్ష డేటా ఏకీకరణను చేపట్టడానికి నా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సర్వీసు బట్వాడాను మెరుగుపరచడానికి, అవినీతిని నిర్మూలించడానికి నా ప్రభుత్వం జి2సి , జి2బి, జి2జి లావాదేవీలన్నిటిలో ఐటి సొల్యూషన్‌లను అనుసరిస్తున్నది. వాస్తవ కాల ప్రాతిపదికన సమాచారాన్ని తాజాపరచడానికి పెక్కు శాఖలు ట్యాబ్‌లను సమకూర్చాయి. సర్వీసు బట్వాడాలో బయో మెట్రిక్‌లు, ఇ-పోస్ (పిఓఎస్), ట్యాబ్‌లను వినియోగిస్తున్నందున వివిధ వర్గాల నుండి ప్రశంసలను అందుకోవడమయింది. కేంద్ర ప్రభుత్వం మన విధానాన్ని ఇతర రాష్ట్రాలకు సిఫారసు చేస్తున్నది.

నా ప్రభుత్వం సముచిత విధానాలను తీసుకొనిరావడం, ప్రోత్సాహకాలను సమకూర్చడం ద్వారా అంకుర సంస్థలకు ప్రోత్సహిస్తున్నది. రాబోయే సంవత్సరాలలో, రాష్ట్రం అనేక విజయవంతమైన అంకుర కంపెనీలకు నెలవుగా ఉంటుంది.

నా ప్రభుత్వం 2016 లో అన్ని కుటుంబాలకు 10-15 ఎంబిపిఎస్ అనుసంధానాన్ని సమకూర్చడానికి ఎపి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేస్తున్నది. దీనిని కేవలం నెలకు రూ.150/-ల చెల్లింపుతో కేబుల్ టివి, ఇంటర్ నెట్ టెలిఫోన్ అనుసంధాన సేవల ప్యాకేజీని సమకూర్చడం ద్వారా దాదాపు 1.30 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాలని ఉద్దేశించడమయింది.

నా ప్రభుత్వం అన్ని స్థాయిలలో అవినీతిని నిర్మూలించాలని కృతనిశ్చయంతో ఉంది. ఇటీవల అవినీతిని ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తిని జప్తు చేయడానికి కఠినమైన నిబంధనలతో ప్రత్యేక కోర్టుల బిల్లును ఆమోదించింది.

మొత్తం మీద, ప్రజలందరూ శాంతితో, సుఖసంతోషాలతో ఉండేలా చూడటానికి నా ప్రభుత్వం నిబద్ధతతో ఉంది. రాష్ట్ర చరిత్రలో మనం సంక్షోభంలో ఉన్నప్పటికీ ఎదుర్కొన్న సవాళ్ల దశను, రాబోయే తరాలు సమర్ధిస్తాయి. ఈ విషయంలో నా ప్రభుత్వం పూర్తి అవగాహనను కలిగి ఉండటంతోపాటు నిర్దేశించుకొన్న అన్ని లక్ష్యాలను నెరవేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తుంది. స్వామి వివేకానంద మాటలతో ఈ ప్రసంగాన్ని ముగించాలనుకుంటున్నాను.

- జై హింద్

## జర్నలిస్టులు వృత్తినైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రెస్ అకాడమీ చైర్మన్ వాసుదేవ దీక్షితులు




**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** జర్నలిస్టులు వృతినైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ వాసుదేవ దీక్షితులు అన్నారు. నవ్యాంధ్ర రాజధానికి తొలిసారిగా వచ్చిన ఆయన ఒక హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విలేకరుల ఆలోచన విధానాల్లో కూడా మార్పు రావాల్సి ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విలేకరులకు శిక్షణాతరగతులను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మూస పద్ధతులను విడనాడాలని ఆయన సూచించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్లు మరింత వేగంగా సమాచారాన్ని పంచుకోవడంలో ప్రధానపాత్రను పోషిస్తున్నాయని తెలిపారు. విజయవాడకు త్వరలోనే ప్రెస్ అకాడమీ మార్చునున్నట్లు పేర్కొన్నారు. సమారశాఖ అదనపు డైరెక్టర్ మాల్లాది కృష్ణానంద్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ఏపీ ప్రెస్ అకాడమీ తొలి సమావేశం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా పలు జర్నలిస్టు సంఘాల నేతలు దీక్షితులకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు డాక్టర్ గోవిందరాజు చక్రధర్, ప్రెస్ అకాడమీ కార్యదర్శి డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి రూ.20 కోట్లు కేటాయించాలి

ఏపీయూడబ్ల్యూజే రావు కార్యవర్గం డిమాండు




**రాజధాని ప్రతినిధి ; (విజయనగరం) :** ఈ వారంలో ప్రారంభంకానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి రూ. 20 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి చేసింది. ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నల్లి ధర్మారావు, ఐవీ సుబ్బారావు విలేకరులతో మాట్లాడుతూ అస్సోం, తమిళనాడు రాష్ట్రాల వలే జర్నలిస్టు రిటైర్‌మెంట్ సమయానికి నెలకు పది వేల రూపాయలు చొప్పున పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, గృహాలను నిర్మించి ఇవ్వాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వక వాతావరణంలో జర్నలిస్టులకు ప్రత్యేక చట్టం తెచ్చేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, చిన్నపత్రికలకు కూడా ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ రాష్ట్రవ్యాప్త అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండు చేస్తున్నామన్నారు. జర్నలిస్టుల అవార్డులు ప్రకటించినా కూడా ఇంతవరకు ఇవ్వలేదని , వాటిని సత్వరమే అందివ్వాలని కోరారు. హెల్త్ కార్డు స్కీం మంచిదే అయినా దాని అమలు తీరు బాగోలేదన్నారు. సంబంధిత శాఖల సమన్వయ పర్యవేక్షణ కమిటీని వేసి హెల్త్‌కార్డులను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రాయితీలను కల్పించేందుకు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటి పైనా నేడు చర్చించి తీర్మానించామని, వీటిని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకుంటామని ధర్మారావు, సుబ్బారావు వెల్లడించారు. ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో తమ సమస్యల పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో విజయవాడలో అసెంబ్లీ సమావేశాల సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు, దానికి సంబంధించి భవిష్యత్ కార్యచరణను త్వరలో ప్రకటించనున్నట్లు వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఐజేయు ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు ఏపీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షులు సోమసుందర్, ఆలపాటి సురేష్ , కార్యదర్శి బి. ఆక్కులప్ప, ఉపాధ్యక్షులు ఎం.శ్రీరామమూర్తి, దిమిలి అచ్చుతరావు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివిఎస్‌వి ప్రసాద్‌రావు, జిల్లా కార్యదర్శి వి. మహాపాత్రో , వైయస్ పంతులు, లింగాల సర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## రోజాను నిలువరిస్తే చారిత్రక తప్పిదమే

- ప్రతిపక్షాలను చూసి ఎందుకంతగా భయపడుతున్నారని నిలదీత
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆర్‌కే రోజాను మరో ఏడాది పాటు శాసనసభలోకి అడుగుపెట్టనివ్వకుండా సస్పెన్షన్ కొనసాగించాలనుకోవడం అప్రజాస్వామికమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ పేర్కొన్నారు. నూతన రాజధాని అమరావతిలో ప్రారంభమవుతున్న శాసనసభలోకి ఓ మహిళా శాసనసభ్యురాలిని రానివ్వకుండా చేసి చారాత్రక తప్పదారికి పాల్పడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. రోజాను మరో ఏడాది పాటు శాసనసభకు దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే నీడను చూసి భయపడినట్లవుతుందని చెప్పారు. నూతన రాజధాని అమరావతిలో శాసనసభ ప్రారంభం కావడం చారిత్రక ఘటన అని చంద్రబాబు వర్ణిస్తే, రోజాపై మరో ఏడాది సస్పెన్షన్ కూడా చారిత్రకమవుతుందనడంలో సందేహం లేదన్నారు. చంద్రబాబు వెంట నీడలా ఈ చీకటి ఘటన కూడా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇలా చేయడం చంద్రబాబుకు కలిసివస్తుందా? రోజాకు కలిసివస్తుందా? అనేది చరిత్ర చెబుతున్నారు. నీడను చూసి భయపడే పరిస్థితి ఏపీ ప్రభుత్వానికి గానీ చంద్రబాబుకు గానీ ఎందుకు రావాలి? టీడీపీ ప్రభుత్వం అంత బలహీనంగా ఉందా? ఇలా చేయడం ద్వారా ఉందని తానే అంగీకరిస్తున్నారు. జాతీయ మహిళా పార్లమెంటుకు రోజాను ఆహ్వానించి మరీ విమానాశ్రయంలోనే నిర్బంధించడం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి ఇటీవల విశాఖకు బయలుదేరిన జగన్ మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలోనే నిర్బంధించడమేమిటని నారాయణ ప్రశ్నించారు. జగన్ ప్రధాన ప్రతిపక్షనాయకుడనే విషయాన్ని మరచి ప్రవర్తించడం తగదన్నారు.

## వేసవిలో స్పోకెన్ ఇంగ్లీషు & క్రికెట్ శిక్షణ

**రాజధాని ప్రతినిధి,రాయపూడి :** శ్రీ గంజి.జయరావు అకాడమీ ఆఫ్ ఇంగ్లీషు & స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మార్చి, ఏప్రిల్ నెలలలో 60 రోజుల పాటు" ఆంగ్లభాష-సంభాషణ, నైపుణ్య శిక్షణ" & క్రికెట్, బ్యాడ్మింటన్ శిక్షణ ఇవ్వబడుతుందని డైరెక్టర్ శ్రీ జి.ఎస్.పి. సాల్మన్‌రాజు తెలియచేశారు. వీటి అవగాహన కార్యక్రమం 12-03-17 ఉదయం 11 గం॥లకు రాయపూడి మెయిన్ స్కూల్,(వాటర్‌ట్యాంక్) వద్ద జరుపబడుతుంది. ఆసక్తి కలవారు హాజరయి వివరాలు తెలుసుకోవచ్చు.సంబంధిత వివరాలను'9849563037' నవంబర్‌ను సంప్రదించ వలసినదిగా నిర్వాహకులు తెలియచేశారు.

## భద్రతా మండలిని సంస్కరించాలి

భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్ ప్రతిపాదన

**ఐరాస :** భద్రతామండలిని కేవలం విస్తరించడం కంటే విభిన్నమైన నూతన భావాలతో సంస్కరించాలని భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లు ప్రతినిపాదించాయి. 4 దేశాలు సంయుక్తంగా ఈ మేరకు ప్రకటన విడుదల చేశాయి. భద్రతామండలి రోగగ్రస్తమైన సంస్థగా తయారయ్యిందని ఆ ప్రకటన పేర్కొంది. ఐరాసలో భారత్ శాస్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ ఆంతర్ ప్రభుత్వం చర్చల సమావేశంలో ఈ ప్రకటనను విడుదల చేశారు. ఐరాసలో అత్యధిక దేశాలు శాస్వత తాత్కాలిక సభ్యులను పెంచడం ద్వారా భదత్రా మండలిని విస్తరించాలని 4 దేశాలు ఆ ప్రకటనలో కోరాయి.

# పోలవరం పవర్ హౌస్ ఐదేళ్ల తర్వాతే...



**ఏలూరు :** బహుళార్ధ సాధక పోలవరం ప్రాజెక్టు పవరు హౌస్ నిర్మాణానికి ఐదు సంవత్సరాలకు పైగానే సమయం పడుతుందని విశ్వసనీయ సమాచారం. ఏపీ జెన్‌కో పవర్ హౌస్ నిర్మాణం మొదలైన 58 నెలల్లోగా (దాదాపు ఐదు సంవత్సరాలు) పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఈ ప్రణాళికలు సాకారం కావటంలో ఆలస్యమైతే మాత్రం పవర్ హౌస్ నిర్మాణం ఎన్నేళ్ళకు పూర్తవుతుందో చెప్పలేని స్థితి. పోలవరం ప్రాజెక్టు పనులు ఆరు నెలలుగా మందకొడిగానే సాగుతున్నాయి. కొండ తవ్వకం పనులు, మట్టి తవ్వకం పనులు జరుగుతున్నాయి. ఇవి లక్ష్యానికి అనుగుణంగా పూర్తయితే తప్ప సివిల్ పనులకు రంగం సిద్ధం కాదు. పవరు హౌస్‌కు సంబంధించిన మొత్తం కోటి 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం జరగాలి. అయితే అందులో ఇప్పటికి 85 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి త్వవకం మాత్రమే జరిగింది. మిగతా 33 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పనులు ఏప్రిల్‌లోగా పూర్తయితే మే నుంచి పవరు హౌస్ సివిల్ పునాది పనులు చేపట్టాలని ఏపీ జెన్‌కో ఆలోచిస్తున్నది. ప్రస్తుతం పవరు బ్లాక్, ఎప్రోచ్ ఛానల్, టైల్ వేస్‌ఛానల్, మట్టి పనులు సాగుతున్నాయి. కొండ తవ్వకం పనులు కూడా కొనసాగుతున్నాయి. ఏప్రిల్ నెలలోగా మట్టి పనులు పూర్తయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. పవరు హౌస్ నిర్మాణానికి ఏపీ జెన్‌కో రూ. 4800 కోట్ల అంచనాలతో గ్లోబర్ టెండర్లు పిలిచింది. ఏప్రిల్‌లో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి మేలో సివిల్ పనులు ప్రారంభించాలన్నది జెన్‌కో లక్ష్యంగా కనబడుతోంది. ఈ ఆశయం ఎంతవరకు నెరవేరుతుందో వేచి చూడాల్సిందే. పోలవరం హైడల్ పవర్ హౌస్ కేంద్రానికి 80 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన 12 టర్బైన్లు నిర్మించాలని జెన్‌కో నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుండి 58 మాసాల్లో పూర్తయ్యేలా జెన్‌కో ప్రణాళికలు రూపొందించింది. పవర్‌హౌస్ మొదటి యూనిట్‌ను 36 నెలల్లో పూర్తచేయాలని నిర్ణయించారు. మిగతా యూనిట్లు రెండు నెలల్లో పూర్తి చేయాలని సంకల్పించారు. ఒక్కో యూనిట్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ 58 నెలల్లో ఈ పని మొత్తాన్ని పూర్తిచేయాలని జెన్‌కో


**రూ. 4800 కోట్ల అంచనాలతో గ్లోబల్ టెండర్లు**

ఆశయంగా పెట్టుకుంది. ధవళేశ్వరం, కాటన్ బ్యారేజీ ఎగువన 42 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవిపట్నం మండలం అంగుళూరు వద్ద జల విద్యుత్ కేంద్రం పనులు జరుగుతున్నాయి. అంగుళూరు గ్రామాన్ని ఖాళీ చేయించి 303 ఎకరాల్లో 1.18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు, కొండను తొలిచే పనులు జరుగుతున్నాయి. పోలవరం డ్యామ్ ప్యాకేజీలోనే ఈ పవర్ హౌస్ మట్టి పనులు చేర్చటాన్ని ఇక్కడ ప్రత్యేకంగా గమనించాలి కొండను 154 మీటర్ల మేర భూమట్టం వరకు తవ్వాలి. అక్కడ నుంచి మరో 8 మీటర్ల లోతుకు వెళ్ళాల్సి ఉంటుంది. 9 మీ. వ్యాపార్థంలో 12 టర్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. పోలవరం ప్రాజెక్టు ద్వారా ఈ పవర్ హౌస్‌కు నీటిని తీసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన తరువాత గోదావరి నదిలో కాటన్ బ్యారేజీ వైపుకు నీటిని విడిచి పెడతారు. దీని వలన పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుండి కాకుండా విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరం కాటన్ బ్యారేజీకి నీరు చేరుతుంది.

# భూసేకరణ చట్టాన్ని ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది

**గుంటూరు సిటీ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూసేకరణ చట్టం 2013లోని అంశాలను విస్మరిస్తోందని, పరిహారం, పునరావాసం విషయంలో చట్టాన్ని ఉల్లఘిస్తోందని, ఇది తీవ్ర పరిస్థితులకు దారితీస్తోందని న్యాయవాది పరిషత్ రాష్ట్ర సదస్సులో వక్తలు పేర్కొన్నారు. గుంటూరులోని ఇండియన్ టుబాకో అసోసియేషన్ కళ్యాణ మండపంలో గత రెండు రోజులుగా జరుగుతున్న నాయ్యవాది పరిషత్ ప్రథమ రాష్ట్ర స్థాయి సదస్సు ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు కె.ఎస్.మూర్తి మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలకు చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు స్వాతంత్ర్య ఉద్యమంలో నిర్వహించిన పాత్రను నేటితరం గుర్తెరిగి స్వాతంత్ర్యాన్ని సురాజ్యంగా మార్చే మహత్తర కార్యాన్ని తమ భుజస్కంధాలపైకి తీసుకోవాలని కోరారు. ప్రతి న్యాయవాది తన వృత్తిలో జాతీయతను అంత:సూత్రంగా కలిగి ఉండాలని, నైతిక విలువలు, మానవ హక్కులు, సామాజిక రుగ్మతల నిర్మూలనకు తన వంతు కృషి చేయాలని కోరారు. విశ్రాంత జస్టిస్ ఎస్. పర్వతరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల కాలంలో సంస్థ అన్ని రాష్ట్రాలలో విస్తరించిందన్నారు. బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ విస్మరించిన లక్ష్యాలను, న్యాయవాదుల సంక్షేమాన్ని సంస్థ తన అజెండాగా స్వీకరించి పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది పరిషత్ పూర్వాపరాలను వివరించారు. న్యాయవాది పరిషత్ దక్షిణ విభాగ కార్యదర్శి, కార్ణాటక హైకోర్టు న్యాయవాది లక్ష్మినారాయణ హెగ్టే మాట్లాడుతూ కార్యకర్తలు సంస్థాగతంగా, విషయపరంగా, సంఖ్యా పరంగా విస్తరించే మార్గాలను వివరించారు. భూసేకరణపై పలు అనుమానాలను న్యాయవాది పరిషత్ ప్రవేశపెట్టిన తీర్మానంలో లేవనెత్తింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూసేకరణ చట్టం 2013లోని అంశాలను విస్మరిస్తోందని పేర్కొంది. సామాజిక ప్రభావ పరిశీలన, పర్యావరణ ప్రభావ పరిశీలన, గ్రామసభ ఆమోదం, అర్హులైన అధికారులతో అభిప్రాయసేకరణ వంటి వాటిని క్షేత్రస్థాయిలో అమలుచేయాలని పరిషత్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజు, పరాశు రాం సుదర్శన్, ఎల్.వి. సుబ్బారావు, సుధాకర్ ఛాయ, రామకోటిరెడ్డి, పవన్, ఈదర శ్రీనివాసరెడ్డి, కాయింతి రమాదేవి, జి.రాజ్యలక్ష్మి, కె. రమణ, తిరుమలరావు, మన్నవ కిరణ్‌కుమార్, హరిహర రాయలు, బండి లక్ష్మణ్, సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్ బహిరంగ లేఖ



**రాజధాని ప్రతినిధి- అమరావతి :** నేడు ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగలేఖ రాశారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో 50 వేల మంది మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోనూ ఇదే పరిస్థిత ఉందన్నారు. 17 ఏళ్లుగా ఉద్దానం మోదువారిపోతోందని పేర్కొన్నారు. ఇన్నాళ్లకైనా ప్రభుత్వం స్పందించిందని అన్నారు. వచ్చే ఏడాది నాటికైనా ఉద్దానం కళకళలాడాలని ఆ భగవంతుడిని ప్రార్ధిద్దామని లేఖలో తెలిపారు.

## అక్కినేని అమలకు నారీశక్తి అవార్డు



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి నుంచి అక్కినేని అమల నారీశక్తి అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో కృషి చేసిన 33 మంది మహిళలను ఈ అవార్డులు వరించాయి. అమల మాట్లాడుతూ తన ఆలోచనలను నివేదిక రూపంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖకు అందిస్తానన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.

# రాజ్యాంగంలో మానవ హక్కులకు ప్రధమస్థానం

**హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్**

**రాజధాని ప్రతినిధి - (గుంటూరు) :** మానవ హక్కులకు సంబంధించి రాజ్యాంగంలో బలమైన పునాదులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గుంటూరులోని ఇండియన్ టుబాకో అసోసియేషన్ కళ్యాణ మండపంలో రెండు రోజులపాటు జరగనున్న న్యాయవాది పరిషత్ ప్రథమ రాష్ట్ర స్థాయి సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గౌరవంగా జీవించే హక్కు ఉపాధి కలిగి ఉండే హక్కు, నివాస హక్కు ప్రభుత్వ దమనకాండ నుంచి రక్షించబడే హక్కునూ ప్రతి పౌరుడు కలిగి ఉన్నాదని చెప్పారు. నేరం రుజువైన ఖైదీలకు సైతం మానవ హక్కులు వర్తిస్తాయని చెప్పారు. మానవ




హక్కుల చరిత్రను, రాజ్యాంగంలో పొందుపరిచిన వివిధ ఆర్టికల్స్‌లో మానవ హక్కుల పరిరక్షణకు పేర్కొన్న విషయాలతో పాటు రాష్ట్ర హైకోర్టులు, అత్యున్నత న్యాయ స్థానాలు వివిధ సందర్భాలలో మానవ హక్కులకు బలం చేకూరుస్తూ వెలువరించిన అనేక తీర్పులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. అనంతరం హిందూ చట్టంలో వచ్చిన మార్పులను గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది పి.రామకృష్ణప్రసాద్ వివరించగా , క్రిమినల్ లా - ప్లీ బార్గెయిన్ అంశంపై విశ్రాంత హైకోర్టు జడ్జి కె.జి.శంకర్ సభలో వివరించారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాలుగా న్యాయవాదులుగా సేవలందించిన సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామరాజు, అఖిల భారత ఉపాధ్య క్షుడు కె.ఎస్.మూర్తి , చీఫ్ ప్యాట్రిన్ జస్టిస్ పర్వతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎం.ఎస్.శాస్త్రి, మన్నవ శ్రావణ్‌కుమార్ , సోమసాని బ్రహ్మానందరెడ్డి , వై.హరిహర రాయలు, కాయితి సైదారెడ్డి, శ్రీవల్లి, లక్ష్మీకాంత్ హెగ్టే, రవికుమార్‌రెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై కాలుష్య పడగ!



- అంతర్జాతీయ నివేదిక హెచ్చరిక
- రోజుకు 18 వేల మరణాలు
- దేశంలో ఓజోన్ మరణాలు ఎక్కువే !

**ప్రత్యేక ప్రతినిధి :** ఓజోన్ కారణంగా ప్రపంచంలో సంభవించే 60 శాతం మరణాల్లో ఒక్క భారత్‌లోనే 67 శాతం మరణాలుంటాయని అంతర్జాతీయ సర్వేలో తేలింది. వాసింగ్టన్, బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయాల్లోని హెల్త్ మెట్రిక్ అండ్ ఎవల్యూషన్ (ఐహెచ్‌ఎంఈ) సహకారంతో రూపొందించిన అంతర్జాతీయ పరిస్థితుల నివేదిక 2017 వాతావరణ ప్రభావం భారత్‌కే ఎక్కువ ఉంటుందని హెచ్చరించింది. వాయు కాలుష్యం కారణంగా భారత్, పొరుగుదేశంమైన చైనాల్లో 52 శాతం మరణాలు సంభవిస్తుంటాయని నివేదికలో పేర్కొన్నారు. ఆక్సైడ్స్, నైట్రోజన్. పెట్రోలియం, ఈథర్, హెక్సేన్, బెంజీన్‌ల కారణంగా వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల ఓజోన్ వాయువు వెలువడుతుంది. ఇవి చాలా తేలికగా సూర్యరశ్మితో మిళితమవుతాయి. 2010 నుంచి బంగ్లాదేశ్, భారత్ దేశాల్లో వాయు కాలుష్యం పెరుగుతూ వస్తోంది. అది ప్రస్తుతం పీఎం 2.5 సాంద్రతకు చేరుకుంది. భూ వాతావరణంలో ఉండే సూక్ష్మాతిసూక్ష్మమైన ఘన, ద్రవ పదార్థాల మిశ్రమాన్ని పర్టిక్యులేట్ మాటర్ (పీఎం) అంటారు ఇది మానవుల వల్లగానీ, సహజసిద్ధంగాగానీ ఏర్పడవచ్చు. మరో నివేదిక ఆరోగ్య, వాతావరణ మార్పులను గణించే ది లాన్సెట్ కౌంట్‌డౌన్ ప్రోగ్రెస్ నివేదిక ప్రకారం గృహ, వెలుపలి కాలుష్యం కారణంగా ప్రతిరోజూ 18వేల మరణాలు సంభవిస్తూ ఆరోగ్యంపై ప్రభావం చూపే ఒకేఒక్క వాతావరణ కారణంగా నిలుస్తోంది. నగరాల్లో 80 శాతంపై ప్రభావం చూపుతుండగా, వారిలో మధ్య, కిందిస్థాయి తరగతుల్లో 98 శాతం ఉంటోంది. ఈ నివేదికను అంగీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. దేశంలో వాతావరణ కాలుష్య పరిస్థితులతో విదేశీ అంచనాలను ఆమోదించలేమని కేంద్రం ప్రకటించింది. దేశంలోని పరిశోధనా సంస్థలు సొంతంగా అంచనాలను రూపొందిస్తాయని పర్యావరణ శాఖ మంత్రి అనిల్ దవే చెప్పారు. వాతావరణ కాలుష్య వల్లనే 10.90 లక్షల ముందుస్తు మరణాలు సంభవించా యని 2015లో పేర్కొన్నా నివేదికకు ఎటువంటి శాస్త్రీయ అంచానాలు లేవని మంత్రి అభిప్రాయపడ్డారు. వాయు కాలుష్యం ప్రభావాన్ని అంచనా వేసేందుకు తమ మంత్రిత్వశాఖ కేంద్ర ఆరోగ్య శాఖతో కలిసి పనిచేస్తోందిని, నివేదిక రావలసి ఉందని ఆయన తెలిపారు. ఆరోగ్య వాయు కాలుష్య ప్రభావం ఆరోగ్య పరిస్థితులపై లేదని భారత్ తోసిపుచ్చాల్సిన అవసరం లేదని స్పష్టమవుతుంది. అంతర్జాతీయ నివేదికలను కనీసం ప్రభుత్వం సమీక్షించడం శుభసూచకం, కానీ అదేసమయంలో కనీసం మెట్రో నగరాల్లోనైనా వాయు కాలుష్యం చర్యల్ని రూపొందించవలసివున్నది. మెట్రో నగరాల్లో వాయు కాలుష్యానికి ప్రధాన కారకాలైన ట్రక్కులు, ఆటోలు ఎటువంటి పరీక్షలకు అవకాశం లభించడం లేదు.

సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన ఆదేశాల మేరకు అన్ని పారిశ్రామిక కేంద్రలు మూడునెలల లోపు ఈటీపీ (ఎప్లయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను ఏర్పాటు చేసుకోవాలి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్‌ఈ) ప్రకారం, కోల్‌కతాలో పరిశుద్ధ వాయు ప్రమాణాల మేరకు కాలుష్యస్థాయి 44 శాతం తగ్గాలి. హైదరాబాద్‌లో 36 శాతం ముంబైలో 33 శాతం ఉండాలి అన్ని నగరాల్లోనూ ఢిల్లీ పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నది అక్కడ కాలుష్యస్థాయి 72 శాతం తగ్గాలి. బెంగళూరులో 54 శాతం తగ్గాలి. వాతావరణ కాలుష్య ప్రభావం ఎక్కువగా ఫుట్‌పాత్‌లపై, మురికి వాడల్లో నివశించే పేదవర్గాలపై ఉంటుంది. ఫలితంగా వారి ఆరోగ్యపరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపి రకరకాల జబ్బులకు కారణమవుతోంది. వారికి సరైన వైద్య సదుపాయాలు అందక మరణాలకు దారితీస్తోంది. చాలా నగరాల్లో ఉష్ణోగ్రతలు 40 సెంటీగ్రేడ్ నుంచి 50 సెంటీగ్రేడ్‌కు చేరుకునే అవకాశం ఉన్నది.

ఎటువంటి న్యాయబద్ధమైన లాజిక్ లేకుండా కేంద్రం అంతర్జాతీయ నివేదికలను వ్యతిరేకిస్తోంది.అయితే భవిష్యత్తు ఎలాంటి ఆశాజనకంగా కనిపించడం లేదు. ఎంతో భయానక పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనబడుతోంది. అందువల్ల భయానక పరిస్థితులను గమనించి వ్యూహాత్మక చర్యలతో ప్రభుత్వం ముందుకు రావలసి ఉన్నది. అంతేగాక, వాయు కాలుష్యానికి బాధ్యత వహించే పారిశ్రామికవాడలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవలసిన ఉన్నది.

# వైద్య విద్యపై కేంద్రం చిన్నచూపు

**58 కాలేజీలకు గాను కేవలం ఐదు కాలేజీలకే మూడేళ్లలో అనుమతి**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సుమారు 58 వైద్యవిద్య కాళాశాలకు అనుమతి అభించినా, వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం సమ్మతించడం లేదు. వచ్చే మూడేళ్లలో కేవలం ఐదు కాలేజీలకే అనుమతి మంజూరు చేసేందుకు అంగీకరించింది. దీన్ని బట్టి చూస్తే బీజేపీ ప్రభుత్వానికి వైద్య విద్యపై ఎంతమాత్రం ఆసక్తి ఉందో అర్థమవుతోంది. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ 19 రాష్ట్రాలకు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి తక్షణమే మెడికల్ కాలేజీలకు కావాల్సిన పనులను ప్రారంభించాలని ఆదేశించింది. 2014లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, బీహార్‌లలో 2018లోగా 58 ప్రభుత్వం వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తామని తెలిపింది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో, ప్రభుత్వం వైద్య కళాశాలలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని పేర్కొంది. భౌగోళికంగా పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 16 వైద్య కళాశాలు ఉన్నాయనీ, అంతే పెద్ద రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కేవలం ఎనిమిది, ఆరు కాలేజీలు ఉన్నాయని ఆరోగ్య మంత్రిత్వశాఖ వివరించింది. ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్ 2, మేఘాల యాలో 1, సిక్కింలో 1, త్రిపురలో 2 ప్రభుత్వ కాళాలు ఉన్నాయి. అయితే ముందుగా ప్రకటించిన ప్రకారం మొత్తంగా 58 వైద్య కళాశాలలకు గాను కేవలం ఐదింటికే అనుమతులు మంజూరు చేస్తామనీ, వీటిలో రెండు చత్తీస్‌గఢ్‌లోను, ఒకటి మహారాష్ట్రంలో, ఒకటి హిమాచల్ ప్రదేశ్‌లో, మరొకటి అండమాన్ నికోబార్ దీవుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం కేంద్ర ముందుస్తు గానే రూ. 1,500 కోట్లు విడుదల చేసింది. గతనెలలో జరిగిన సమావేశంలో కాలేజీల నిర్మాణంపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమీక్ష జరిపింది. 10-12 కేసుల్లో అసలు ఇప్పటి వరకూ శంకుస్థాపనలే జరగలేదని అధికారులు తెలిపారు. అధికారిక లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల కాన్నా, దక్షిణాది రాష్ట్రాల్లో వైద్య కళాశాలల సంఖ్య ఎక్కువగా ఉంది. వీటిలో తమిళ నాడు 24 కళాశాలలతో ముందజలో ఉండగా కర్ణాటకలో 18, ఆంధ్రప్రదేశ్ 12, కేరళలో 9, మహారాష్ట్రలో 22 కళశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏటా వైద్యవిద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా అవసరం మేరకు ప్రభుత్వం కళాశాలలను మంజూరు చేయడం లేదు. దీంతో వారంతా ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తే తాము ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందనీ, కానీ ఆ దిశగా చర్యలు తీసుకోక పోగా, ప్రైవేటు వైద్యకళాశాలను ప్రోత్స హించే విధంగా ప్రభుత్వం విధి విధానాలు ఉంటున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

## అమరావతిలో "ప్రేమాయణం"..




**అమరావతి :** ప్రేమకథా చిత్రాలు ప్రేక్షకులకు ఏమాత్రం కొత్తకాదు. అయితే నూతన రాజధాని అమరావతి ప్రాంతంలో రూపొందుతున్న ప్రేమాయణ చిత్రం నూతన నటీనటులతో నిర్మిస్తున్నారు. ఈనెల 8న చిత్రం షూటింగ్ వైకుంఠపురంలోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రారంభం అయింది. శ్రీలత సినీ క్రియేషన్స్ సినిమాను క్లాప్ కొట్టిన ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ప్రారంభించగా, ఎమ్మెల్యే ముస్తఫా కెమెరా స్విచాన్ చేశారు. సరికొత్త హీరో హీరోయిన్లతో మొదలైన ఈ ప్రేమాయణం షూటింగ్ అంతా అమరావతి, గుంటూరు పరిసర ప్రాంతాలలో సాగుతుంది. కె.శ్రీలత నిర్మాతగా ఉన్న ఈ సినిమాకు హీరో విశాల్, హీరోయిన్ ప్రియాంక శర్మ, దర్శకుడు సురేష్ యడవల్లి. బాహుబలి ఫేమ్ మేకా రామకృష్ణ, చత్రపతి విలన్ శేఖర్, శ్రీలత, ఈశ్వరరావులు నటిస్తున్నారు. వీరితో పాటు జబర్దస్త్ టీం సినిమాలో కామెడీ తో కితకితలు పెడతారు. చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్, మేనేజర్ వై. నరేస్‌కుమార్, ఎడిటింగ్ ఉద్ధవ్. ప్రొడక్షన్ కంట్రోలర్ బిక్కం రవీందర్. హీరోయిన్ ప్రియాంక శర్మ, మరో హీరోయిన్ శ్రీలతపై ముహూర్తం షాట్ తీశారు. నీతో ఎన్నటికీ ఫ్రెండ్ షిప్ తో ఉంటా...అంటూ హీరోయిన్ డైలాగ్స్ పలకగా, కెమేరా ఎమ్మెల్యే ముస్తఫా రోల్ చేశారు. అంతకు ముందు వైకుంఠపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో చిత్ర యూనిట్ పూజలు చేశారు.

## నెల్లూరులో మహిళా దినోత్సవం రోజున మహిళకు అవమానం


**నెల్లూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున టీడీపీలో ఓ మహిళా నేతకు తీవ్ర అవమానం జరిగింది. మంత్రి నారాయణ సమక్షంలోనే ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి అలిగి వెళ్లిపోయారు. ఈ ఘటన నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో చోటుచేసుకుంది. టీడీపీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కానీ ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి నిర్మలకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో ఆమె పిలవక పోయినా హాజరై నేతలపై భగ్గుమన్నారు. తాను పార్టీలో సీనియర్‌నని, ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిలో ఉన్నానని, ఇది మీకు న్యాయమేనా అంటూ మండిపడ్డారు. తన పార్టీలోని వారే తనకు గుర్తింపు ఇవ్వడం లేదంటూ ఏకంగా నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలోనే మహిళా నాయకులను కడిగిపడేసారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పొతూరు శైలజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మహిళా నేతలు హాజరయ్యారు. అదే కార్యక్రమానికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి వెళ్లారు. ఇతరుల ద్వారా కార్యక్రమ వివరాలను తెలుసుకున్న స్టేట్ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి నిర్మల పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమానికి సంబంధించిన సమాచారం తనకు ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా నేతలతో వాగ్వాదానికి దిగారు. తాను మొదటి నుండి చూస్తున్నానని, తాను టీడీపీ నాయకురాలినే కదా, నాకెందుకు కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదు..ఇదెక్కడి న్యాయం అంటూ అందరి ఎదుట ఆమె ఆవేదన వ్యక్తం చేస్తారు. అందరూ పొరపాటు జరిగిపోయిందని సర్దిచెప్పారు. అనంతరం పొత్తూరు శైలజతో కలిసి కేక్ కట్ చేసి అక్కడి నుండి వెళ్లిపోయారు.

## మీడియా స్వేచ్ఛకు పరిమితులు విధించలేం

సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో మీడియా పాత్రపై సిట్ విచారణను కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసి పుచ్చింది. ఇది మీడియాపై విచారణకు ఆదేశాలివ్వం' అని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సీనియర్ జర్నలిస్టు హరీ జైసింగ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సర్వోన్నత ధర్మాసనం కొట్టివేసింది. మీడియా స్వేచ్ఛను హరించేలా కుట్ర జరుగుతున్నట్టు తోస్తోందని ఇలాంటి ఫిర్యాదులను అంగీకరించమని పేర్కొంది. 'ఈ విధంగా మీడియా స్వేచ్ఛను హరించలేం. మన ప్రజాస్వామ్యంలో మీడియాకు స్వేచ్ఛ ఇవ్వబడింది' అని ధర్మాసనం తెలిపింది. ఎవరైన వ్యక్తుల ప్రత్యక్ష జోక్యం ఉన్నట్టు దర్యాప్తు సంస్థలకు సాక్షాధారాలు లభిస్తే.. విచారణకు అనుమతినిస్తామని జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ మోహన్ ఎం శాంతనాగౌడర్‌తో కూడిన ధర్మాసనం వెల్లడిం చింది. ప్రస్తుతానికి మీడియాపై దర్యాప్తునకు ఆదేశించలేమని తేల్చిచెప్పింది. వీవీఐపీ హెలికాప్టర్ ఒప్పందానికి అనుకూలంగా నిర్ణయం వచ్చేలా ప్రభావితం చేసేందుకు కొంతమంది మీడియా ప్రతినిధులకు చాపర్ సంస్థ లంచాలిచ్చినట్టు సింగ్ తరపు సీనియర్ న్యాయవాది గీతా లూత్రా వాదించారు. ఈ కేసులో మీడియా పాత్రపై విచారణ జరిపించాలంటూ సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కి ఆదేశివ్వాలని కోరారు. మీడియా పాత్రపై ఏ విధంగా విచారణ జరుపుతారని, ఈ పిల్‌ను కొట్టివేయాలంటూ కేంద్రప్రభుత్వం తరపు అటార్నీ జనరల్ ముకుల్ రొహత్గి కోర్టుకు విన్నవించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య 'మీడియా మేనేజ్‌మెంట్ అగ్రిమెంట్' జరిగిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఈ అగ్రిమెంట్ రిజిస్టరైందా? ఇది అంగీకారయోగ్యమైనదా?' అని అడిగింది. 'మీడియా స్వేచ్ఛపై పరిమితులు విధించలేమని పేర్కొంది. కొంత మంది జర్నలిస్టులు, వారి కుటుంబాలను ఇటలీకి పంపి నట్టు పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, యూపీఏ హయాంలో జరిగి ఈ ఒప్పందం కోసం భారీగా ముడుపులు చెల్లించారన్న ఆరోపణలు వచ్చిన విషయం విదితమే.

## ఎస్సీకాలనీలో రెండు బృందాలు సర్వే



**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎస్సీకాలనీలో ఆర్అండ్ బీ అధికారులు సర్వే నిర్వహించారు. ఇళ్లనిర్మాణం ఎప్పుడు చేశారని, ఎంతకాలం అయింది ? ఎంత ఖర్చుఅయింది లాంటి వివరాలను అడిగి తీసుకున్నారు. అయితే ఇళ్లు కోల్పోయిన వారికి మాత్రం సీఆర్‌డీఏ అధికారులు నష్టపరిహారాన్ని ప్రకటిస్తారన్నారు. డీజీపీఎస్ అధికారులు కూడా శాటిలైట్ల ద్వారా కొలతలు తీసుకున్నారని తెలుస్తోంది.

## ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు విజయ్ మాల్యా రెడీ

**న్యూఢిల్లీ :** బ్యాంకులకు వేలకోట్ల రుణాలను చెల్లించకుండా లండన్ చెక్కేసిన లిక్కర్‌కింగ్ విజయ్ మాల్యా బ్యాంకులతో సెటిల్‌మెంట్‌కు సిద్ధపడినట్లు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఈ మేరకు బ్యాంకులతో చర్చాలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ట్వీట్ చేశారు. విదేశాల్లో ఉన్న మాల్యాను వెనక్కి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సుప్రీంకోర్టు సీరియస్‌గానే స్పందించింది. పబ్లిక్ రంగా బ్యాంకులు వన్‌టైం సెటిల్‌మెంటు విధానాన్ని పాటించడం మామూలేనని, ఈ విధంగా వందలమంది రుణగ్రహీతలు తాము తీసుకున్న లోన్లను సెటిల్ చేసుకొనడం పారిపాటేనని తనను ఎందుకు నిరాకరిస్తున్నారని మాల్యా ప్రశ్నించారు. ఈ వివాదాన్ని పరిష్కారదిశగా సెటిల్ చేకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాల్యా పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని వివాదానికి స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేసారు. ఎటువంటి విచారణ చేపట్టకుండా ప్రభుత్వ తరహాపై ఆరోపణలు వేసినప్పటికీ ప్రతి కోర్టు ఆర్డర్‌ను తాను అంగీకరించానని చెప్పుకున్నారు. సుప్రీంకోర్టులో అటార్నీ జనరల్ తనపై వేసిన ఆరోపణలు ప్రభుత్వానికి తనపై ఉన్న వ్యతిరేకతలకు నిదర్శనమన్నారు. డియోజియో సంస్థ నుంచి పొందిన 40 మిలియన్ డాలర్లను డిపాజిటల్ చేసేలా ఆయనపై చర్యలు తీసుకోవాలని దాకలైన వేర్వేరు పిటిషన్లపై తీర్పును అత్యున్నత న్యాయస్థానం రిజర్వు చేసింది. వడ్డీతో సహా దాదాపు రూ.9,000 కోట్ల రుణాల బకాయిలు కేసులో ఎస్‌బీఐ నేతృత్వంలోని 17 బ్యాంకుల కన్సార్టియం ఈ పిటిషన్ దాఖలుచేయడమైంది. జరిగిన ఈ కేసు విచారణలో మాల్యా తరపు న్యాయవాది సీఎస్ వైద్యనాధన్‌పై సుప్రీంకోర్టు వరుసగా ప్రశ్నలు సంధించింది. ఆస్తుల గురించి కూడా సరైన వివరాలను అందించారా అంటూ జస్టిస్ అదర్స్‌కుమార్ గోయెల్, యూకే లలిత్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం మాల్యాను ప్రశ్నించింది.

---


తమకు ఏమాత్రం సంబంధంలేని జవాన్ల దేశభక్తిని, శక్తిసామర్థ్యాలను తమవిగా ప్రకటించుకొని ప్రజల నుంచి హీరోలుగా అభినందనలు అందుకోవడం అలవాటైపోయిన కేంద్ర మంత్రులకు జవాన్లు తమ తిండిపై, ఉద్యోగాలపై ఎన్నిసార్లు మాధ్యమాల్లో ఆవేదన వెళ్లగక్కినా మొద్దు నిద్దర వదిలి అధికారులపై చర్యలు తీసుకున్న సంఘటనలు లేవు.

రక్షణ మంత్రి పారెకర్ దీనిపై స్పందింస్తూ క్రమశిక్షణ తప్పకూడదని, వాటిని కంప్లయింట్ బాక్సుల్లో వేయాలని ప్రతిపాదించారు. నిజానికి అధికారులు బాక్సుల్లో వేసిన ఫిర్యాదులను పట్టించుకుంటే వారు ఫేస్‌బుక్‌ల్లో పెట్టాల్సిన అవసరం సైనికులకు ఎందుకుంటుంది ?

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పుణ్యమా అని ప్రతిఒక్కరూ ఐటీ ఉద్యోగాలకు మొగ్గు చూపుతుంటే రక్షణ వ్యవస్థలో సేవలు అందించేవారు నానాటికీ తగ్గుతున్నారు. అందుకే నేవీ, వైమానిక దళాల్లో చేరండి, హీరోలుగా జీవించండి అంటూ కేంద్రం ప్రకటనలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. సమస్య పరిష్కారం కాకుండా ఉంటే సైన్యంలో చేరేవారు కూడా ఉండరని అధికారులు, మంత్రులు గుర్తుంచుకోవాలి.

# ఆర్డర్లీ వ్యవస్థపై జవాన్ల తిరుగుబాటు బావుటా

### మొద్దునిద్ర వదలని కేంద్ర ప్రభుత్వం







నిజానికి పోలీసులు, సైనికుల్లో చాలా వరకు అధికారుల తమ విజ్ఞతను తెలివితేటలను ఉపయోగించి వ్యూహాలు రూపొందిస్తే కార్యాచరణకు మాత్రం కింది తరగతివారే నిర్వహిస్తుంటారు. ఫీల్డులో శత్రుసైనికులపై యుద్ధంకాని,లేదంటే ఉగ్రదాడులను తిప్పికొట్టినా ప్రాణాలకు తెగించి పోరాడేది మాత్రం కింది తరగతి సిబ్బందే అని గుర్తుంచుకోవాలి. ఏక్షణంలో ఎటునుంచి ప్రాణానికి ముప్పువస్తుందో తెలియని పరిస్థితుల్లో 120 కోట్ల జనాభాను కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులకు నీళ్ల టీ, సూప్ ఎండిపోయిన రొట్టెలు ఇస్తున్నారని తేజ్ బహదూర్ ఫేస్ బుక్‌లో పెట్టగానే ప్రజలు ఎంతగానో ఆవేదన చెందారు. దీనిపై దర్యాప్తు జరగాలని కోరుకున్నారు. అయితే బహదూర్‌పై అధికారుల ఉక్కుపాదం మోపారు. మరింత వివక్షకు గురిచేసి, కక్ష్య సాధింపు చర్యలు తీసుకున్నారు. రక్షణ మంత్రి దీనిపై దర్యాప్తు చేయిస్తామని మాట ఇచ్చారు. అయితే ఇంతవరకు ఏ నిందితుడినీ అరెస్టు చేసిన వార్తలు లేవు. దీన్నిబట్టి తెలిసేదేమంటే దీనిలో రాజకీయ నాయకులు ,అధికారులు ములాఖత్ అయ్యారన్నది స్పష్టం అవుతోంది. అంతే కాకుండా ఆర్డర్లీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక వార్తా పోస్టల్‌లో స్పందించిన రాయ్‌మాథ్యూస్ అనుమానాస్పద పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.. అతని భౌతికకాయం వెంట ఎవరూ రాకుండా, తిరువనంతపురం విమానాశ్రయంలో అరగంటకుపైగా ఒంటరిగా ఒదిలేశారని భార్య రోధించిన వార్తలను అనేక పత్రికలు ప్రచురించాయి.సమస్యలను ప్రస్తావించినవారిని అధికారులు, ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తూ, వారి మృతికి కారణమవుతున్నారని తెలుస్తోంది. అయినా సైనికులు వెనుకడుగు వేయబోవడంలేదు...చావో రేవో తేల్చుకుంటానికి వారు సిద్ధమవుతున్నారు.

సహాయక్ విధానంలో సమస్యలు బయటపెట్టిన సైనికుడు రాయ్ మాథ్యూ మృతిచెందిన ఘటన మరవకముందే.. మరో జవాను తన ఆవేదనను వెల్లడించాడు. సహాయక్ ఉద్యోగం అంటే సైనికులకు శిక్ష లాంటిదేనంటూ ఫేస్‌బుక్‌లో ఓ వీడియో పోస్టు చేశాడు. ఈ విధానానికి వ్యతిరేకంగా సింధవ్ జోగిదాస్ అనే జవాను మాట్లాడిన వీడియో ఒకటి ఇప్పుడు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఆర్డర్లీ పనిచేసే జవాన్లను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. సెలవుల నుంచి ఆలస్యంగా వచ్చినందుకు తమను దారుణంగా శిక్షిస్తున్నారని జోగిదాస్ అన్నాడు. ఈ విషయాలపై ఫిర్యాదులు చేసినా కూడా తమను శిక్షిస్తారని , తమ సమస్యలపై ఉన్నతాధికారులు ఎవ్వరూ స్పందించడంలేదన్నాడు. 'సహాయక్ ఉద్యోగం చేయనని చెప్పినప్పటి నుంచి అధికారులు నన్ను వేధిస్తున్నారు. నన్ను ఏడు రోజుల పాటు ఆర్మీ కస్టడీలో ఉంచారు' అంటూ జోగిదాస్ వీడియోలో మాట్లాడాడు. ఇప్పటికైనా తక్షణమే రక్షణమంత్రి చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కబెట్టాలి.

– ఖాన్

---







## జేసీ బ్రదర్స్‌లో

# మచ్చుకైనా కానరాని పశ్చాత్తాపం

నందిగామ వద్ద జరిగిన బస్సు దుర్ఘటనలో 10 మందిమృతికికారణమైన జేసీ దివాకర్స్ ట్రావలర్స్ యాజమాన్యం మచ్చుకైనా పశ్చాత్తాపం కనిపించకపోవడం విచారకరం. బాధితకుంటుంబాలకు సానుభూతి, మృతులకు సంతాపం కూడా ప్రకటించకుండా పైపెచ్చు విపక్షనేతపై అసభ్య తిట్లపురాణం విప్పడం ఆయనకే చెల్లింది. టీవీల్లోనూ, వావిధ మాధ్యమాల్లోనూ ఆయన భాష, బాడీ లాంగ్వేజ్ చూసేవారికి జుగుప్స కలిగించింది. దీనిపై అధికార పక్షం కూడా నోరు విప్పక పోవడం, వారిని అదుపులో ఉంచకపోవడం రానున్న రోజుల్లో తమకే దెబ్బతీస్తుందన్న విషయం గుర్తించకపోవడం దారుణం. ఎవరు నోరేసుకుపడితే వారే వారే గొప్పన్నట్లు ఫీలవడం మానసిక రోగం అని గుర్తించాలి. అంతకు ముందు పాలెంలో జరిగిన దుర్ఘటన (జబ్బార్ ట్రావెల్స్) ప్రయాణీకులంతా అగ్నిప్రమాదంలో మరణించిన సంఘటన తెలిసిందే.. పదే పదే ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయన్న ఆత్మవిమర్శ చేసుకోకుండా ప్రజలను భయభ్రాంతులను చేయడం, ప్రతిపక్షాలపై నోరు పారేసుకోవడం ఏమాత్రం హర్షణీయం కాదు. టోల్‌గేట్ నుంచి ప్రమాదస్థలికి 20 కిలోమీటర్లు ఉండగా, సదరు బస్సు 10 నిముషాల్లో చేరుకోవడం, బస్సు డివైడర్‌కి కొట్టుకొని 10 మీటర్ల ఎత్తు ఎగిరి కల్వర్టులోకి పడి 11 మంది మృతి చెందడంపై ఎందుకు పాలక సభ్యులు గొంతు విప్పడంలేదో తెలియడం లేదు. ఈ లెక్కలను బట్టి సదరుబస్సును డ్రైవర్ 130 కిమీ వేగంతో నడుపుతున్నారని స్పష్టం అవుతోంది. ఇలాంటి ఘటనలకు అధికారపక్షం, అధికారులు సమర్థించడం ఏమాత్రం హర్షణీయం కాదురాజధానికి అతి దగ్గరలో ఉన్న ప్రాంతంలో మంత్రులెవరూ ఘటనా స్థలాని చేరుకోకపోవడం కూడా వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అంతేకాకుండా ఇకపనై ఇలాంటి పరిస్థితులు పాలకులకు ప్రజల ప్రాణాలు పట్టవని తెలుస్తోంది. నిజానికి స్టేజికారియర్లుగా ప్రైవేటు వాహనాలు నడపకూడదు. అయితే ప్రైవేటు వాహనాల యాజమాన్యులుగా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఉండటం వల్ల నియమనిబంధనలకు తిలోదకాలివ్వడం తేలిగ్గా మారింది. పక్కా వ్యాపారం తప్ప ప్రజలకు భరోసా నివ్వని ఈ ప్రయాణాలను ప్రజలు తిరస్కరించాల్సిం అవసరం వచ్చింది. ఎందుకంటే ఈ బస్సుల వల్ల ఆర్టీసీ మనుగడ కూడా కష్టమైంది. ఏపీఎస్ ఆర్టీసీ యూనియన్ నాయకులు ఎంత గొంతుచించుకున్నా ప్రయోజనం లేకుండా ప్రభుత్వం ప్రైవేటు వాహనాలకు రెడ్ కార్పెట్ పరచడం యూనియన్లకు ఆగ్రహం తెప్పిస్తోంది. రెండు తెలుగురాష్ట్రాల్లో కలిపి 85వేల మంది ఇంకా ప్రైవేటు వాహనాలమీదే ఆధారపడుతూ ప్రాణాలకు భద్రత లేకుండా చేసుకుంటున్నారు. ఆర్టీసీ ప్రయాణీకుల అవసరాల మేరకు సర్వీసులు నడపలేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ప్రవేటు బస్సుల అనుమతి కూడా రవాణా చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని కేవలం రూ.20 వేలు సంబంధిత అధికారులకు ఇచ్చుకుంటే దేశవ్యాప్తంగా పర్యటించే అవకాశం కల్పించడం, శిక్షణకలిగిన డ్రైవర్లు లేకపోవడం ప్రయాణీకుల పాలిటి యమపాశాలుగా మారాయి. వ్యాపార లాభాలే తప్ప భద్రత పట్టించుకోని ప్రైవేటు సంస్థల వాహనాల వల్ల రోజుకు ఆర్టీసీకి రూ. 4 కోట్లు నష్టం వాటిల్లుతోంది. నిజానికి బస్సులన్నీ కాంట్రాక్టు క్యారియర్లే అంటే ఒకే చోట నుంచి ప్రయాణీకలను ఎక్కించుకోవాల్సి ఉంది. ఉదా హరణకు బస్సును బుక్‌చేసుకున్న పెళ్లివారు, లేదా తీర్థయాత్రలకు వెళ్లే వాళ్లను మాత్రమే వారు ఎక్కించుకోవాల్సి ఉండగా, బస్సు స్టాండుల్లోనూ, ఆర్టీసీ స్టాపుల్లోనూ రోడ్డురవాణా బస్సులకు అడ్డొచ్చిమరీ ప్రయాణీకలును ఎక్కిస్తున్నా బస్సు యాజమాన్యాలన్నీ బడా నేతలు కావడంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొంటుంది. రోజుకు రూ. 4 కోట్లు ప్రవేటు వ్యక్తుల జేబులను నింపుతోంది. ఏదైనా దుర్ఘటనలు జరిగినప్పుడు ప్రయాణీ కులకు భద్రతనివ్వకపోగా, బాధితులను, మృతుల కుంటుంబాలను మాట్లాడటానికికూడా భయపడే పరిస్థితులు తెస్తున్నారు. అధికారపక్షం అండతో రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆర్టీసీని పరిరక్షించడం, ప్రభుత్వం ప్రజల ప్రాణాల రక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకోకుంటే ప్రజలు, యూనియన్‌లు ఆందోళనబాట పట్టకతప్పదని ట్రేడ్ యూనియన్ నాయకులు తెలుపుతున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రతిపక్ష,అధికార పక్షాలు ప్రజల ప్రయాణ భద్రతకోసం తక్షణమే చర్యలు చేపట్టాలి.

– ఖాన్

---

# రెస్టారెంట్లలో సేవారుసుం చెల్లింపు ఐచ్ఛికం

**న్యూఢిల్లీ :** రెస్టారెంట్లలో వినియోగదారుల నుంచి వసూలు చేసే సేవారుసుం విషయంలో న్యాయనిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారు. సేవారుసుము పూర్తిగా ఇచ్ఛికమని తెలిపే నోటీసును విధిగా ప్రదర్శించాలంటూ రెస్టారెంట్లకు దిశానిర్దేశం చేసే నోటిఫికేషను జారీ అయిన 2017 జనవరి రెండు నుంచి దీనిపై చర్చ జరుగుతూనే ఉంది. కాగా, ఈ అంశంపై న్యాయనిపుణుల్లో ప్రధానంగా రెండు రకాల వాదనలు వినవస్తున్నాయి... సేవారుసుం విధించాలనే ప్రతిపాదన పూర్తిగా చట్టవ్యతిరేకమని,అహేతుకమని ఒక పక్షం వాదిస్తోంది ఐచ్ఛిక అమలు సరైనదేనంటూ మరో పక్షం సానుకూలత వ్యక్త పరుస్తోంది, అయితే, కేంద్ర వినియోగవ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదే శాలను రెస్టారెంట్లు తోసిరాజంటున్నాయి. మొత్తం బిల్లుపై 5 నుంచి 20శాతం వరకు సేవాపన్నును వినియోగదారుని నుంచి వసూలు చేస్తున్నాయి. విధిగా చెల్లించాల్సిన విలువ ఆధారిత పన్ను (వ్యాట్), సేవా పన్ను, స్వచ్ఛభారత్ పన్నులు కాక అదనంగా సేవా రుసుమునూ వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేయడం వాణిజ్య లావాదేవీగానూ ప్రముఖ వినియోగదారుల హక్కుల కార్యకర్త బిజోన్ మిశ్ర అభివర్ణించారు. పూర్తిగా అక్రమమైన సేవారుసుము వసూలు పేరుతో బిల్లులను అధికంగా చూపడం ద్వారా రెస్టారెంట్లు, హోటళ్లు అక్రమాలకు పాల్పడే వెసులుబాటు కల్పించినట్లవుతుందని మహాపాత్ర అన్నారు. సేవాపనున్నను పూర్తిగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినియోగదారుని ఇష్టాయిష్టాలతో ముడిపెట్టే ఐచ్ఛికత నోటీసుస్థానే సేవాపన్నును నిషేధించే పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తేవాల్సిన అవసరం ఉందని ఈ ఇరువురూ వెల్లడించారు. మొత్తం బిల్లుపై 10 నుంచి 15 శాతం వరకు సేవారుసుమును వసూలు చేస్తున్నట్లుగా కొన్ని రెస్టారెంట్లు



అంగీకరించాయి. కాగా, టిప్పులను ఇవ్వడమూ లేదా ఇవ్వకపోవడమనేది వినియోగదారుని ఇష్టాయిష్టాలపై ఎలా ఆధారపడి ఉంటుందో అదే విధంగాసేవారుసుము చెల్లింపు అమలు ఉండాలంటూ ప్రభుత్వ చరయను సమర్థించే విధంగా మరో సీనియరు న్యాయవాది సుకుమార్ పట్జోషీ తెలిపారు. ఉందని ఆయన అంగీకరించారు. న్యాయవ్యవస్థ నుంచే వినియోగదారుడు ఆశించే స్పష్టత వస్తుందని చెబుతూ ఇందుకుగాను న్యాయస్థానంలో రిట్ పిటిషను వేయడం మినహా వేరే మార్గం లేదని పట్జోషీ సూచించారు. ప్రభుత్వ నోటిఫికేషను కల్పించిన గందరగోళం తమను ఇక్కట్లకు గురి చేస్తోందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ పోర్టల్ 'జాగోగ్రాహక్ జాగో , కామ్ ', వినియోగదారుల ఆన్‌లైన్ ఫౌండేషను వ్యవస్థాపకుడు మిశ్ర అన్నారు. అన్ని పన్నులూ కలుపుకుని గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ) ప్రకటించే తరహాలోనే సేవాపన్ను విషయంలోనూ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రెస్టారెంట్ శ్రేణి, ఆహార పదార్థాల పరిమాణం నిర్ణీత ధరలను మెనూకార్డులో స్పష్టంగా ముద్రించాలని ఆయన చెప్పారు. వినియోగదారుని మీద సేవారుసుం భారం మోపడం

### న్యాయనిపుణుల అభిప్రాయం

వాంఛనీయం కాదన్నారు. రెస్టారెంట్ నడిచే ప్రదేశం, ఆహారం పదార్థాల నాణ్యత , పరిమాణం ఆధారంగా పోటీ తేవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటే మేలని ప్రభుత్వాలు ఆర్డినెన్స్‌ను తేవాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టంలోని వివిధ అంశాలపై కంపెనీలు, హోటళ్లు , రెస్టారెంట్ల యజమానుల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ వినియోగ వ్యవహారాల శాఖ కోరుతున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషను వివరిస్తోంది. సేవా రుసుము చెల్లింపు వ్యవహారం పూర్తిగా వినియోగదారుని ఇష్టాయిష్టాలకే వదిలి వేయాలని స్పష్టం చేస్తోంది. కాగా, ప్రభుత్వం ఐచ్ఛికంగా ప్రకటించిన సేవా రుసుమును వసూలు చేసే రెస్టారెంట్లకు వ్యతిరేకంగా వినియోగదారులు వారి వారి పరిధిలోని వినియోగదారుల ఫోరాలను ఆశ్రయించవచ్చంటూ న్యాయనిపుణులు చెబుతున్నారు ప్రభుత్వం నోటిఫికేషనుకు వ్యతిరేకంగా వినియోగదారుని నుంచి సేవా రుసుమును వసూలు చేసే రెస్టారెంట్లపై వినియోగదారుల రక్షణ చట్టం, 1986 ప్రకారం అపరాధరుసుమును వసూలు చేసే రెస్టారెంట్లపై వాటి సమీపంలోని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సదరు ఫిర్యాదు ఆధారంగా పొందే ఎఫ్ఐఆర్ సాయంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని ఆయన సూచించారు. మెనూలో ముద్రించిన ధరల కన్నా ఎక్కువ వసూలు చేయడం వినియోగదారుల రక్షణ చట్ట ఉల్లంఘనే అవుతుందని ఆయన తెలిపారు. అంతిమంగా సేవారుసుము చెల్లించాల వద్దా అనే అంశం పూర్తిగా వినియోగదారుని విచక్షణతో ముడిపడిన అంశమని న్యాయనిపుణులు స్పష్టం చేశారు.


## ఎ.టి.ఏ అధ్యక్షుడు మళ్లీ బాబ్జీనే...



ఎ.టి.ఎ ఎన్నికల అధ్యక్ష పదవికి పోటి చేస్తున్న శ్రీ రాజనాల వెంకట రామణారావు (బాబ్జి)గారికి నేను, అన్ని సంఘాలతో కలసి మద్దతు ప్రకటిస్తున్నాం. ఈ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిచి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తాం. మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

**– సాధిక్, ఐలా ఛైర్మన్ అభ్యర్థి**

## మంచి వ్యక్తిని గెలిపించండి



శ్రీ రాజనాల వెంకట రామణరావు (బాజ్జీ) మళ్లీ అధ్యక్షులుగా పోటీ చేస్తున్నారు. అయనకు చాలా కాలంగా స్నేహితుడ్ని , అభిమానిని, ఆయన సహాయ సహకారాలు మరువలేనివి, ఒక మంచి వ్యక్తిని గెలిపించాలని నేను కూడా ప్రచారం చేస్తున్నాను. కాబట్టి మీరు కూడా సహకరించాలని ప్రార్థిస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో ఐలా అధ్యక్షుడిగా మామిత్రుడు మొహ్మద్ సాదిక్ పోటిచేస్తున్నారు. వీరిద్దరి కలయికతో ఆటోనగర్ మరింత అభివృద్ధి సాధిస్తుందని నమ్ముతున్నాను. మార్చి 17 న జరగనున్న ఎ.టి.ఎ ఆధ్యక్ష ఎన్నికల్లో మా ప్రియమైన బాజ్జిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను..

**– మున్వర్ బేగ్**

## బాబ్జీకే ఓట్లు వేయండి



మూడేళ్లుగా ఎ.టి.ఎ అధ్యక్షుడు రాజనాల వెంకట రామణారావు (బాబ్జి)గారు కులమతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టారు. టైర్ అసోషియేషన్‌లోని అన్ని సమస్యలను కూడా పరిష్కరిస్తున్నారు. అలాగే హౌసింగ్ సొసైటీలో ఎక్కువ మంది మా టైర్ అసోషియేషన్ సభ్యులే ఉన్నారు. గత 15 సం॥ రాలుగా హౌసింగ్‌సొసైటీ నత్తనడకన నడిచినా మా పాలక వర్గం వచ్చాక హౌసిగ్ సొసైటీ పూర్తి కావటానికి సిద్ధంగా ఉంది. అప్పట్లో రూ. 3 లక్షలతో పూర్తవ్వాల్సిన ఇళ్లు ప్రస్తుతం రూ.30 లక్షలకు చేరుకుందని కోశాధికారి షాహీబాబా తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఐలా నుండి సాధిక్ ను గెలిపించి ఆటోనగర్‌లో ముఖ్యసమస్యలైన పారిశుద్యం,నీరు, విద్యుత్‌లను పరిష్కరిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇందిరమ్మ బాట క్రింద రూ.2 కోట్ల తో కొత్త ఆటో నగర్‌లో రోడ్లు వేయించటంలో సాధిక్ గారి పాత్ర ప్రశంసనీయమైందన్నారు. మార్చి 17న జరగబోయే ఎన్నికల్లో బాబ్జిగారికి అందరు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

**– హుస్సేన్ బాబా, ఎటిఎ ప్రస్తుత కోశాధికారిని**

# మళ్లీ పోటీ చేస్తున్నా..




ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఎ.టి.ఎ)అధ్యక్షుడిగా మూడేళ్ల నుంచి ఆటోనగర్ కార్మికులకు కోసం అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఈనెల 17న జరగనున్న ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయల్సిందని అసోసియేషన్ కోరడంతో పోటీ చేస్తున్నానని రాజనాల వేంకట రమణారావు (బాబ్జీ) తెలిపారు. లారీ ఫీల్డుకు చెందిన మా నాన్న ఆంజనేయులకు 1966లో అప్పటి ప్రభుత్వం లారీ షెడ్డుకోసం ఆయనకు చిన్న ప్లాటును కేటాయించిందని, ఆర్థికంగా వెలుసుబాటులేక ఇంజనీరింగ్ చదువును ఆపేసి, నాన్నకు చేదోడు వాదోడిగా ఉండటంతో ఇక్కడి సమస్యలపై అవగాహన ఉందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలతో ఆటోనగర్‌లో టెక్నీషియన్ల అసోసియేషన్‌ను గుర్తింపు తెచ్చామని, సాంకేతిక నిపుణుల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నానన్నారు. అసోసియేషన్ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ , జనరల్‌బాడీ సమావేశంలో సమస్యల సాధనకు కృషి చేస్తున్నానన్నారు. ఆటోనగర్‌లో పారిశ్రామిక సంస్థలకు ఉచిత మంచినీటిని అందచేస్తానన్న వాగ్దానాన్ని నిలుపుకుంటానని స్పష్టం చేశారు. చోలవరం ఫైనాన్స్ కంపెనీ ద్వారా రూ. 76 లక్షలతో తాగునీటి ప్లాంటును ఏర్పాటు చేసి 20 లీటర్ల మినరల్ వాటర్‌ను రూ. 3 లకే సరఫరా చేసేందుకు తీసుకున్న చర్యలను కొంతమంది స్వార్థపరులు అడ్డుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి, ప్లాంటును ఏర్పాటు చేసి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆటోనగర్‌లో

### ఎన్నికల వాగ్దానాలు నెరవేరుస్తా : బాబ్జీ

పనిచేసే టెక్నీషియన్స్‌కోసం హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని గత పాలక వర్గం 15 ఏళ్లు నిర్లక్ష్యం చేసిందని, అయితే గత మూడేళ్లలో హౌసింగ్ సొసైటీని ఏర్పాటుకు సహాయ,సహకారాలు అందించామన్నారు. జవహర్ ఆటోనగర్‌లోని కార్మికుల కోసం నిర్మిస్తున్న ఇళ్లు ప్రస్తుతం 60 శాతం పూర్తయ్యాయన్నారు.

ఎ.టి.ఎ తరపున కరెంటు సబ్ స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరడంతో స్పందించిన అధికారులు ఉచితంగా స్థలం మంజూరు చేశారన్నారు. దీంతో అసోసియేషన్ సబ్‌స్టేషన్‌ను నిర్మించుకున్నామని, దీనికి సభ్యులంతా సహకరించారన్నారు. ఆటోనగర్ స్థలాభావం వల్ల ఇతర ప్రాంతంలో ఈ నిర్మాణం జరిగిందన్నారు. టెక్నీషియన్ల సమస్యలపై పోరాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని బాబ్జీ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆటోనగర్‌లో క్లస్టర్లద్వారా మంచి నీటిని అందించేందుకు పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ నీరందక ఆ పథకం ఆశించిన ప్రయోజనాలను అందించలేకపోయిందన్నారు. ప్రసుతం ఈ పథకాన్ని పునరుద్ధరించడానికి కార్పొరేషన్‌కు రూ. 25 లక్షలు కట్టాల్సి ఉందని, అయితే రూ. 5 నుంచి 10 లక్షలు చెల్లించడానికి ఎ.టి.ఏ సిద్ధంగా ఉందన్నారు. విజయవాడ ఆటోనగర్‌ను ప్రభుత్వం అత్యున్నతంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తోందని, అందులో భాగంగా టెక్నికల్ వర్కర్లకు సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని బాబ్జీ తెలిపారు. కుల,మతాలకు అతీతంగా వర్కర్లంతా కలసిమెలసి ఉండటానికి స్నేహవాతావరణం కల్పిస్తున్నామన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఐలా ఛైర్మన్‌గా సాధిక్ పోటీ చేస్తున్నారని, ఆయన గెలుపు అనంతరం ఆటోనగర్ అభివృద్ధికి అందరం కలసి కృషి చేస్తామన్నారు.



నేను 3 దఫాలుగా టైర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడుగా ఉన్నాను. నాకు సంస్థలో అందరి నుండి మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఏటిఏ అధ్యక్షులు రాజనాలవెంకట రామణా (బాబ్జి) మంచి వ్యక్తి . ఆయన అందరూ సహకరించి గెలిపించవలసిందిగా కోరుతున్నాం.

**– టైర్‌మర్చట్ గౌరవ మాజీ అధ్యక్షులు షేక్ ఇమాంసాబ్**



ఏటిఏ బాబ్జీ నాయకత్వంలో సమస్యలు పరిష్కారం అవుతు న్నాయి. ఇది అభినందనీయం. ఏటిఏ అధ్యక్షునిగా బాబ్జీ ఎన్నికకు అన్ని ముస్లిం సంఘాలు మద్దతున ప్రకటిస్తున్నాం..

**– హాజీ ఇబ్రహీం(హెడ్), యునైటెడ్ ముస్లీం సొసైటీ కన్వీనర్**




మా నాయకుడు బాబ్జి పాలన నిష్పక్షపాతంగా అందరి సేవలు అందిస్తున్నారు. ఆయన మంచి వ్యక్తి. ఆయనకు ఆఖండవిజయం చేకూర్చితే మరిన్ని సేవలు చేస్తారు. దీనికి ఐలా కూడా మద్దతియిస్తుంది.

**– కె. సత్యనారాయణ , ఎ.టి.ఎ వైస్ ప్రెసిడెండ్‌ని**

# ఏడుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- ఐదుగురు టీడీపీ, ఇద్దరు వైసీపీ
- ఆళ్ళ నానికి డిక్లరేషన్ అందజేసిన అసెంబ్లీ కార్యదర్శి









**రాజధాని ప్రతినిధి ; (అమరావతి) :** ఎమ్మెల్యే కోటా నుండి ఎమ్మెల్సీ పదవులకు నామినేషన్లు వేసిన ఏడుగురు ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. వీరిలో టీడీపీ ఎమ్మెల్సీలుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, కరణం బలరామ్, డొక్కా మాణిక్యవరప్రసాద్, పోతుల సునీత, చబ్బుల అర్జునుడు, వైసీపీ ఎమ్మెల్సీలుగా ఆళ్ళ నాని, గంగుల ప్రభాకర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఉన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.ఇదిలా ఉండగా వైసీపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆళ్ళ నానికి అసెంబ్లీ ఇన్‌చార్జి కె. సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు డిక్లరేషన్ ఫారాన్ని అందజేశారు.

# ట్రంప్ కార్ గురించి తెలుసా...



అమెరికా అధ్యక్షుడికి భద్రత ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తీసుకునే ఆహారం నుంచి పయనించే వాహనం వరకు ప్రతి విషయంలో నిఘా ఉంటుంది. అధికారులు అత్యంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు. మరి అలాంటిది అగ్రరాజ్య అధ్యక్షుడు ఉపయోగించే కారంటే..మామూలుగా ఉంటుందా? ఆ కొత్త కారు గురించి ఆసక్తికరమైన విషయాలు..

ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉపయోగిస్తున్న కొత్త కారును 'బీస్ట్ 'అని పిలుస్తున్నారు. జనవరి లోనే ఈ కారు ఉపయోగించాల్సింది. కానీ అప్పటికి ఆ కారు సిద్ధం కాలేదు. ఇలాంటి కార్లు మొత్తం 12 ఉంటాయి.

**కంపార్ట్‌మెంట్ :** అధ్యక్షుడుతో కలిసి నలుగురు కూర్చునే సదుపాయం ఉంటుంది. ప్రతి వ్యక్తిని సపరేట్ చేస్తూ.. గ్లాస్ పార్టీషన్ ఉంటుంది. అధ్యక్షుడు మాత్రమే ఆ అద్దాలను కిందకు దింపగలడు.

**తలుపులు :** ఈ కారు తలుపుల మందం 8 అంగుళాలు. బోయింగ్-757 విమానానికి ఉండే లాంటి తలుపులే వీటికి ఉంటాయి.

**చౌఫ్యుర్ :** ఈ కారు డ్రైవర్‌కు అమెరికా రహస్య సేవ విభాగ అధికారులు శిక్షణ ఇస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో 180 డిగ్రీల'జె' టర్న్‌తో కారును తప్పిచగల సామర్థ్యం కూడా ఉంటుంది.

**కిటికీలు :** ఐదు అంగూళాల మందంతో రూపొందించిన అద్దాలను ఈ కారుకు కిటికీలుగా అమర్చారు. బుల్లెట్లను ఆపే శక్తి వీటికి ఉంది.

**డ్రైవర్స్ కంపార్ట్‌మెంట్ :** ఇందులోని డాష్‌బోర్డులో కమ్యూనికేషన్ సెంటర్, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌లు ఉంటాయి. కారులోనే సెల్ టవర్ కూడా ప్రత్యేకంగా ఉండటం విశేషం.

**బూట్ :** అగ్నిమాపక పరికారాలు అమర్చి ఉంటాయి.

**రేర్ సీట్స్ :** అధ్యక్షుడి సీటుకే శాటి లైట్ ఫోను ఉంటుంది. ఈ ఫోనుకు ఉపాధ్యాక్షుడు పెంటగోన్(ఆమెరికా రక్షణ వ్యవస్థ ప్రధాన కేంద్రం)లకు డైరెక్ట లైన్ అనుసంధానమై ఉంటుంది.

**ఇంధన ట్యాంకు :** ఇది కుడా చాలా పటిష్టంగా ఉంటుంది. దీని కింద బాంబు పేలినా ఏ మాత్రం చెక్కుచెదర కూడా ఉంటుంది.

**ఆయుధాలు :** డ్రైవర్ పక్క సీటుకు ఆనుకుని.. అత్యాధునిక ఆయుధాలతో పాటు, అధ్యక్షుడి గ్రూప్‌నకు చెందిన రక్తం ప్యాకెట్లు సిద్ధంగా ఉంటాయి.

**చాసిస్ :** రెయిన్‌ఫోర్స్‌డ్ స్టీలు పేట్లతో ఇది నిర్మితమైంది. బాంబు దాడులను కూడా ఇది తట్టుకోగలదు.

**టైర్లు :** కారుకు పంక్చర్ అయినా, పగిలిపోయినా.. అది ముందుకు వెళ్లగలదు. ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది కలగదు.

- హెడ్‌లైట్ పక్కనే ఉన్న ఈ కెమెరాలు రాత్రిపూట కూడా స్పష్టంగా ఫోటో, వీడియోగాలు తీయగలవు.
- ఒక్కో కారు బరువు- 8టన్నులు
- జీవ రసాయన దాడులను కూడా ఈ కార్లు తట్టుకోగలవు.

అత్యవసర పరిస్థితితుల్లో అధ్యక్షుడికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆక్సిజన్ అందించే వ్యవస్థ కూడా కారులోనే ఉంటుంది.

- బాష్పవాయువు ప్రయోగించే లాంచర్లు.

# గవర్నరుతో అబద్ధాలు చెప్పించారు

## వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం



**రాజధాని ప్రతినిధి ; (విజయవాడ) :** రాష్ట్ర గవర్నరు ఈఎస్ఎల్ నరసింహన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అబద్దాలు చెప్పించిందని, ప్రభుత్వం రాసిన స్క్రిప్టును గవర్నరు యథాతథంగా చదవడం బాధాకరమని ఏపీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక.. వరుసగా మూడేళ్ల పాటు కరువొచ్చి రైతులు అల్లాడుతుంటే.. దేశం కంటే... రాష్ట్రమే అయిదు శాతం ఎక్కువ అభివృద్ధి చెందిందంటూ' అసత్యాలు చెప్పించారని ఎద్దేవా చేశారు. అభి వృద్ధిలో ముందున్న గుజారాత్ కాని, అతిపెద్ద నగరాలు, ఆదాయమున్న కర్ణాటక, మహారాష్ట్ర కంటే ఏపీ జీఎస్‌డీపీ ఎక్కువగా వుందని చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. జీఎస్టీ వచ్చినా ప్రత్యేక హోదా వున్న రాష్ట్రాలకు రాయితీలు కొనసాగు తాయని చట్టంలో ఉంటే... చంద్రబాబు మార్పుతో ప్రత్యేక హోదా అయిపోతుందంటూ గవర్నరు ప్రసంగంలో జోడించడం విద్దూరమన్నారు. అమరావతి రాజధానిలో లాటరీ విధా నంలో ప్లాట్ల కేటాయింపు పెద్ద కుంభకోణమని, సీఎం చంద్రబాబు రియల్ ఎస్టేట్‌కు తెరతీసి, తన మనుషుల భూములను రియల్ ఎస్టేట్ జోన్లో పెట్టారని ఆరోపించారు. మంత్రులూ, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు రోడ్ల పక్కన కూడళ్లలో ప్లాట్లు దక్కాయని, రైతులకు ఎక్కడో మారుమూలన కేటాయించడం దారుణమన్నారు. ప్లాట్ల కేటాయింపులో పచ్చ చొక్కాల నేతలకు బాగా న్యాయం జరిగిందని చమత్కరించారు.టీడీపీ నేతలు పయ్యావుల కేశవ్, ధూళిపాళ్ల నరేంద్రకు నాలుగు వైపులా రోడ్లు, రెండు కమర్షియల్ జోన్ల మధ్య 12 వేల గజాల ప్లాట్లు ఇచ్చారని ఆరోపించారు. మంత్రి పల్లె రఘు కేటాయించారని, అసెంబ్లీ స్పీకరు పీఏకు వెలగపూడిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన, వినుకొండ ఎమ్మెల్యే కుమారైకు మందడంలో ఇరువైపులా వున్న ప్లాట్లు కేటాయించారని ఆరోపించిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయినా రాజ ధానిలో ఇంతవరకూ ఒక్కటీ .. శాశ్వతంగా జరగలేదని, అన్నీ తాత్కాలికం గానే ఉన్నాయని ఎద్దేవా చేశారు.నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులపై దురుసుగా ప్రవర్తించినట్లు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు.

# ఉండవల్లి చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు తెలుగు విశ్వవిద్యాలయ 'కీర్తి పురస్కారం'



**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన సుప్రసిద్ధ చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారాన్ని ప్రకటించింది. రెండు దశాబ్దాలుగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరిశోధిస్తూ వెలుగులోకి రాని విశిష్ట సమాచారాన్ని ఈయన వెలికితీసి వందలాది వ్యాసాలు, పదమూడు పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించారు. వాటితో పాటు గత విలువైన చారిత్రక సమాచారాన్ని తెలుగు ప్రజలకు అందజేస్తున్నందుకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేశామని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మంగళవారం నశీర్‌కు సమాచారం తెలిపారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించబోయే విశ్వవిద్యాలయాల పురస్కారాల ప్రదానోత్సవ సభలో కీర్తి పురస్కారాల ప్రదానోత్సవ సభలో కీర్తి పురస్కార స్వీకరణకు రావాలని నశీర్‌కు ఆయన ఆహ్వానం పంపారు. తెలుగులో చరిత్ర గ్రంథాలను ప్రచురించడంతోపాటు తెలుగు సాహిత్య చరిత్రకు సంబంధించిన సమాచారంతో 'అక్షర శిల్పులు' అనే గ్రంథాన్ని సయ్యద్ అహ్మద్ వెఉవరించి, తెలుగు,పాఠక ప్రపంచ ప్రశంసలు అందుకున్నారు.


అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా
విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెం:9440662699
Email : Info@rajadhanivartalu.com

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు
యాడ్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442


శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
ఎం.బేగ్
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హొ హొ 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.





Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18